

'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 209

గురువారం 19-10-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదు.. సమాజానికి బ్యాక్ బోన్ క్లాస్ అని నిండు మనసుతో నమ్మి, మనసా, వాచా, కర్మణా ఆచరిస్తూ రజక, నాయీ బ్రాహ్మణ, టైలర్ల జీవితాల్లో మార్పు రావాలని, వారు మిగతా ప్రపంచంతో పోటీపడి ఎదగాలని వారికి చేదోడునిస్తూ ...

వరుసగా నాలుగో ఏడాది..

"జగనన్న చేదోడు"

రాష్ట్ర వ్యాప్తంగా 3,25,020 మంది అర్హులైన రజక, నాయీ బ్రాహ్మణ, టైలర్ అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మలకు రూ. 325.02 కోట్ల ఆర్థిక సాయాన్ని కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు లో నేడు బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్న గౌరవ ముఖ్యమంత్రి శ్రీ. వైఎస్. జగన్ మోహన్ రెడ్డి...

షాపులున్న రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లకు ఏటా రూ. 10,000 చొప్పున సాయం.. నేడు అందిస్తున్న సాయంతో కలిపి ఇప్పటికే ఒక్కొక్కరికి రూ. 40,000 వరకు ఆర్థిక సాయం అందించిన జగనన్న ప్రభుత్వం..



శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి

నేడు అందిస్తున్న సాయంతో కలిపి ఈ 4 ఏళ్లలో కేవలం ఈ పథకం ద్వారా మన జగనన్న ప్రభుత్వం అందించిన మొత్తం సాయం రూ. 1,252.52 కోట్లు..



1,80,656 మంది టైలర్లకు ఈ విడత సాయంగా రూ. 180.66 కోట్ల లబ్ధి..



39,813 మంది నాయీ బ్రాహ్మణులకు ఈ విడత సాయంగా రూ. 39.81 కోట్ల లబ్ధి..



1,04,551 మంది రజకులకు ఈ విడత సాయంగా రూ. 104.55 కోట్ల లబ్ధి..

లంచాలకు, వివక్షకు తావు లేకుండా అత్యంత పారదర్శకంగా, గ్రామ/వార్డు సచివాలయాల్లో అర్హుల జాబితా డిస్‌ప్లే చేసి, సోషల్ ఆడిట్ నిర్వహించి లబ్ధిదారుల ఎంపిక..

ప్రతి ఒక్కరికీ అర్హత ఉంటే మిస్ కాకుండా సాయం అందాలని తపన పడుతున్న జగనన్న ప్రభుత్వం..

అర్హులై ఉండి పొరపాటున, ఏ కారణం చేతనైనా సంక్షేమ పథకాల లబ్ధి అందని వారికి కూడా మరో అవకాశం కల్పిస్తూ జూన్, డిసెంబర్ లలో లబ్ధిని అందజేస్తున్న జగనన్న ప్రభుత్వం..

జగనన్న చేదోడు పథకం క్రింద ఇప్పటి వరకు అందించిన లబ్ధి..

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	సాయం (రూ. కోట్లలో)
2020-21	2,98,122	298.12
2021-22	2,99,225	299.23
2022-23	3,30,145	330.15
2023-24	3,25,020	325.02
మొత్తం		1,252.52

"జగనన్న చేదోడు" కి సంబంధించి సలహాలు, సూచనలు, ఫిర్యాదుల కొరకు

జగనన్నకు చెబుదాం
1902
టోల్ ఫ్రీ నంబర్

వెనుకబడిన తరగతుల సంక్షేమం - జగనన్న ప్రభుత్వ లక్ష్యం...

శ్రీ. చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ,
వెనుకబడిన తరగతుల సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు

గమనిక: "జగనన్న చేదోడు" కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారు 19 అక్టోబర్, 2023 నాడు ఉదయం 10 గంటలకు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో బటన్ నొక్కి ఆర్థిక సాయాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తారు. ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రముఖ న్యూస్ ఛానళ్ల లైవ్ లో వీక్షించవచ్చు...

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం


OTTO®
Fashion Superstar


OTTO


O-96Y
0.33 SC


'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 209

గురువారం 19-10-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



న్యూజిలాండ్ 4/4

అఫ్గానిస్తాన్‌పై 149 పరుగుల తేడాతో కివీస్ భారీ విజయం - 10లో



లాభాలు ఒకరోజుకే పరిమితం

మళ్లీ 66 వేల స్థాయి దిగువకు సెన్సెక్స్ నిఫ్టీకి 140 పాయింట్ల నష్టం - 11లో



కేంద్ర ఉద్యోగులకు 4 శాతం డీఏ

పండుగ సీజన్‌లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు తీపి కబురు. వారికి డీఏ, డీఆర్‌ను 4% పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.

వివరాలు 6లో ▸



ఆ కిరాతకం మీదే..

గాజా సిటీలోని ఆస్పత్రిలో 500 మందిని బలిగొన్న కిరాతకులు మీరంటే మీరేనని ఇజ్రాయెల్, హమాస్ నిందించుకున్నాయి.

వివరాలు 6లో ▸



త్రిపుర గవర్నర్‌గా ఇంద్రసేనారెడ్డి

తెలంగాణ బీజేపీ సీనియర్ నాయకుడు నల్లు ఇంద్రసేనారెడ్డిని త్రిపుర గవర్నర్‌గా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నియమించారు.

వివరాలు 2లో ▸



7 దేశాలకు బియ్యం ఎగుమతులు

బాస్మతీయేతర తెల్ల బియ్యాన్ని మరో ఏడు దేశాలకు ఎగుమతి చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతించింది.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్‌చెక్

బాబుదే ఈ 'వంచన'

- వాస్తవాలన్నీ దాచిపెట్టి విద్యుత్ చార్జీలపై 'ఈనాడు' తప్పుడు కథనం
- ఈ చార్జీలు ఇప్పటివి కావు.. టీడీపీ హయాంలో నిర్దేశిత వ్యయంకన్నా ఎక్కువైన వాస్తవ ఖర్చులు
- విద్యుత్ నెట్‌వర్క్ నిర్వహణ ధరలు ఐదేళ్లకొకసారి నిర్ణయం
- విద్యుత్ నియంత్రణ మండలి అనుమతి మేరకే విద్యుత్ చార్జీలు

- వివరాలు 3లో ▸

కొత్త ఒర'బడి'!

పిల్లల్లో పెరిగిన విద్యా సామర్థ్యాలు, నైపుణ్యాలు

ప్రతి పాఠశాలలో పూర్తిస్థాయిలో సుశిక్షితులైన ఉపాధ్యాయులు

- తగ్గిపోయిన డ్రాప్ అవుట్లు.. పెరిగిన బాలికలు
- 'ప్రైవేటు' నుంచి సర్కారు స్కూళ్లలోకి భారీగా చేరికలు
- తల్లిదండ్రులపై ఏటా సగటున రూ.లక్ష తగ్గిన ఆర్థిక భారం
- విద్యార్థుల ఆరోగ్యంపైనా ప్రభుత్వం శ్రద్ధ.. గోరుముద్దతో పౌష్టికాహారం
- ప్రతి నెలా వైద్య పరీక్షలు, రక్తహీనత నివారణకు మాత్రలు
- టెక్నాలజీని నేర్పించేందుకు ల్యాబ్స్.. 8వ తరగతిలో ట్యాబ్స్
- ఆంగ్లంలో బోధన.. నాడు–నేడుతో మారిన స్కూళ్ల స్థితిగతులు
- డిజిటల్ తరగతి గదులు.. ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీలు.. టోఫెల్ శిక్షణ
- రాష్ట్రంలో 45 వేల ప్రభుత్వ పాఠశాలల్లో మారిన పరిస్థితులు
- ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ బోధన బాగుందంటూ తల్లిదండ్రుల ఆనందం



కాకినాడ జిల్లా తూరంగి జెడ్పీ హైస్కూల్‌లోని మ్యాథ్స్ ల్యాబ్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

తూరంగి, తుని నుంచి
నానాజీ అంకంరెడ్డి, సాక్షి ప్రతినిధి

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టిన విద్యా సంస్కరణలు ఫలితాలనిస్తున్నాయి. దశాబ్దాల తరబడి తగినంత మంది ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు పడ్డ విద్యార్థులకు ఇప్పుడు సుశిక్షితులైన టీచర్లు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావడంతో విద్యా సామర్థ్యాలు, పరీక్షల్లో మార్కులు పెరిగాయి. పేద పిల్లల చదువులు, ఆరోగ్య స్థితిగతులు గణనీయంగా మెరుగుపడ్డాయి. వసతుల కల్పనతో డ్రాపౌట్లు నిలిచిపోయాయి. ప్రతి నెలా పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు రక్తహీనత ఉన్న విద్యార్థులను గుర్తించి ప్రతి గురువారం స్కూళ్లలోనే ఐరన్ మాత్రలు పంపిణీ చేస్తూ భావి పౌరుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. యోగా, డ్రిల్ తప్పనిసరి చేయడంతో

మిగతా 2వ పేజీలో ▶

తల్లీ బిడ్డలకు ఆరోగ్య పరీక్షలు

గర్భిణిలు, బాలింతలు, చిన్నారులకు ప్రతి నెలా హిమోగ్లోబిన్ టెస్టులు: సీఎం జగన్

- జీవన శైలి వ్యాధుల కట్టడికి నెలకు ఒకసారి క్యాంపుల నిర్వహణ
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ అమలుపై నిశిత పర్యవేక్షణ
- అంగన్‌వాడీ సూపర్ వైజరీ వ్యవస్థ పనితీరుపై ప్రత్యేకంగా ఎస్‌వోపీ
- జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులతో ప్రతి ఇంటినీ జల్లెడ పడుతున్నాం.. రక్తహీనత, పౌష్టికాహార లోపం బాధితులను గుర్తిస్తూ నివారణ చర్యలు
- మందుల బాధ్యత ఆరోగ్య శాఖది.. పౌష్టికాహారం బాధ్యత మహిళా శిశు సంక్షేమ శాఖకు..
- సచివాలయాలవారీగా సమన్వయంతో గ్రామస్థాయిలో రక్తహీనత పూర్తిగా నివారణ
- మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖపై సమీక్షలో సీఎం జగన్



సాక్షి, అమరావతి: రక్త హీనతను పూర్తి స్థాయిలో అరికట్టి ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు గర్భిణిలు, బాలింతలు, పిల్లలకు ప్రతి నెలా హిమోగ్లోబిన్ పరీక్షలు చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. జీవన శైలిలో మార్పుల కారణంగా వస్తున్న వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, వ్యాయామాల ఆవశ్యకతను వివరిస్తూ క్యాంపులు నిర్వహించాలని సూచించారు. ఇందుకోసం ప్రతి నెలా ఒకసారి క్యాంపు నిర్వహించేలా

మిగతా 2వ పేజీలో ▶

24న విజయ దశమి సాధారణ సెలవు

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: విజయదశమి (తిథి ద్వయం) పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 24వ తేదీ మంగళవారం సాధారణ సెలవు దినంగా రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె ఎస్.జవహర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో 23వ తేదీ సాధారణ సెలవుగా ప్రకటించారు. ఇది యథావిధిగా కొనసాగుతుంది. ఈనెల 24వ తేదీని ఐచ్ఛిక సెలవుగా ప్రకటించగా విజయదశమి (తిథి ద్వయం) పురస్కరించుకుని, ఐచ్ఛిక సెలవుకు బదులుగా సాధారణ సెలవు దినంగా ప్రకటిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు సీఎస్ జవహర్ రెడ్డి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



హరినాథ్ కిరణ్మయి సుమతి విజయ్

ఏపీ హైకోర్టుకు నలుగురు అదనపు జడ్జీలు

హరినాథ్, కిరణ్మయి, సుమతి, విజయ్ నియామకానికి రాష్ట్రపతి ఆమోదం

- నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం.. శుక్రవారం ప్రమాణం
- ఏపీ హైకోర్టుకు జస్టిస్ గుహనాథన్ నరేందర్ బదిలీ
- ఏపీ హైకోర్టు నుంచి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ వెంకటరమణ బదిలీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా నలుగురు నియమితులయ్యారు. నూనెపల్లి హరినాథ్, మండవ కిరణ్మయి, జగడం సుమతి, న్యాపతి విజయ్ నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం ఆమోద ముద్ర వేశారు. వీరి నియామకాలను నోటిఫై చేస్తూ కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ సైతం జారీ చేసింది. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెండేళ్ల పాటు వీరు హైకోర్టులో అదనపు న్యాయమూర్తులుగా కొనసాగుతారు. వీరితో శుక్రవారం ఉదయం



జస్టిస్ నరేందర్

హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయిస్తారు. కాగా.. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గుహనాథన్ నరేందర్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. ఆయన ఎప్పుడు ప్రమాణ స్వీకారం చేస్తారన్న

మిగతా 2వ పేజీలో ▶

సెల్‌ఫోన్లలో 'ఆరోగ్యశ్రీ'

- యాప్ ద్వారా నెట్‌వర్క్ ఆస్పత్రులు, వైద్య పరీక్షలు, చికిత్స సమాచారం తెలుసుకునేందుకు వీలు
- మెడికల్ రిపోర్టుల డౌన్‌లోడ్‌కూ వెసులుబాటు
- ఆరోగ్యశ్రీ కార్డుదారుల ఫోన్లలో యాప్ ఉండేలా ప్రభుత్వం చర్యలు



ఇప్పటివరకు 6.83 లక్షల మంది ఫోన్లలో యాప్ డౌన్‌లోడ్

8లో

15 నుంచి కులగణన

- ఉన్నతాధికారులతో ప్రత్యేక అధ్యయన కమిటీ ఏర్పాటు
- బీసీ సంఘాల సలహాలు, సూచనల కోసం రౌండ్ టేబుల్ సమావేశాలు
- గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా సమాచార సేకరణ
- వివరాల నమోదుకు ప్రత్యేక యాప్
- స్వాతంత్ర్యం తర్వాత ఏపీలోనే తొలిసారిగా కులగణన
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ





సాక్షి, అమరావతి: వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం రాష్ట్రంలో నవంబర్ 15 నుంచి సమగ్ర కులగణనకు శ్రీకారం చుడుతున్నట్టు బీసీ సంక్షేమ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ తెలియజేశారు. సచివాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కుల గణన ద్వారా ఎస్సీ, ఎస్టీలతో పాటు బీసీ వర్గాలను సైతం గుర్తిస్తామన్నారు. అనంతరం వారి అభ్యున్నతి కోసం వివిధ కులాలకు చెందిన కార్పొరేషన్ల ద్వారా తగిన పథకాలు రూపొందించి అమలు చేసేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ప్రతి పదేళ్లకు ఒకసారి జరిగే జనగణనతో పాటు సమగ్ర కులగణన జరిపించాలని గత బడ్జెట్ సమావేశాల్లో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించినా ఇప్పటి వరకు సమాధానం రాలేదన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న అధికారాలకు అనుగుణంగా ఏపీలో కులగణన చేయించాలని ఇటీవల శాసన సభ సమావేశాల్లో తీర్మానించినట్లు మంత్రి చెప్పారు. ఇందుకు అనుగుణంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, గ్రామ, వార్డు సచివాలయ శాఖలకు చెందిన ముఖ్య కార్యదర్శులతో ఒక అధ్యయన కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ నేతృత్వంలో

మిగతా 5వ పేజీలో ▶

ఇదండీ జగత్



ఒకేసారి అన్ని హామీలిస్తే ఎలా తట్టుకుంటాడనుకున్నావ్?

నేడు 'జగనన్న చేదోడు' సాయం

- వరుసగా నాలుగో ఏడాది పథకం అమలు
- అర్హులైన లబ్ధిదారులకు రూ.10 వేలు చొప్పున సాయం
- 3,25,020 మంది రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలరింగ్‌లో ఉన్న అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మలకు అమలు
- సీఎం జగన్ చేతుల మీదుగా రూ.325.02 కోట్లు పంపిణీ
- ఎమ్మిగనూరు బహిరంగ సభలో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ.. నేటి సాయంతో కలిపి ఈ నాలుగేళ్లలో ఈ పథకానికే రూ.1,252.52 కోట్లు



2లో

'మణప్పురం'లో బంగారం మాయం

10.660 కిలోల ఆభరణాలు చోరీ చేసిన బ్రాంచ్ హెడ్ పావని

ఆమెకు సన్నిహితంగా ఉన్న మరో వ్యక్తి సహకారం

కృష్ణా జిల్లా కంకిపాడులో ఘటన

కేసు నమోదు చేసిన పోలీసులు

- వివరాలు 5లో ▸

రామోజీ, శైలజపై చర్యలన్నీ 8 వారాలు నిలిపివేత

మార్గదర్శి షేర్ల అక్రమ బదలాయింపు వ్యవహారంలో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

వారిద్దరిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని సీఐడీకి ఆదేశం

తదుపరి విచారణ డిసెంబర్ 6కి వాయిదా

- వివరాలు 8లో ▸

కృష్ణాజలాల పంపిణీపై న్యాయ పోరాటం

కేంద్రం కొత్త విధి విధానాలపై సుప్రీం కోర్టులో ఏపీ ప్రభుత్వం రిట్ పిటిషన్

వాటి అమలును నిలిపేసేలా కేంద్రాన్ని ఆదేశించాలని వినతి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు కృష్ణా జలాల పంపిణీ కోసం బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్(కేడబ్ల్యూడీటీ–2)కు కేంద్ర జల్ శక్తి శాఖ ఈనెల 6న జారీ చేసిన కొత్త విధి విధానాలపై న్యాయపోరాటానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఆ విధి విధానాల అమలును నిలిపేసేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీం కోర్టులో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై ఎప్పుడు విచారించాలన్నది సుప్రీం కోర్టు నిర్ణయించనుంది.



కృష్ణా నదిలో 75 శాతం లభ్యత ఆధారంగా 2,130 టీఎంసీల లభ్యత ఉందని అంచనా వేసిన బచావత్ ట్రిబ్యునల్ 1976లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టీఎంసీలు కేటాయించింది. ఈ ట్రిబ్యునల్ అవార్డు గడువు ముగియడంతో 2004లో బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఏర్పాటైంది. ఈ ట్రిబ్యునల్ కృష్ణా జలాల పంపిణీపై 2010 డిసెంబర్ 30న ఓ నివేదికను, 2013 నవంబర్ 29న తదుపరి నివేదికను అందజేసింది. బచావత్ ట్రిబ్యునల్ 75 శాతం లభ్యత ఆధారంగా చేసిన కేటాయింపుల జోలికి వెళ్లని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్.. 65 శాతం సగటు లభ్యత ఆధారంగా 194 టీఎంసీల మిగులు జలాలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించింది. ఈ నివేదికలను సవాల్ చేస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, బేసిన్‌లోని రాష్ట్రాలు సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్సెల్పీ)లను దాఖలు చేశాయి. దీంతో బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ అవార్డు అమల్లోకి రాలేదు. రాష్ట్ర విభజన అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేసే బాధ్యతను విభజన చట్టంలో సెక్షన్–89 ప్రకారం బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కే కేంద్రం అప్పగించింది. ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు చేయని ప్రాజెక్టులకు నీటిని కేటాయించి, నీటి లభ్యత తక్కువ ఉన్న సంవత్సరాల్లో ప్రాజెక్టులవారీగా

మిగతా 9వ పేజీలో ▶

క్లుప్తంగా...

నేడు 'వైఎస్సార్' పురస్కారాల జాబితా విడుదల

సమాచార శాఖ కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, అమరావతి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరిట రాష్ట్ర ప్రభుత్వం ఏటా అందజేస్తున్న వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్, వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీతల జాబితాను గురువారం ప్రకటించనున్నట్టు సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వరుసగా మూడో ఏడాది అవార్డులను అందిస్తున్నట్టు పేర్కొన్నారు. సామాన్యుల్లో అసామాన్యులకు, పలు రంగాల్లో సమాజానికి విశిష్ట సేవలందించి తమదైన ముద్రవేసిన వారిని గుర్తించి అవార్డులు అందించనున్నామని కమిషనర్ తెలిపారు. వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీతలకు రూ.10 లక్షల నగదు, వైఎస్సార్ కాంస్య ప్రతిమ, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేస్తారు. వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీతలకు రూ.5 లక్షల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేస్తారని వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నవంబర్ 1వ తేదీన అవార్డులను ప్రదానం చేస్తామన్నారు.

స్టీల్ ప్లాంట్ స్థలం పరిశీలించిన జపాన్ బృందం



స్టీల్‌ప్లాంట్ స్థలం వద్ద జపాన్ ప్రతినిధులు

జమ్మలమడుగు: జిందాల్ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం జపాన్‌కు చెందిన ఇద్దరు ప్రతినిధుల బృందం వైఎస్సార్ జిల్లాలో బుధవారం పర్యటించింది. జమ్మలమడుగు మండల పరిధిలోని కన్యతీర్థం సమీపంలో 2019 డిసెంబర్ 23న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. మూడు వేల ఎకరాల భూమిని స్టీల్‌ప్లాంట్ కోసం కేటాయించారు. రూ.70 కోట్ల వ్యయంతో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం జిందాల్ యాజమాన్యం ముందుకు రావడంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా తిరిగి భూమి పూజ చేయించారు. మూడు మిలియన్ టన్నుల సామర్థ్యంతో జిందాల్ యాజమాన్యం పరిశ్రమ ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. అందులో భాగంగా జిందాల్ యాజమాన్యం, జపాన్ కంపెనీకి చెందిన ప్రతినిధులు స్టీల్ ప్లాంట్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. స్టీల్‌ప్లాంట్ పనులు త్వరలో ప్రారంభమవుతాయని అధికారులు పేర్కొంటున్నారు.

వీఎస్ఈజెడ్ అంచనాలకు మించి ఎగుమతులు

- 30శాతం వృద్ధితో రూ.1,04,278 కోట్ల ఎగుమతులు
- వీఎస్ఈజెడ్ జోనల్ డీసీ శ్రీనివాసరావు వెల్లడి

అగనంపూడి (గాజువాక): దువ్వాడలోని వీఎస్ఈజెడ్ అంచనాలకు మించి ఎగుమతులు సాధించింది. గత అర్ధ సంవత్సరం (ఏప్రిల్ 23–సెప్టెంబర్ 23)లో రూ.1,04,278 కోట్ల విలువైన వస్తువులు, సేవలను ఎగుమతులు చేసి విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించినట్లు దువ్వాడ వీఎస్ఈజెడ్ జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. గత ఏడాది ఇదే అర్ధ సంవత్సరాన్ని పోలిస్తే 30శాతం వృద్ధి రేటుతో ఎగుమతుల్లో దేశంలోనే అగ్రగామిగా నిలిచినట్లు పేర్కొన్నారు. సేవల విభాగంలో రూ.76,413 కోట్లు, సరుకులు విభాగంలో రూ.28,315 కోట్ల మేరకు ఎగుమతులు చేసినట్లు వివరించారు. గత జూన్ నెలాఖరుకు రూ.1,04,961 కోట్ల పెట్టుబడుల ద్వారా 6,61,579 మందికి ఉపాధి కల్పించినట్లు తెలిపారు. గత త్రైమాసికానికి 11 సెజ్ యూనిట్లు, రెండు ఈవోయూ యూనిట్లకు ప్రతిపాదనలు రాగా, ఆమోదం తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో రూ.167 కోట్ల పెట్టుబడులు, 4,048 మందికి ఉపాధి కల్పించినట్లు తెలిపారు. ఏపీలో ఐదు, తెలంగాణ ఆరు కొత్త యూనిట్లకు అనుమతులు మంజూరు చేశామన్నారు.

త్రిపుర గవర్నర్‌గా నల్లు ఇంద్రసేనా రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు చెందిన బీజేపీ సీనియర్ నేత నల్లు ఇంద్రసేనారెడ్డిని త్రిపుర గవర్నర్‌గా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నియమించారు. త్రిపుర, ఒడిశా రాష్ట్రాలకు నూతన గవర్నర్‌లను రాష్ట్రపతి నియమించినట్లు రాష్ట్రపతి భవన్ బుధవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేసింది. త్రిపుర గవర్నర్‌గా ఇంద్రసేనారెడ్డి, ఒడిశా గవర్నర్‌గా జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు రఘుబర్‌దాస్‌ను నియమించారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం, గానుగబండ గ్రామంలో జన్మించిన నల్లు ఇంద్రసేనారెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేశారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో ఆసక్తి ఉన్న ఇంద్రసేనారెడ్డి 1980లో భారతీయ జనతా పార్టీలో చేరారు.

కొత్త ఒర'బడి'!



■ ఎలక్ట్రికల్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే కాకినాడ జిల్లా తూరంగి వాసి పరమట శ్రీనుకు ముగ్గురు పిల్లలు. ఇంగ్లిష్ మీడియం కోసం వారిని ప్రైవేట్ స్కూళ్లలో చేర్పడంతో ఏటా రూ.90 వేలు ఖర్చయ్యేవి. ఇతర ఫీజులు పేరుతో మరో రూ.15 వేలు చెల్లించాల్సి వచ్చేది. రోజంతా కష్టపడితే రూ.500 సంపాదించే శ్రీను ఫీజులు కట్టడం ఆలస్యం కావడంతో ఆయన పిల్లలను బడి బయట నిలబెట్టిన సందర్భాలు ఎన్నో! ఇంటికొచ్చి పిల్లలు ఏడ్చిన సందర్భాలూ ఉన్నాయి. ఇంత ఖర్చు చేసినా ప్రైవేట్ చదువులేమీ గొప్పగా లేవని శ్రీను గతాన్ని గుర్తు చేసుకున్నాడు. 2019 నుంచి ఆయన పిల్లల చదువుల భారాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. ముగ్గురు పిల్లలను తూరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్చాడు. ఆయన పెద్ద కుమార్తెకు రెండేళ్లు జగనన్న అమ్మ ఒడి వచ్చింది. ఇప్పుడు పాలిటెక్నిక్ చదువుతూ జగనన్న విద్యా దీవెన కింద ఉచిత విద్యను పొందడంతో పాటు వసతి దీవెన కింద రూ.20 వేలు అందుకుంటోంది. టెన్త్ చదివే రెండో పాపకు అమ్మ ఒడి అందుతోంది. ఉచితంగా, పుస్తకాలు, యూనిఫారంతో పాటు బూట్లు కూడా ఇచ్చారు. ఎనిమిదో తరగతి చదువుతున్న కుమారుడికి కూడా అన్ని సదుపాయాలు అందాయి. ఇంగ్లిష్ మీడియం చదువుల కోసం తపన పడ్డ ఈ తండ్రి ఆశలను ప్రభుత్వం నెరవేర్చింది.



■ కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఉత్తర కంచిలో ఇటుకల బట్టీని నిర్వహించే మొల్లేటి బేబి కుటుంబం గతంలో బతుకుదెరువు కోసం హైదరాబాద్ వలస వెళ్లింది. కుమారుడు ఆదిత్యవర్ధన్‌ను రెండో తరగతి వరకు అక్కడే చదివించారు. ఫీజుల భారాన్ని తట్టుకోలేక తునిలోని ఓ ప్రైవేట్ స్కూల్లో ఐదో తరగతి వరకు చదివించారు. ఇక్కడా అదే పరిస్థితి తలెత్తడంతో తునిలోనే శ్రీరాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతిలో చేర్చారు. 'రెండేళ్ల నుంచి బాబులో మంచి మార్పు గమనిస్తున్నా. ప్రైవేట్ స్కూళ్లలో లేని ఎన్నో మంచి వసతులు ఇక్కడున్నాయి. ల్యాబ్‌ల్లో ప్రయోగాలు చేయిస్తున్నారు. చదువుల్లో, ఆటల్లో బాగా రాణిస్తున్నాడు. ఇంగ్లిష్ మీడియంలో బోధిస్తున్నారు. ప్రతి నెలా తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించి పిల్లల ప్రగతిని వివరిస్తున్నారు. మాలాంటి కుటుంబాలకు భారంగా మారిన పిల్లల చదువులను ప్రభుత్వమే తన బాధ్యతగా తీసుకోవడం ఎంతో గొప్ప విషయం. ప్రభుత్వ బడికి మారడంతో ఏటా ఫీజులు రూపంలో చెల్లించే రూ.50 వేల వరకు మిగులుతోంది. ఇంత గొప్ప సౌకర్యాలు, సదుపాయాలు, బోధన హైదరాబాద్‌లోని ప్రైవేట్ స్కూల్లో కూడా చూడలేదు' అంటూ ఆమె సంతోషంగా చెబుతోంది.

▶ మొదటి పేజీ తరువాయి

విద్యార్థుల ఫిట్‌నెస్‌లో మార్పు వచ్చింది. నిరంతర నీటి సదుపాయంతో కూడిన టాయిలెట్లు, ఆర్వో తాగు నీటితోపాటు మధ్యాహ్నం జగనన్న గోరుముద్దతో పోషకాహారం, రాగిజావ, చిక్కీ, వారానికి ఐదురోజులు కోడిగుడ్డు ఇవ్వడంతో విద్యార్థులు ఉత్సాహంగా చదువులపై దృష్టి సారిస్తున్నారు. బాలికలకు శానిటరీ న్యాప్‌కిన్స్ పంపిణీతో పాటు రుతుక్రమ పరిస్థితులపై అవగాహన కల్పించడంతో మానసికంగా వారిలో మార్పు వచ్చింది. రాష్ట్రంలోని సర్కారు స్కూళ్లలో ఐదారేళ్ల క్రితం వరకు 40 నుంచి 60% దాటని హాజరు ఇప్పుడు సగటున 98 శాతానికి పైగా పెరిగింది. ప్రైవేట్ నుంచి ప్రభుత్వ స్కూళ్లల్లో తమ పిల్లలను చేర్పించిన తల్లిదండ్రులు ఫీజులు రూపంలో చెల్లించే మొత్తం మిగలడం, మెరుగైన బోధనపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కాకినాడ జిల్లా తూరంగిలోని జెడ్పీ హైస్కూల్

తగినంత మంది టీచర్లు.. పీఈటీలు

కాకినాడ జిల్లా తూరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 720 మంది విద్యార్థులుండగా వీరిలో 80 మంది ప్రైవేట్ స్కూళ్ల నుంచి వచ్చిన వారే ఉన్నారు. ఇక్కడ చదువుకున్న వారిలో గత నాలుగేళ్లలో 15 మంది విద్యార్థులు ఐఐఐటీల్లో సీట్లు సాధించడం, ఆరుగురు నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందుకోవడం గమనార్హం. ఆరు నుంచి 10వ తరగతి వరకు బోధనకు గతంలో 12 మంది మాత్రమే ఉపాధ్యాయులు ఉండగా ఇప్పుడు 29కి పెరిగింది. తునిలోని శ్రీరాజా ఉన్నత పాఠశాలలో 540 మంది విద్యార్థులు ఉండగా ఎన్నో ఏళ్ల పాటు ఉపాధ్యాయుల సంఖ్య 10 మందికి మించలేదు. ఈ ప్రభుత్వం వచ్చాక ఆ సంఖ్య 17కి పెరిగింది. చాలా ఏళ్ల తర్వాత వ్యాయామ ఉపాధ్యాయుడి రాకతో విద్యార్థులు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులు ఇంగ్లిష్ బోధనను సునాయాసంగా అర్థం చేసుకోవడం, పరీక్షలు రాయడంతో పాటు సగటు మార్కుల శాతాన్ని కూడా పెంచుకోవడం గమనార్హం. వ్యాయామ ఉపాధ్యాయులను అందించడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్ధమవుతున్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ, ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ బోధన, టోఫెల్ శిక్షణతో ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులు ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలకు క్యూ కడుతున్నారు. ప్రతినెలా తల్లిదండ్రులు- ఉపాధ్యాయుల సమావేశాలను నిర్వహించడం, విద్యార్థులు సాధిస్తున్న ప్రగతిని విశ్లేషించడం, అవసరానికి తగ్గట్టు బోధనతో పిల్లల్లో నేర్చుకునే సామర్థ్యాలు, నైపుణ్యాలు మెరుగుపడ్డాయి. నాలుగేళ్లలో ప్రభుత్వ విద్యా వ్యవస్థల్లో చోటు చేసుకున్న విప్లవాత్మక మార్పుల ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తుని, తూరంగిలోని ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన 'సాక్షి' ప్రతినిధి వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు తమ ఆనందాన్ని పంచుకున్నారు.



ఐఎఫ్‌పీపై విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయురాలు

మారిన తలరాతలు.. వెలుగు నిండిన స్కూళ్లు

తల్లిదండ్రులకు ఆర్థిక భారంగా మారిన పిల్లల చదువుల బాధ్యతను పూర్తిగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం పుస్తకాల నుంచి యూనిఫారం దాకా సర్వం సమకూరుస్తోంది. పిల్లలకు స్కూళ్లలో నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించడంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలోనే చేర్పినా గతంలో ఒక్కో కుటుంబం పుస్తకాలు, యూనిఫారం కోసం ఏటా రూ.రెండు మూడు వేలు వెచ్చించాల్సి వచ్చేది. బెల్టు, బూట్లు, పుస్తకాల బ్యాగు ఖర్చు దీనికి అదనం. ఈ ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితి లేదు. రాష్ట్రంలోని దాదాపు 45 వేల పాఠశాలల్లో 42 లక్షల మంది పిల్లల తల్లిదండ్రులకు చదువుల బెంగ తీరిపోయింది. బడికి పంపించినందుకు ఏటా రూ.15 వేలను జగనన్న అమ్మ ఒడి కింద ప్రభుత్వమే జమ చేస్తోంది. నాడు–నేడుతో ప్రభుత్వ స్కూళ్లు సమూలంగా మారిపోయాయి. ల్యాబ్స్, డిజిటల్ విద్య, ట్యాబ్స్, కొత్త తరగతి గదులు, ఆర్వో తాగునీరు, మరుగుదొడ్లు, బాలికలకు శానిటరీ ప్యాడ్స్ అన్నీ అందుబాటులో ఉండడంతో బాలికల చేరికలు పెరిగాయి.



టెక్నాలజీ బోధన.. టోఫెల్ శిక్షణ

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధనను కలలో కూడా ఊహించలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకోసమే గతంలో అప్పులు చేసి ప్రైవేట్ స్కూళ్లల్లో చేర్చామని గుర్తు చేసుకుంటున్నారు. ఇద్దరు పిల్లలున్న తల్లిదండ్రులకు ప్రైవేట్ స్కూళ్లలో చదివించేందుకు ఏటా సగటున రూ.లక్ష వరకు ఖర్చయ్యేదని పేర్కొంటున్నారు. తెలుగు మీడియం నుంచి వచ్చిన వారికి అర్థమయ్యేలా బైలింగ్యువల్ పాఠ్య పుస్తకాలను ఇవ్వడం పిల్లలకు ఎంతో మేలు చేస్తోందని చెబుతున్నారు. ఇక మూడో తరగతి నుంచే సబ్జెక్టు టీచర్ విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. 1,000 పాఠశాలల్లో పూర్తిగా సీబీఎస్ఈ బోధనను అందిస్తోంది. అన్ని స్థాయిల్లో పాఠ్య పుస్తకాలను డిజిటల్ పీడీఎఫ్ రూపంలో ఆన్‌లైన్‌లో ఉంచడంతో పాటు బైజూస్ కంటెంట్‌తో ఎనిమిదో తరగతి పిల్లలకు ట్యాబ్‌లను ఉచితంగా ఇవ్వడంతో చదువుల్లో రాణిస్తున్నట్లు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. 6 నుంచి 10 వరకు తరగతి గదుల్లో 30,213 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు (ఐఎఫ్‌పీ), ఎలిమెంటరీ పాఠశాలల్లో 10,038 స్మార్ట్ టీవీలతో డిజిటల్ బోధనను అందుబాటులోకి తేవడంతో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ స్కూళ్లను మించిపోయాయి. సైన్స్ ల్యాబ్‌లు, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లతో సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెరిగినట్లు విద్యార్థులు వెల్లడిస్తున్నారు. ఇక టోఫెల్ శిక్షణ పిల్లల భవిష్యత్‌కు ఎంతో ఉపయోగపడుతుందని, ఇవన్నీ ఎవరూ ఊహించని అద్భుతమైన సంస్కరణలని విద్యావేత్తలు ప్రశంసిస్తున్నారు.

ఆరోగ్య సంరక్షణ బాధ్యతలు కూడా..

ప్రతినెలా పాఠశాలలోనే విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించడం, ప్రతి గురువారం రక్తహీనత గల పిల్లలకు ఫోలిక్ ఐరన్ మాత్రలు అందజేయడంతో గతంలో 30 శాతంగా ఉన్న రక్తహీనత బాధితులు ఇప్పుడు 10 శాతానికి తగ్గిపోయారు. విద్యా రంగ సంస్కరణల కోసం నాలుగున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.66,722.36 కోట్లు వ్యయం చేసింది. జగనన్న అమ్మ ఒడి, మనబడి: నాడు–నేడు, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, పాఠ్యాంశాల సంస్కరణలు, విదేశీ విద్యాకానుక లాంటి పలు విప్లవాత్మక కార్యక్రమాలను అమలు చేసింది. పిల్లల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచే లక్ష్యంతో సమగ్ర విద్యా, పరిపాలనా సంస్కరణలు తెచ్చింది. ప్రతి బడిలోనూ డబుల్ డెస్కు బెంచీలు, కుర్చీలు, బీరువాలు, టేబుళ్ల లాంటి ఫర్నిచర్, గ్రీన్ చాక్‌బోర్డులు, పాఠశాల మొత్తానికి పెయింటింగ్, ఇంగ్లిష్ ల్యాబ్, కాంపౌండ్ వాల్ నిర్మాణం లాంటి వసతులు కల్పించింది.

ఇంతకంటే ఏం కావాలి?



మా పాప తొమ్మిదో తరగతి, బాబు ఏడో తరగతి చదువుతున్నారు. ఖర్చులు తడిసి మోపెడైనా ఇంగ్లీష్ మీడియం ఉందనే ఆశతో ఇద్దరినీ ఐదో తరగతి దాకా ప్రైవేట్ స్కూళ్లలోనే చదివించాం. జగన్ ప్రభుత్వం వచ్చాక సర్కారు స్కూళ్లలో ఇంగ్లీషు మీడియాన్ని తెచ్చింది. దీంతో పిల్లలను రాజా హైస్కూల్లో చేర్చాం. తల్లిదండ్రులతో సమావేశాలను నిర్వహిస్తూ ప్రతి నెలా పిల్లల పురోగతిని ఉపాధ్యాయులు తెలియచేస్తున్నారు. గతంలో ఎన్నడూ ఈ పరిస్థితి లేదు. ఇక పుస్తకాల నుంచి యూనిఫారం వరకు అన్నీ ఉచితమే. రోజు ఇంగ్లిష్ పదాలను నేర్పిస్తున్నారు. తల్లిదండ్రులకు ఇంతకంటే ఇంకేం కావాలి? – వేమవరపు హేమనాగలక్ష్మి, తుని

ఏం జరుగుతోందో అంతా తెలుసు..



మా చిన్నమ్మాయి తేజస్విని తూరంగి జెడ్పీ స్కూల్లో పదో తరగతి చదువుతోంది. ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న మా పెద్దమ్మాయి కూడా ఇదే స్కూల్లో చదువుకుంది. గతంలో ఇలాంటి పథకాలే లేవు. అచ్చు పుస్తకాలు మాత్రమే ఇచ్చేవారు. ఇప్పుడు బడి తెరిచిన రోజే అన్ని పుస్తకాలు, యూనిఫారం, బ్యాగుతో సహా ఇస్తున్నారు. అమ్మ ఒడి, విద్యా దీవెన అందుతోంది. మా ఇల్లు బడి పక్కనే ఉంది. అక్కడేం జరుగుతోందో నాకు బాగా తెలుసు. గత నాలుగేళ్లుగా చూస్తున్నా. ప్రభుత్వ బడి ఇంత చక్కగా మారుతుందని ఎప్పుడూ అనుకోలేదు. పేద పిల్లలకు ఇంగ్లిష్ చదువులు చెప్పించడం ఈ ప్రభుత్వంలోనే చూస్తున్నా. – జక్కా యోగీశ్వరి, తూరంగి

మరో ఐదేళ్లల్లో అద్భుతాలు



దాదాపు 25 ఏళ్లకు పైగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నా. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంత అద్భుతమైన మార్పులను చూస్తానని అనుకోలేదు. చదువులు పూర్తి స్నేహపూర్వక వాతావరణంలోకి మారిపోయాయి. నీటి సౌకర్యం ఉన్న బాత్‌రూమ్‌లు, శానిటరీ న్యాప్కిన్స్ పంపిణీతో ఆడపిల్లల డ్రాపౌట్లు ఆగిపోయాయి. మా స్కూల్లో 720 మంది పిల్లలు చదువుతున్నారు. 29 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రైవేట్ స్కూల్లో చదివే 80 మంది విద్యార్థులు ఈ ఏడాది ఇక్కడ చేరారు. గత నాలుగేళ్లుగా ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పిల్లలు మరో ఐదేళ్లల్లో అద్భుతాలు సృష్టిస్తారనడంలో సందేహం లేదు. – కదలి లక్ష్మీదుర్గ, తూరంగి జెడ్పీ స్కూల్ హెచ్‌ఎం

పూర్వ వైభవం



తుని సమీపంలోని 40 గ్రామాల కోసం 1904లో ఈ హైస్కూల్ ఏర్పాటైంది. దాదాపు 50 ఏళ్ల పాటు ఎంతో ఉన్నతంగా నడిచింది. ప్రభుత్వంలో విలీనం అయ్యాక ఆ ప్రాభవం తగ్గిపోయింది. మళ్లీ ఇన్నేళ్లకు పూర్వ వైభవం వచ్చింది. ఇదే స్కూల్లో గతంలో టీచర్‌గా పనిచేశా. ఇప్పుడు హెచ్‌ఎంగా సేవలందిస్తున్నా. నాడు–నేడు కింద అదనపు గదులు నిర్మించారు. డిజిటల్ బోధన, ఇంగ్లిష్ మీడియం సామాన్యులకు చేరువ కావాలని ఎన్నోసార్లు కోరుకున్నా. వాటితో పాటు టోఫెల్ శిక్షణను కూడా ప్రభుత్వం పేద పిల్లలకు చేరువ చేసింది. పూర్తి స్థాయిలో టీచర్లను ఇచ్చింది. విద్యార్థులు సైతం ఇంగ్లిష్ చదువుల్లో బాగా రాణిస్తున్నారు. – టి.శేషగిరి శ్రీరాజా హైస్కూల్ హెచ్‌ఎం, తుని.

ఎన్‌ఎంసీ కొత్త నిబంధనలు సడలించండి

- మెడికల్ సీట్లు, కాలేజీల విషయంలో పాత పద్ధతినే కొనసాగించండి
- కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖకు మంత్రి విడదల రజిని వినతి
- సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి మన్సూక్ మాండవీయ

సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ వైద్య మండలి(ఎన్‌ఎంసీ) తీసుకొచ్చిన కొత్త నిబంధనలతో ఆంధ్రప్రదేశ్‌కు నష్టం జరుగుతోందని, వాటిని సడలించి పాత పద్ధతినే కొనసాగించాలని కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి మన్సూక్ మాండవీయకు ఏపీ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం మంత్రి రజిని మీడియాతో మాట్లాడుతూ.. 'ఎన్‌ఎంసీ కొత్తగా పలు నిబంధనలు తీసుకొచ్చింది. ప్రతి రాష్ట్రంలోనూ ప్రతి పది లక్షల మంది జనాభాకు వంద వైద్య సీట్ల చొప్పునే అనుమతిచ్చేలా నిబంధనలు రూపొందించింది. అలాగే కొత్త మెడికల్ కాలేజీలకు అనుమతివ్వాలంటే 605 పడకల సామర్థ్యంతో ఆస్పత్రి కూడా ఉండాలని నిర్ణయించింది. ఈ రెండు నిబంధనల వల్ల ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర నష్టం వాటిల్లుతోంది' అని ఆందోళన వ్యక్తం చేశారు. 'రాష్ట్ర విభజన తర్వాత టెర్షియరీ కేర్ సర్వీసెస్ విషయంలో ఏపీ తీవ్రంగా నష్టపోయింది. ఈ నేపథ్యంలో రూ.8,480 కోట్లతో 17 కొత్త మెడికల్ కాలేజీలను వైఎస్ జగన్ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తోంది. వీటిలో ఇప్పటికే 5 మెడికల్ కాలేజీలు ప్రారంభమయ్యాయి. మిగిలిన 12 కాలేజీల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే ఏడాది మరో 5 కాలేజీలు ప్రారంభం కాబోతున్నాయి. సిబ్బంది నియామకాలు కూడా పూర్తయ్యాయి. కానీ కొత్త నిబంధనల వల్ల ఏపీకి ఒక్క మెడికల్ కాలేజీ కూడా కొత్తగా మంజూరయ్యే అవకాశం ఉండదు' అని కేంద్ర మంత్రి వద్ద ఆందోళన వ్యక్తం చేసినట్లు విడదల రజిని వివరించారు. వైద్య, ఆరోగ్య రంగంలో సీఎం వైఎస్ జగన్ తీసుకొస్తున్న సంస్కరణలకు కేంద్రం తరఫున తగిన సహకారం అందించాలని.. ఏపీ ప్రజలకు ఎలాంటి నష్టం రాకుండా చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రిని కోరినట్లు చెప్పారు. తమ వినతికి మన్సూక్ మాండవీయ సానుకూలంగా స్పందించారని ఆమె వెల్లడించారు. ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ఆదిత్యనాథ్‌దాస్, ఏపీ భవన్ అడిషనల్ రెసిడెంట్ కమిషనర్ హిమాంశు కౌశిక్, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్‌రెడ్డి, డీఎంఈ డాక్టర్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.



మాండవీయకు వినతిపత్రం ఇస్తున్న మంత్రి రజిని

ఏపీ హైకోర్టుకు నలుగురు అదనపు జడ్జీలు

▶ మొదటి పేజీ తరువాయి

విషయం తెలియాల్సి ఉంది. జస్టిస్ నరేందర్ రాష్ట్ర హైకోర్టులో నంబర్ త్రీ స్థానంలో ఉంటారు. ఇదే సమయంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ దుప్పల వెంకటరమణ బదిలీకి సైతం రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ గుజరాత్ హైకోర్టుకు, జస్టిస్ వెంకటరమణ మధ్యప్రదేశ్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. కొత్తగా వచ్చే న్యాయమూర్తులు, బదిలీపై వెళ్లే ఇద్దరు న్యాయమూర్తులతో కలిపి హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 30కి చేరుతుంది. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మున్నూరి లక్ష్మణ్ రాజస్థాన్ హైకోర్టుకు, జస్టిస్ జి.అనుపమ చక్రవర్తి పట్నా హైకోర్టుకు బదిలీ అయ్యారు.

తల్లీ బిడ్డలకు ఆరోగ్య పరీక్షలు

▶ మొదటి పేజీ తరువాయి

చూడాలన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖపై ముఖ్యమంత్రి జగన్ బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు.

ప్రతి ఇంటినీ జల్లెడ పడుతూ..

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల ద్వారా ప్రతి ఇంటిని జల్లెడ పట్టి రక్తహీనత, పౌష్టికాహార లోపం బాధితులను గుర్తిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. వారందరికీ పౌష్టికాహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మందులు ఇచ్చే బాధ్యతను ఆరోగ్యశాఖ తీసుకుంటుందని, పౌష్టికాహారం బాధ్యతను మహిళా, శిశు సంక్షేమ శాఖ చేపట్టాలని నిర్దేశించారు. ఈ విషయంలో ఆయా సచివాలయాల పరిధిలో వైద్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ మధ్య సమన్వయం ఉండాలని స్పష్టం చేశారు. తద్వారా గ్రామ స్థాయిలో రక్త హీనతను పూర్తిస్థాయిలో నివారించగలుగుతామన్నారు.

తగ్గిందో లేదో పర్యవేక్షించాలి

పౌష్టికాహారాన్ని తీసుకున్నాక బాధితుల్లో రక్తహీనత తగ్గుతోందా లేదా? అనే అంశంపై కూడా దృష్టి పెట్టాలి. ఇచ్చిన పౌష్టికాహారాన్ని వారు తీసుకుంటున్నారా? లేదా? అనే విషయాన్ని నిర్ధారించుకోవాలి. సంపూర్ణ పోషణ కింద పౌష్టికాహారాన్ని అందిస్తున్న సమయంలోనే గర్భిణిలు, పిల్లలకు టీకాలు అందించాలా? లేదా? అనే అంశాలను కూడా పర్యవేక్షించాలని సీఎం జగన్ ఆదేశించారు. ఒకవేళ టీకాలు మిస్ అయితే వెంటనే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు సంబంధిత శాఖ



ఉన్నత స్థాయి సమీక్షలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

యాప్‌లో వివరాలు నమోదు

పిల్లలు తమ వయసుకు తగ్గట్టుగా బరువు ఉన్నారా? లేదా? అన్నదానిపై కూడా అక్కడే పరిశీలన చేయాలని సీఎం జగన్ సూచించారు. ఎవరైనా పిల్లల్లో పౌష్టికాహారం లోపం ఉంటే వారిపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ వివరాలన్నీ ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు అయ్యేలా చూడాలని చెప్పారు. రక్తహీనత, పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించిన వెంటనే ఆ వివరాలను మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది దృష్టికి తెచ్చి పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. ఈ విషయంలో సచివాలయాల వారీగా వైద్య ఆరోగ్య శాఖతో సమన్వయం చేసుకోవాలన్నారు.

నికి చెందిన ఏఎన్ఎం ఆ సమయంలో అక్కడే ఉండేలా చూడాలని స్పష్టం చేశారు.

డ్రై రేషన్‌పై ప్రత్యేక దృష్టి

వైఎస్సార్ సంపూర్ణ పోషణ అమలుపై సమీక్షించిన ముఖ్యమంత్రి జగన్ ఈ కార్యక్రమాన్ని అత్యంత నిశితంగా పర్యవేక్షించాలని నిర్దేశించారు. అంగన్‌వాడీలలో సూపర్‌వైజరీ వ్యవస్థ ఎలా పని చేస్తోందన్న దానిపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని, ఇందుకోసం అవసరమైన ఎస్‌ఓపీని రూపొందించాలని సూచించారు. డ్రై రేషన్ పంపిణీలో అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. ఇప్పుడు అమలు చేస్తున్న విధానంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని, రేషన్ నాణ్యత విషయంలో ఎక్కడా లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆదేశించారు. సమీక్షలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, ఆర్థికశాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, ఏపీడీడీసీఎఫ్ ఎండీ అహ్మద్ బాబు, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కాటమనేని భాస్కర్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ కమిషనర్ ఎం.జానకి, పౌరసరఫరాలశాఖ ఎండీ జి.వీరపాండియన్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జె.నివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'జగనన్న చేదోడు' సాయం

సాక్షి, అమరావతి: బీసీలంటే బ్యాక్ వర్డ్ క్లాస్ కాదు.. సమాజానికి బ్యాక్ బోన్ క్లాస్ అని నిండు మనసుతో నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. దానిని మనసా, వాచా, కర్మణా ఆచరిస్తున్నారు కూడా. రజక, నాయీ బ్రాహ్మణ, టైలర్ల జీవితాల్లో మార్పు రావాలని, వారు మిగతా ప్రపంచంతో పోటీపడి ఎదగాలన్న సంకల్పంతో జగనన్న చేదోడు పథకాన్ని చేపట్టారు. ఈ పథకానికి అర్హులైన ప్రతి లబ్ధిదారుకు ఏడాదికి రూ.10 వేల సాయం అందిస్తున్నారు. వరుసగా నాలుగో ఏడాది జగనన్న చేదోడు సాయం అమలుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గురువారం శ్రీకారం చుడుతున్నారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో వీవర్స్ కాలనీ వైడబ్ల్యూసీఎస్ గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభలో ఈ పథకం లబ్ధిదారులకు సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కి నిధులు విడుదల చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3,25,020 మంది అర్హులైన రజక, నాయీ బ్రాహ్మణ, టైలర్ అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మలకు రూ. 325.02 కోట్ల ఆర్థిక సాయాన్ని వారి ఖాతాల్లో జమ చేయనున్నారు.

ఇదీ పథకం

- ➡ షాపులున్న రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లకు ఏటా రూ. 10,000 చొప్పున సాయం
- ➡ బుధవారం అందిస్తున్న సాయంతో కలిపి ఒక్కొక్కరికి రూ.40,000 వరకు ఆర్థిక సాయం అందించిన జగనన్న ప్రభుత్వం.
- ➡ గురువారం అందిస్తున్న సాయంతో కలిపి ఈ 4 ఏళ్లలో కేవలం ఈ పథకం లబ్ధిదారులకు వైఎస్ జగన్ ప్రభుత్వం అందించిన మొత్తం సాయం రూ. 1,252.52 కోట్లు
- ➡ 1,80,656 మంది టైలర్లకు ఈ విడత సాయంగా రూ. 180.66 కోట్ల లబ్ధి
- ➡ 39,813 మంది నాయీ బ్రాహ్మణులకు రూ. 39.81 కోట్ల లబ్ధి
- ➡ 1,04,551 మంది రజకులకు ఈ విడతలో రూ. 104.55 కోట్ల లబ్ధి
- ➡ లంచాలకు, వివక్షకు తావు లేకుండా అత్యంత పారదర్శకంగా, గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్హుల జాబితా డిస్ ప్లే చేసి, సోషల్ ఆడిట్ నిర్వహించి లబ్ధిదారుల ఎంపిక.
- ➡ ప్రతి ఒక్కరికి అర్హత ఉంటే మిస్ కాకుండా సాయం అందాలని తపన పడుతున్న జగనన్న ప్రభుత్వం...
- ➡ అర్హులై ఉండి పొరపాటున, ఏ కారణం చేతనైనా సంక్షేమ పథకాల లబ్ధి అందని వారికి కూడా మరో అవకాశం కల్పిస్తూ జూన్, డిసెంబర్ నెలల్లో సాయం అందజేస్తున్న వైఎస్ జగన్ ప్రభుత్వం.

జగనన్న చేదోడు పథకం ద్వారా ఇప్పటివరకు అందించిన సాయం

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	సాయం (రూ.కోట్లలో)
2020-21	2,98,122	298.12
2021-22	2,99,225	299.23
2022-23	3,30,145	330.15
2023-24	3,25,020	325.02
మొత్తం సాయం		1,252.52

బాబుదే ఈ 'వంచన'

ఈ చార్జీలు ఇప్పటివి కావు.. టీడీపీ హయాంలో నిర్దేశిత వ్యయంకన్నా ఎక్కువైన వాస్తవ ఖర్చులు

- విద్యుత్ నెట్‌వర్క్ నిర్వహణ ధరలు ఐదేళ్లకొకసారి నిర్ణయం
- విద్యుత్ నియంత్రణ మండలి అనుమతి మేరకే విద్యుత్ చార్జీలు
- కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ నిబంధనలకు అనుగుణంగానే నెలవారీ సర్దుబాటు
- టెలిస్కోపిక్ బిల్లింగ్ విధానంతో అందరికీ మొదటి స్లాబ్ రాయితీ ప్రయోజనం
- విద్యుత్ వాడకపోయినా కట్టాల్సి వచ్చే నెలవారీ కనీస చార్జీలు రద్దు
- నాలుగున్నరేళ్లలో విద్యుత్ పంపిణీ సంస్థలకు రూ.50,650 కోట్లు ఇచ్చిన ప్రభుత్వం
- ఈ వాస్తవాలన్నీ దాచిపెట్టి 'ఈనాడు' తప్పుడు కథనం






పద్మాజనార్ధనరెడ్డి ఐ.పృథ్వీతేజ్ కె.సంతోషరావు

సాక్షి, అమరావతి: అసలు వాస్తవాలను దాచిపెట్టేసి, అవాస్తవాలతో వైఎస్ జగన్ ప్రభుత్వంపై బురద జల్లడమే ఈనాడు నిత్యకృత్యంగా పెట్టుకుంది. ఏదో ఒక కారణంగా విద్యుత్తు బాదుడంటూ తరచూ తప్పుడు కథనాలు ప్రచురిస్తోంది. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉండగా తీసుకున్న నిర్ణయాలను కూడా వైఎస్ జగన్ ప్రభుత్వానికి ముడిపెడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోంది. విద్యుత్ ట్రూఅప్ చార్జీలపై బుధవారం ఈనాడు ప్రచురించిన కథనమూ ఇటువంటిదే. అసలు వాస్తవమేమిటంటే.. ఈ ట్రూఅప్ చార్జీలు చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనివే. ఆ విషయం ప్రస్తావించకుండా కథనం వండి, పాఠకులను వంచించింది.

రాష్ట్రంలో ప్రస్తుతం విధిస్తున్న నెట్‌వర్క్ ట్రూ ఆప్ చార్జీలు గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనివని తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత డిస్కంల సీఎండీలు ఐ.పృథ్వీతేజ్, జె.పద్మాజనార్ధనరెడ్డి, కె.సంతోషరావు స్పష్టం చేశారు. 2014–19 మధ్య కాలంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థ నిర్వహణ నిమిత్తం జరిగిన వాస్తవ ఖర్చులు నిర్దేశిత వ్యయంకన్నా ఎక్కువ అవడం వల్ల ఈ చార్జీలు వచ్చాయే తప్ప ప్రస్తుత కాలానికి సంబంధించినవి కావని తెలిపారు. ఈ వాస్తవాలను దాచిపెట్టి 'విద్యుత్ చార్జీలపై జగన్ వంచన' అంటూ ఈనాడు బుధవారం అచ్చేసిన కథనాన్ని సీఎండీలు ఖండించారు. ఈ మేరకు 'సాక్షి' ప్రతినిధికి వారు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి..

రాష్ట్రంలో విద్యుత్ చార్జీల నిర్ధారణకు 1998 సంవత్సరంలోనే రాష్ట్ర విద్యుత్ సంస్కరణల చట్టం ప్రకారం ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఏర్పాటైంది. విద్యుత్ నెట్‌వర్క్, రిటైల్ సరఫరా ధరలను చట్టబద్ధంగా ఏర్పాటైన ఏపీఈఆర్సీ నిర్ణయిస్తుంది. ఇందుకోసం డిస్కంల ఆర్థిక స్థితిగతులు, సరఫరా, నెట్‌వర్క్ నిర్వహణకు అయ్యే మొత్తం ఖర్చు, దీర్ఘకాలంలో వివిధ ఖర్చుల వార్షిక పెరుగుదల శాతంలను పరిగణనలోకి తీసుకుంటుంది. రాష్ట్ర విద్యుత్ రంగంలో నెట్‌వర్క్ నిర్వహణ ధరలు ఐదేళ్లకొకసారి, రిటైల్ సరఫరా ధరలు ఏడాదికోసారి ఆర్థిక సంవత్సరం మొదలయ్యే ముందుగా ప్రకటిస్తారు. 2000 సంవత్సరం నుంచి రిటైల్ సరఫరా ధరలు, నెట్‌వర్క్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు వంటివి మండలి ఆదేశాల ప్రకారమే డిస్కంలు వినియోగదారుల నుంచి వారి వినియోగాన్ని బట్టి వసూలు చేస్తున్నాయి.

➢ విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రతి ఏటా సెప్టెంబరు నెలాఖరుకి తదుపరి ఆర్థిక సంవత్సరం ఆదాయ, అవసరాల నివేదికలను అప్పటి కున్న పరిస్థితుల ఆధారంగా తయారు చేస్తాయి. అప్పుడు వంద శాతం ఖచ్చితత్వంతో విద్యుత్ కొనుగోలు వ్యయం అంచనా వేయడం సాధ్య పడదు. ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ కొనుగోలు ఖర్చులో హెచ్చు తగ్గులు ఉంటాయి. ఇంధన ఛార్జీలు, విద్యుత్ కొనుగోలు వ్యయంలో ఉండే హెచ్చుతగ్గులు విద్యుత్ చట్టంలో, నిబంధనల్లో నిర్దేశించిన విధంగా సర్దుబాటు చార్జీల ద్వారా వసూలు చేసుకునే వెసులుబాటు ఉంది.

➢ గడిచిన ఆర్థిక సంవత్సరంలో గృహ విద్యుత్ వినియోగదారుల టారిఫ్‌ను హేతుబద్ధీకరించి ఒక ఉమ్మడి ఏక గ్రూపు టెలిస్కోపిక్ బిల్లింగ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. దీనివల్ల మొదటి స్లాబ్ రాయితీ ధరల ప్రయోజనం వినియోగదారులందరికీ అందుతుంది. ఇదే కాకుండా ప్రస్తుత ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి విద్యుత్ వాడకపోయినా కట్టవలసి వచ్చే నెలవారీ కనీస చార్జీలు రద్దయ్యాయి. దీని ప్రకారం సింగిల్ ఫేజ్ వారికి రూ.65, త్రీ ఫేజ్ వినియోగదారులకు రూ.150 చెల్లించాల్సిన అవసరం తప్పింది.

➢ కేంద్ర ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ నిబంధనలకు అనుగుణంగానే 2021–22 ఆర్థిక సంవత్సరం నుండి వార్షిక ట్రూ అప్ చార్జీల స్థానంలో త్రైమాసిక సర్దుబాటు చార్జీలు అమల్లోకి వచ్చాయి. దీని ప్రకారమే డిస్కంలు 2021–22 సంవత్సరానికి ప్రతి త్రైమాసికానికి విద్యుత్ కొనుగోలు వ్యయ హెచ్చు తగ్గులను ఏపీఈఆర్సీకి సమర్పించాయి. ప్రస్తుత 2023–24 ఆర్థిక సంవత్సరం నుంచి త్రైమాసిక సర్దుబాటు చార్జీల స్థానంలో కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ నిబంధనలకు అనుగుణంగా నెలవారీ సర్దుబాటు చార్జీలు అమల్లోకి వచ్చాయి. తదనుగుణంగా డిస్కంలు జూన్ నుంచి నెలవారీ విద్యుత్ కొనుగోలు చార్జీల సవరింపు అమలు చేస్తున్నాయి. దీని ప్రకారం ఒక నెలలోని సర్దుబాటును దాని తరువాత రెండో నెలలో వసూలు చేస్తారు.

➢ డిస్కంల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం 2019 మే నుండి సెప్టెంబర్ 2023 వరకు సబ్సిడీ రూపంలో దాదాపు రూ.39,900 కోట్లను, వివిధ విభాగాల విద్యుత్ వినియోగ చార్జీల రూపంలో మరో రూ.10,750 కోట్లను, మొత్తంగా నాలుగున్నరేళ్లలో రూ.50,650 కోట్లు డిస్కంలకు ఇచ్చింది. ఉచిత వ్యవసాయ విద్యుత్ వినియోగానికి ట్రూ అప్ చార్జీలను, ఇంధన సర్దుబాటు చార్జీలను ప్రభుత్వమే భరిస్తోంది. అందువల్ల ఇందులో వంచన అన్నదే లేదు. ఈనాడు కథనంలో అర్థం లేదు.

డీఎన్‌బీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: ఇన్ సర్వీస్ అభ్యర్థులకు వైద్య విద్య డీఎన్‌బీ (డిప్లొమేట్ ఆఫ్ నేషనల్ బోర్డ్) కోర్సుల్లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్ అప్లికేషన్లు ఆహ్వానిస్తూ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. అభ్యర్థులు https://dnb.ysruhs.com వెబ్‌సైట్‌లో గురువారం రాత్రి 9 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది. నియమనిబంధనలకు సంబంధించి సందేహాల నివృత్తి కోసం 8978780501, 7997710168, 9391805238 ఫోన్ నంబర్లలో సంప్రదించాల్సిందిగా రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు.

రాష్ట్రంలో మంచి, చెడు మధ్య సమరం

వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మంచికి చెడుకు మధ్య సమరం జరుగుతోందని వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వి.విజయసాయిరెడ్డి అన్నారు. మంచి పక్షాన సీఎం జగన్ నిల్చుంటే.. చెడుకు చంద్రబాబు కాపు కాస్తున్నారని విమర్శించారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎవ్వరికైనా సీఎం జగన్ పేరు చెబితే పేద బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గుర్తుకు వస్తాయని.. అదే చంద్రబాబు పేరు చెబితే స్కామ్‌లు గుర్తుకు వస్తాయన్నారు. చంద్రబాబు ప్రజల ఆస్తి అని, ఆయన కోసం పోరాడాల్సిన బాధ్యత ప్రజలదే అంటూ మెదడు దెబ్బతిన్న టీడీపీ నేతలు విచిత్రమైన వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు కూడా ప్రజలే తన ఆస్తి అంటూ కన్నం వేశారని.. దొరికినంత దోచుకున్నారని మండిపడ్డారు. చంద్రబాబేమీ దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త కాదని, గొప్ప క్రీడాకారుడు కూడా కాదని దుయ్యబట్టారు. ప్రజల సొమ్ము దోచుకొని ఆధారాలతో సహా దొరికిపోయి జైలుపాలైన నిందితుడు, వెన్నుపోటుదారుడని విమర్శించారు. కాగా, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే.. అది వృథా అవుతుందని విజయసాయిరెడ్డి అన్నారు. అనిశ్చితికి, అవినీతికి, గందరగోళ పాలసీలకు ఓటు వేసినట్లవుతుందని చెప్పారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోని సీఎంలు వీక్‌గా ఉండడంతో.. నిర్ణయాలన్నీ ఆ పార్టీ హైకమాండ్ తీసుకుంటోందని విమర్శించారు.

ఇసుకపై 'పచ్చ' రాతలేల?

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సదుం (చిత్తూరు జిల్లా): సీఎం జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని జోడు గుర్రాల్లా పరిగెత్తిస్తున్నప్పటికీ.. పచ్చమీడియా తన పైత్యాన్ని, ఉక్రోషాన్ని వదులుకోలేకపోతోందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా టెండర్లే పూర్తికాని ఇసుక విధానంపై దిగజారుడు రాతలు రాయడమే ఇందుకు తాజా నిదర్శనమన్నారు. చిత్తూరు జిల్లా సదుంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వానికి చెందిన కార్పొరేషన్ ద్వారా ఇసుక టెండర్ల ప్రకియ జరుగుతున్నదని తెలిపారు. ప్రీబిడ్డింగ్‌లోనూ నాలుగు సంస్థలు పాల్గొన్నాయని చెప్పారు. రామోజీ, ఏబీఎన్, టీవీ5 సంస్థల అధినేతలకు ఇతర వ్యాపారాలున్నాయని, వారు కూడా ఇసుక టెండర్లలో పాల్గొనాలని సూచించారు. టెండర్లకు ఇంకా సమయం ఉండగానే సీఎం సోదరుడిపై విష ప్రచారం చేస్తున్నారన్నారు. సీఎం కుటుంబ సభ్యులపై ఉక్రోషం వెళ్లగక్కుతూ.. రాతలు రాయడం దుష్ట చతుష్టయం ఓర్వలేని తనానికి ప్రతీకగా నిలుస్తున్నదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మంత్రిగా పనిచేయకపోయినా, ఎటువంటి సంతకాలు చేయకపోయినా, సచివాలయం మొహం చూడకపోయినా గతంలో అక్రమ కేసులు పెట్టారని, చంద్రబాబు తాబేదారుల్లా..అప్పుడు తామేమి నిరసనలు తెలపలేదని గుర్తు చేశారు.

పరిపాలన వికేంద్రీకరణతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

- నాన్‌పొలిటికల్ జేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ లజపతిరాయ్
- విశాఖ పరిపాలనా రాజధాని కోరుతూ మోదమ్మకు ప్రత్యేక పూజలు


మోదకొండమ్మతల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణ, లజపతిరాయ్ తదితరులు

సాక్షి,పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఉత్తరాంధ్ర అభివృద్ధి లక్ష్యంగా విశాఖ నుంచి పరిపాలన చేపట్టాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ పాడేరులోని మోదకొండమ్మతల్లికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర వికేంద్రీకరణ నాన్‌పొలిటికల్ జేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ ఆధ్వర్యంలో పాడేరు,అరకు ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, రాష్ట్ర ట్రికార్ చైర్మన్ సతక బుల్లిబాబు, స్థానిక ప్రజాప్రతినిధులు, నేతలు మోదకొండమ్మతల్లికి కుంకుమార్చన చేశారు. విశాఖ పరిపాలన కేంద్రంగా ఉత్తరాంధ్రతో పాటు గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందాలని మోదమ్మకు పూజలు చేశారు. పరిపాలన వికేంద్రీకరణ, మూడు రాజధానులకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాడేరు, అరకు ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ మాట్లాడుతూ పరిపాలన వికేంద్రీకరణతో ఏపీ అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధిస్తుందన్నారు. టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఉత్తరాంధ్ర అన్ని రంగాల్లోనూ వెనుకబడి ఉందన్నారు. నాన్ పొలిటికల్ జేఏసీ కన్వీనర్ లజపతిరాయ్ మాట్లాడుతూ అరకు,పాడేరు ప్రాంతాల అభివృద్ధి విశాఖ పరిపాలన రాజధానితో సాధ్యమన్నారు. కార్యక్రమంలో ట్రికార్ చైర్మన్ సతక బుల్లిబాబు,పాడేరు మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర తదితరులు పాల్గొన్నారు.

'బెంగళూరులో అతిపెద్ద సీఐఐ ఎక్స్‌కాన్ 2023 ఎగ్జిబిషన్'

డిసెంబర్ 12 నుంచి 16 వరకు నిర్వహణ

సాక్షి, విశాఖపట్నం: కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఆధ్వర్యంలో దక్షిణాసియాలో అతిపెద్ద నిర్మాణ పరికరాల ఎగ్జిబిషన్ 'ఎక్స్‌కాన్‌-2023'ను డిసెంబర్ 12 నుంచి 16వ తేదీ వరకు బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు దూసన్ బాబ్‌క్యాట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సేల్స్ హెడ్, ఎక్స్‌కాన్ 2023 స్టీరింగ్ కమిటీ కంట్రీ హెడ్ ఎస్.మంజునాథ్ తెలిపారు. ఈ ప్రదర్శన నేపథ్యంలో బుధవారం సీఐఐ విశాఖ నగరంలో రోడ్ షో నిర్వహించింది. మంజునాథ్ మాట్లాడుతూ ఎక్స్‌కాన్ 12వ ఎడిషన్ అని, 'బిల్డింగ్ ఇండియాస్ టుమారో' అనే థీమ్‌తో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 5 రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనలో వివిధ దేశాల నుంచి 1,200 మంది ప్రదర్శనకారులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఈ ఎగ్జిబిషన్ ప్రపంచవ్యాప్తంగా 80 వేల మంది వ్యాపార సందర్శకులను ఆకర్షించనుందన్నారు. సీఐఐ విశాఖ చైర్మన్, విశాఖ ఫార్మాసిటీ లిమిటెడ్ ఎండీ డాక్టర్ పి.పి.లాల్‌కృష్ణ, పరిశ్రమల నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ మహిళా నేత ఆత్మహత్యాయత్నం

రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి వ్యవహారశైలికి నిరసన

సాక్షి, అమరావతి/కృష్ణలంక (విజయవాడతూర్పు): బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వ్యవహారశైలికి నిరసనగా అన్నమయ్య జిల్లా మదనపల్లికి చెందిన ఆ పార్టీ రాష్ట్రస్థాయి నాయకురాలు అంజనాచౌదరి బుధవారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముందు ఆత్మహత్యాయత్నం చేశారు. అంజనాచౌదరి బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబరుగా కొనసాగుతున్నారు. అయితే అన్నమయ్య జిల్లా పార్టీలో కొంతమంది నేతల మధ్య నెలకొన్న అంతర్గత వివాదాల కారణంగా రెండు రోజుల కిత్రం రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు పురందేశ్వరి ఆమెను సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో తనకు కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా ఏకపక్షంగా ఉద్దేశపూర్వకంగా పార్టీ నుంచి సస్పెండ్ చేశారని ఆరోపిస్తూ అంజనాచౌదరి ఒంటిపై కిరోసిన్ పోసుకోవడానికి ప్రయత్నించగా, అక్కడ ఉన్న మీడియా ప్రతినిధులు అడ్డుకుని నిలువరించారు. అన్నమయ్య జిల్లాలో ప్రస్తుతం జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న ఓ నాయకుడిపై తాను చేసిన లైంగిక వేధింపుల ఫిర్యాదు మేరకు సోము వీర్రాజు అధ్యక్షుడిగా కొనసాగుతున్న సమయంలో పార్టీ నుంచి అతనిని సస్పెండ్ చేశారని అంజనాచౌదరి చెబుతున్నారు. అయితే పురందేశ్వరి రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక పక్షపాతంతో అతనిపై సస్పెండ్ ఎత్తివేయడమే కాకుండా తిరిగి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారని అంజనాచౌదరి చెప్పారు. ఈ అంశంపై తాము ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటే.. తన ఒక్కరినే పార్టీ రాష్ట్ర నాయకత్వం ఉద్దేశపూర్వకంగా సస్పెండ్ చేసిందని ఆరోపించారు. వెంటనే తనపై సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరారు.

గుడిలో పూజలు చేశారంటూ వలంటీర్, కుటుంబ సభ్యులపై దాడి

టీడీపీ నేతల దాష్టీకం.. హిందూపురం నియోజకవర్గంలో ఘటన


గాయపడిన వలంటీర్ అరుణ


గాయపడిన నరసింహప్ప


చికిత్స పొందుతున్న రత్నమ్మ

హిందూపురం: తక్కువ కులానికి చెందిన వారు గుడిలో పూజలు చేశారంటూ గ్రామ వలంటీర్, ఆమె కుటుంబ సభ్యులపై టీడీపీ నేతలు దాడికి పాల్పడ్డారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మండలం పూలకుంటలో బుధవారం ఈ ఘటన జరిగింది. బాధితులు, పోలీసుల కథనం మేరకు.. పూలకుంటకు చెందిన అరుణ గ్రామ వలంటీర్. ఆమె అత్త రత్నమ్మ గృహ సారథి, భర్త చాకలి రాజశేఖర్, మామ చాకలి నరసింహప్ప వైఎస్సార్‌సీపీ నేతలు. టీడీపీకి చెందిన గ్రామ సర్పంచ్ మంజునాథ్.. తమ పార్టీ కార్యకర్తలకు అర్హత లేకున్నా పింఛన్ మంజూరు చేయించాలని వలంటీర్‌పై పలుమార్లు ఒత్తిడి తెచ్చారు. ఇందుకు ఆమె ససేమిరా అనడంతో కక్ష పెంచుకున్నారు. మంగళవారం గ్రామంలోని కొల్లాపురమ్మ గుడిలో పూజారి అందుబాటులో లేకపోవడంతో అక్కడికి వచ్చిన భక్తుల కోరిక మేరకు వలంటీర్ అరుణ, భర్త రాజశేఖర్‌తో కలిసి పూజ చేసేందుకు ప్రయత్నించారు. అయితే గ్రామ సర్పంచ్ మంజునాథ్, టీడీపీ నేతలు కల్పించుకుని తక్కువ కులానికి చెందిన వారు పూజలు చేయరాదంటూ అడ్డుకుని, వలంటీర్‌తో పాటు కుటుంబ సభ్యులపై మూకుమ్మడిగా దాడి చేశారు. హిందూపురం రూరల్ పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పి పంపించి వేశారు. అక్కడితో టీడీపీ నేతలు వదిలేయకుండా రాత్రి వలంటీర్ ఇంటి వద్దకు వెళ్లి తిరిగి గొడవకు దిగి కుటుంబ సభ్యులపై విచక్షణారహితంగా దాడి చేయడంతో వలంటీర్, అత్త రత్నమ్మ, భర్త రాజశేఖర్, మామ నరసింహప్పలు గాయపడ్డారు. వీరు హిందూపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దాడి చేసిన సర్పంచ్ మంజునాథ్‌తో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ అబ్దుల్ కలామ్ ఆజాద్ చెప్పారు.



మానవత్వం మీద ఎప్పటికీ మనం విశ్వాసం కోల్పోవద్దు.
మానవత్వం అనేది మహాసముద్రం; మహాసముద్రంలోని కొన్ని బిందువులు మురికివైనంత మాత్రాన, మహాసముద్రం మురికి కాదు.

– మహాత్మా గాంధీ

సాక్షి

గురువారం, 19 అక్టోబర్ 2023

సమన్యాయ సంకటం

ధర్మం, న్యాయం వేరు... చట్టం వేరు. కాలాన్ని బట్టి సమాజం దృష్టి మారినంత వేగంగా చట్టం మారడం కష్టం. ఒకవేళ మార్చాలన్నా ఆ పని పాలకులదే తప్ప, న్యాయస్థానాల పరిధిలోది కాదు. స్వలింగ వివాహాలకు చట్టబద్ధమైన గుర్తింపునిచ్చేందుకు నిరాకరిస్తూ అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం వెలువరించిన తీర్పు ఆ సంగతే తేల్చింది. ''ఈ కోర్టు చట్టం చేయలేదు. ప్రభుత్వం చేసిన చట్టాలను విశ్లేషించి, వ్యాఖ్యానించగలదు. అది అమలయ్యేలా చూడ గలదు'' అని భారత చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం పేర్కొంది. స్వలింగ వివాహాలను అనుమతించాలంటే చట్టం చేయాల్సింది పార్లమెంటేననీ, అందుకు తగ్గట్టు 'ప్రత్యేక వివాహ చట్టాన్ని' (ఎస్ఎంఏ) సవరించే బాధ్యత పాలకులదేననీ అభిప్రాయపడింది. అయితే, ఎల్జీబీటీక్యూ సముదాయ సభ్యులకు కలసి జీవించే హక్కుందనీ, దాన్ని తమ తీర్పు తోసిపుచ్చడం లేదనీ స్పష్టతనిచ్చింది. స్వలింగుల పెళ్ళికి చట్టబద్ధత లభిస్తుందని గంపెడాశతో ఉన్న ఎల్జీబీటీక్యూలకు ఇది అశనిపాతమే. హక్కులకై వారి పోరాటం మరింత సుదీర్ఘంగా సాగక తప్పదు.

నిజానికి, స్వలింగ సంపర్కం నేరం కాదని 2018 జూలైలో సుప్రీమ్ చరిత్రాత్మక తీర్పునిచ్చింది. ఇక తదుపరిగా స్వలింగ జంటల వివాహాలకు చట్టబద్ధమైన గుర్తింపు లభిస్తుందని ఎల్జీబీటీక్యూ వర్గం భావించింది. అందుకు తగ్గట్లే ఆ గుర్తింపును కోరుతూ 21 పిటిషన్లు దాఖలయ్యాయి. పిల్లల్ని దత్తత చేసుకొనే హక్కు, పాఠశాలల్లో పిల్లల తల్లితండ్రులుగా పేర్ల నమోదుకు అవకాశం, బ్యాంకు ఖాతాలు తెరిచే వీలు, బీమా లబ్ధి లాంటివి కల్పించేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఈ అంశంపై ఏప్రిల్‌లో పదిరోజులు ఏకబిగిన విచారణ జరిపి, మే 11న తీర్పు రిజర్వ్ చేసిన ధర్మాసనం మంగళవారం నాలుగు అంశాలపై వేర్వేరు తీర్పులిచ్చింది. స్వలింగ పెళ్ళిళ్ళ చట్టబద్ధత పార్లమెంట్ తేల్చాల్సిందేనంటూ ధర్మాసనం బంతిని కేంద్రం కోర్టులోకి వేసింది. పెళ్ళి చేసుకోవడాన్ని రాజ్యాంగం ఒక ప్రాథమిక హక్కుగా ఇవ్వలేదని ఏకగ్రీవంగా అభిప్రాయపడింది. అయితే, పిల్లల దత్తత సహా స్వలింగ సంపర్కుల ఇతర అంశాలపై అయిదుగురు జడ్జీల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. దాంతో, ధర్మాసనం 3–2 తేడాతో మెజారిటీ తీర్పునిచ్చింది.

వివాహ వ్యవస్థ, స్వలింగ సంపర్కాలపై ఎవరి అభిప్రాయాలు ఏమైనప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే అర్జెంటీనా, ఆస్ట్రేలియా, జర్మనీ, బ్రిటన్, జపాన్ సహా 34 దేశాలు సమ లైంగిక వివాహాలను చట్టబద్ధం చేశాయి. వచ్చే ఏడాది నుంచి 35వ దేశంగా ఎస్తోనియాలోనూ అది చట్టబద్ధం కానుంది. ఇవి కాక మరో 35 దేశాలు స్వలింగ సంపర్కులకు పెళ్ళి మినహా అనేక అంశాల్లో చట్టపరమైన గుర్తింపునిచ్చాయి. అమెరికా అయితే సాధారణ వివాహ జంటలకిచ్చే ప్రభుత్వ సౌకర్యాలన్నీ ఈ స్వలింగ జంటలకు సైతం 2015 నుంచి అందిస్తోంది. స్వలింగ సంపర్కం, లైంగికతల విషయంలో ప్రపంచంలో మారుతున్న ఆలోచనా ధోరణులకు ఇది ప్రతీక. అందుకే, మన దగ్గరా ఇంత చర్చ జరిగింది. ఆ మాటకొస్తే, భిన్న లైంగికత అనేది అనాదిగా సమాజంలో ఉన్నదే. మన గ్రంథాల్లో ప్రస్తావించినదే. అందుకే, సాక్షాత్తూ సుప్రీమ్ చీఫ్ జస్టిస్ సైతం, ఇదేదో నగరాలకో, ఉన్నత వర్గాలకో పరిమితమైనదనే అపోహను విడనాడాలన్నారు. అందరి లానే వారికీ నాణ్యమైన జీవితాన్ని గడిపే హక్కుందని పేర్కొన్నారు. ఇది గమనంలోకి తీసుకోవాల్సిన అంశం.

స్వలింగ జంటల వివాహాలకు పచ్చజెండా ఊపనప్పటికీ, భిన్నమైన లైంగికత గల ఈ సముదాయం దుర్విచక్షణ, ఎగతాళి, వేధింపుల పాలబడకుండా కాపాడాల్సిన అవసరం తప్పక ఉందని సుప్రీమ్ అభిప్రాయపడింది. అందుకు కేంద్రం, రాష్ట్రాలు తగు చర్యలు చేపట్టాలని కూడా కోర్టు ఆదేశాలిచ్చింది. మరోపక్క స్వలింగ సంబంధాల్లోని జంటలకున్న సమస్యలను పరిశీలించేందుకూ, వారికి దక్కాల్సిన హక్కులను చర్చించేందుకూ ఓ సంఘాన్ని ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. పెళ్ళికి చట్టబద్ధత దక్కలేదని నిరాశ కలిగినప్పటికీ, స్వలింగ జంటలకు ఒకింత ఊరటనిచ్చే విషయాలివి. అర్ధనారీశ్వర తత్త్వాన్ని అనాది నుంచి అర్థం చేసుకొంటూ వస్తున్న భారతీయ సమాజం భిన్న లైంగికతను ఘోరంగా, నేరంగా, నీచంగా చూడడం సరికాదు. ఆ సముదాయం సైతం మనలోని వారేనన్న భావన కలిగించాలి. దీనిపై ప్రజల్లో ప్రభుత్వం చైతన్యం పెంచాలి. శాసన నిర్మాతలు లైంగికతలో అల్పసంఖ్యాక సముదాయమైన వీరికి అవసరమైన చట్టం చేయడంపై ఆలోచించాలి.

భారతీయ సమాజంలో వైవాహిక, కుటుంబ వ్యవస్థలకు ప్రత్యేక స్థానమున్న మాట నిజం. అది అధిక సంఖ్యాకుల మనోభావాలు ముడిపడిన సున్నితమైన అంశమనేదీ కాదనలేం. స్వలింగ జంటల వివాహం, పిల్లల దత్తత, పెంపకం సంక్లిష్ట సమస్యలకు తెర తీస్తుందనే కేంద్ర ప్రభుత్వ భయమూ నిరాధారమని తోసిపుచ్చలేం. కానీ, ఈ పెళ్ళిళ్ళకు గుర్తింపు లేనందున పింఛన్, గ్రాట్యుటీ, వారసత్వ హక్కుల లాంటివి నిరాకరించడం ఎంత వరకు సబబు?

మన దేశంలో 25 లక్షల మందే స్వలింగ సంపర్కులున్నారని ప్రభుత్వం లెక్క చెబుతోంది. కానీ, బురద జల్లుతారనే భయంతో బయటపడిన వారు అనేకులు గనక ఈ లెక్క ఎక్కువే అన్నది ఎల్జీబీటీక్యూ ఉద్యమకారుల మాట. సంఖ్య ఎంతైనప్పటికీ, దేశ పౌరులందరికీ సమాన హక్కులను రాజ్యాంగం ప్రసాదిస్తున్నప్పుడు, కేవలం లైంగికత కారణంగా కొందరిపై దుర్విచక్షణ చూపడం సరికాదు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించి, కాలానుగుణంగా పాత చట్టాల్లో మార్పులు చేయాలి. అందరూ సమానమే కానీ, కొందరు మాత్రం తక్కువ సమానమంటే ఒప్పుతుందా?

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు
ఆశ్వయుజమాసం, తిథి: శు.పంచమి రా.10.28 వరకు
తదుపరి షష్ఠి, **నక్షత్రం:** జ్యేష్ఠ రా.8.10 వరకు, తదుపరి మూల,
వర్జ్యం: ప.3.57 నుండి 5.28 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.49 నుండి 10.39 వరకు, తదుపరి ప.2.28 నుండి 3.15 వరకు,
అమృత ఘడియలు: ఉ.11.24 నుండి 1.00 వరకు.

సూర్యోదయం : 5.56
సూర్యాస్తమయం: 5.34
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

సాధారణ పరిస్థితులు నెలకొనేనా?

విశ్లేషణ



శ్యామ్ శరణ్

అక్టోబర్ 7 నాటి హమాస్ వరుస రాకెట్ దాడులను ఇజ్రాయెల్ తనదైన '9/11'గా అభివర్ణిస్తోంది. ఇరాన్, లెబనాన్ కూడా ఘర్షణ కేంద్రాలుగా మారితే వివాదం మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. పాలస్తీనా సమస్యను అరబ్ రాజ్యాలతో సహా అన్ని ప్రభుత్వాలు పక్కన పెట్టేశాయి. ఇప్పుడు ఇదే ప్రాంతీయ, ప్రపంచ రాజకీయాలకు కేంద్రం అవుతుంది. సరిగ్గా హమాస్ సాధించాలనుకున్నది ఇదే. ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాల స్థాపన చర్చలను నిలిపివేస్తున్నట్లు సౌదీ అరేబియా ప్రకటించింది. జీ20 శిఖరాగ్ర సమావేశంలో ఇజ్రాయెల్, దాని నౌకాశ్రయం హైఫాను కలుపుకొని ప్రకటించిన 'ఇండియా–మిడిల్ ఈస్ట్–యూరోప్ ఎకనామిక్ కారిడార్' సందిగ్ధంలో పడే అవకాశం ఉంది.

2007 నుండి గాజా స్ట్రిప్‌ను పాలిస్తున్న పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్ హమాస్, అక్టోబర్ 7న, ఇజ్రాయెల్‌పై వరుస రాకెట్ దాడులను ప్రారంభించింది. ఆపై ఇజ్రాయెల్ దక్షిణ సరిహద్దులో కమాండో దాడులతో, ఇజ్రాయెల్ పౌరులను, విదేశీయులను విచక్షణారహితంగా చంపడమే కాకుండా, ఇజ్రాయెల్ పౌరులను, అనేక మంది ఇజ్రాయెల్ రక్షణ సిబ్బందిని అపహరించుకుపోయింది. సరిహద్దు సమీపంలో సంగీత ఉత్సవాన్ని ఆస్వాదిస్తున్న 250 మంది యువ ఇజ్రాయెలీలను, విదేశీయులను విచక్షణారహితంగా చంపివేశారు. ఈ హమాస్ దాడిని ఇజ్రాయెల్ తనదైన '9/11'గా అభివర్ణిస్తోంది. ఇతర ఇజ్రాయెలీలు అయితే, రెండవ ప్రపంచ యుద్ధంలో హోలోకాస్ట్ అని పిలుస్తున్న మారణకాండలో లక్షలాదిమంది యూదులను హిట్లర్ పాలనలోని జర్మనీలో గ్యాస్ ఛాంబర్‌లకు పంపిన తరహాలో మళ్లీ యూదులను అత్యంత దారుణంగా లక్ష్యంగా చేసుకున్న హత్యాకాండగా అభివర్ణించారు.

మనం ఇప్పుడు 20 లక్షల మందికి పైగా పాలస్తీనియన్లు నివసించే గాజా స్ట్రిప్‌లో ఒక పెద్ద మానవ విషాదం అంచున ఉన్నాము. గాజా ఉత్తర భాగంలో నివసించే ప్రజలను ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసి స్ట్రిప్ దక్షిణ భాగం వైపు వెళ్లాలని ఇజ్రాయెల్ రక్షణ దళాలు హెచ్చరించాయి. అయితే, ఇజ్రాయెల్ వైమానిక దాడులు, ఫిరంగి బాంబు దాడులు కొనసాగుతున్నందున, దక్షిణం వైపునకు వెళ్లడానికి కూడా సురక్షితమైన మార్గాలు లేవు. ఈజిప్ట్‌కు వెళ్లే ఏకైక నిష్క్రమణ స్థానం రఫాహ్ చెక్‌పాయింట్ ద్వారా వెళుతుంది. దాన్ని కూడా మూసివేశారు. ఈజిప్ట్ కోరుకునే చివరి విషయం వేలాది పాలస్తీనియన్ల వలసే. ఇజ్రాయెల్ దిగ్బంధనం వల్ల అత్యవసరంగా కావలసిన ఆహారం, నీరు, విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఇవన్నీ ఇజ్రాయెల్ ద్వారానే వస్తాయి. ఇప్పటికీ పనిచేస్తున్న ఆసుపత్రులు, క్లినిక్‌లలో వైద్య సామగ్రి అయిపోయింది. అమెరికా జోక్యం నీటి సరఫరా పునఃప్రారంభానికి దారితీసింది కానీ ఇది దక్షిణ గాజాకు మాత్రమే.

గాజాలో పాలస్తీనియన్ల ఈ సామూహిక శిక్ష, హమాస్ నాయకత్వాన్ని నిర్వీర్యం చేసే అవకాశం లేదు. దాని నాయకులు కొందరు ఇప్పటికే ఒమన్‌లో ఆశ్రయం పొందారు. మరికొందరు ఇరాన్ లేదా లెబనాన్‌కు పారిపోయి ఉండవచ్చు. లెబనాన్‌లోని ఇరాన్ అనుకూల ఉగ్రవాద సంస్థ హిజ్బొల్లాకు మల్లే, ఇరాన్ హమాస్‌కు మద్దతు ఇస్తోంది. గాజాపై ఇజ్రాయెల్ బాంబుదాడిలో పలువురు బందీలు మరణించినట్లు హమాస్ ఇప్పటికే ప్రకటించింది.

ప్రపంచ స్థాయి నిఘా, సైనిక సామర్థ్యాలు ఉన్నప్పటికీ దాడిని నిరోధించలేకపోయిన బెంజమిన్ నెతన్యాహు ప్రభుత్వంపై ఇజ్రాయెలీలకు ఆగ్రహం ఉంది. అకస్మాత్తుగా, అనేకమంది ఊహించినట్లుగా ఇజ్రాయెల్ అభేద్యంగానూ, సురక్షితంగానూ కనిపించడం లేదు.



ప్రణాళికాబద్ధమైన దాడి నెతన్యాహు వైఫల్యాల నుండి దృష్టిని మళ్లించి, ప్రజలు ద్వేషిస్తున్న శత్రువుకు వ్యతిరేకంగా దేశాన్ని ఏకం చేసే రాజకీయ ప్రయోజనానికి మాత్రం ఉపయోగపడుతుంది. 1967 నుండి 2005 వరకు దక్షిణ గాజాలోని తన ఆవాసాలను ఖాళీ చేసి పాలస్తీనియన్ నేషనల్ అథారిటీ (పీఎన్ఏ)కి పగ్గాలు అప్పగించినట్లుగానే, ఇప్పుడు సైతం గాజాను ఆక్రమించడానికి ఇజ్రాయెల్ విముఖత చూపవచ్చు. కానీ 2007లో హమాస్ గాజా బాధ్యతలు స్వీకరించింది. అప్పటి నుండి పీఎన్ఏకి ఎటువంటి పాత్రా లేదు. గాజా దాని మధ్యధరా తీరంపై ఇజ్రాయెల్ గగనతల నియంత్రణను కొనసాగించింది. గాయపడిన, శత్రు జనాభాతో నిండివున్న గాజాను తాత్కాలికంగా తిరిగి ఆక్రమించడం కూడా ఇజ్రాయెల్ భద్రతను ఎలా మెరుగుపరుస్తుందో చెప్పడం కష్టం.

ఇజ్రాయెల్, కీలకమైన అరబ్ దేశాల మధ్య సంబంధాలను సాధారణీకరించే ధోరణి ఇప్పుడు సవాలును ఎదుర్కొంటోంది. ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాల స్థాపన, రాయబార కార్యాలయాల మార్పిడికి దారి తీస్తుందని భావిస్తున్న కీలకమైన చర్చలను నిలిపివేస్తున్నట్లు సౌదీ అరేబియా ఇప్పటికే ప్రకటించింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన జీ20 శిఖరాగ్ర సమావేశంలో ఇజ్రాయెల్, దాని నౌకాశ్రయం హైఫాను కలుపుకొని ప్రకటించిన 'ఇండియా–మిడిల్ ఈస్ట్–యూరోప్ ఎకనామిక్ కారిడార్' ఇప్పుడు సందిగ్ధంలో పడే అవకాశం ఉంది.

ఇజ్రాయెల్ సైనిక కార్యకలాపాలు అమాయక పాలస్తీనియన్లను చంపడం, తీవ్రంగా గాయపర్చడం అనేది ఇప్పటికే అరబ్ వీధుల్లో ఆందోళన కలిగిస్తోంది. పైగా ఇజ్రాయెల్‌తో సామీప్యతను ప్రదర్శించడం ద్వారా అరబ్ పాలకులు తమ భద్రతకు హాని కలగాలని కోరుకోవడం లేదు. అమెరికా, యూరప్‌లోని గణనీయమైన అరబ్ డయాస్పోరాలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లిం మరియు ముస్లిమేతర ప్రజలలో కూడా ఆగ్రహావేశాలతో కూడిన ప్రదర్శనలు జరిగాయి.

పాలస్తీనా సమస్యను అరబ్ రాజ్యాలతో సహా విశ్వాసం కోల్పోయిన ప్రభుత్వాలు కూడా పక్కన పెట్టేశాయి. ఇప్పుడు ఇదే ప్రాంతీయ, ప్రపంచ రాజకీయాలకు కేంద్రం అవుతుంది. సరిగ్గా హమాస్ సాధించాలనుకున్నది ఇదే. శాంతి, శ్రేయస్సుతో కూడిన యుగానికి దారి తీస్తూ, ఇజ్రాయెల్‌ను పశ్చిమాసియా రాజకీయ ప్రధాన స్రవంతిలోకి తీసుకురాగల... అమెరికా మద్దతు కలిగిన ప్రాంతీయ ఒడంబడిక వైపు మొగ్గు చూపడం అనేది ఇప్పుడు సమాధి అయిపోయింది. ఇంకా చెప్పాలంటే పాలస్తీనా సమస్య ప్రస్తుతం స్తంభించిపోయింది. ఇది రివర్స్ కావచ్చు కూడా. ఇరాన్, లెబనాన్ కూడా ఘర్షణ కేంద్రాలుగా మారితే వివాదం మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. విస్తృత స్థాయి యుద్ధంగా మారితే మహా విపత్తు అవుతుంది.

పౌరుల లక్ష్యాలపై హమాస్ ప్రారంభించిన భయంకరమైన ఉగ్రదాడుల అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ ఇజ్రాయెల్‌కు సంఘీభావం తెలిపారు. అది అప్పుడు సముచితమే. కానీ తదుపరి పరిణామాలకు ఒక కారకం అవసరం. గాజా స్ట్రిప్‌లో హమాస్‌పై జరిగిన దాడిలో పాలస్తీనా పౌరులకు జరిగిన తీవ్ర నష్టాన్ని కూడా అంగీకరించాలి. వారి హక్కులు ఇజ్రాయెల్ ప్రజలకు ఉన్నంత ముఖ్యమైనవి, బలమైనవి కూడా.

మన పశ్చిమ పొరుగు ప్రాంతంలో పరిస్థితి భౌగోళికంగా, రాజకీయపరంగా ప్రమాదభరితంగా మారితే భారతదేశం కూడా నష్టపోతుంది. సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందనే అంచనాతో ఇప్పటికే చమురు ధరలు పెరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో నివసిస్తున్న, పని చేస్తున్న దాదాపు 80 లక్షలమంది భారతీయుల సంక్షేమం కూడా ప్రమాదంలో పడుతుంది. ఇటీవలి కాలంలో, ఈ ప్రాంతంలో నిర్బంధం, సయోధ్య పట్ల సాధారణ ధోరణిని ఉపయోగించుకున్న భారతదేశం అరబ్ దేశాలతో, ఇజ్రాయెల్‌తో ఏకకాలంలో బలమైన భాగస్వామ్యాలను కొనసాగించగలిగింది. ఐ2యూ2 (ఇండియా–ఇజ్రాయెల్, యూఏఈ–యూఎస్) భాగస్వామ్యం ఆ ధోరణి కొనసాగుతుందనే అంచనాపై ఆధారపడి ఉంది. ఈ ఊహను పునః పరిశీలించవలసి ఉంటుంది.

మనం ఇప్పుడు రష్యా–ఉక్రెయిన్ యుద్ధంతో మాత్రమే కాకుండా పశ్చిమాసియాలో సంభవించే పెను మంటతో కూడా పోరాడవలసి ఉంది. వచ్చే ఏడాది అమెరికాలోనూ, మన దేశంలోనూ ఎన్నికలు జరగనుండగా, పెద్ద ఎత్తున రాజకీయ పరివర్తనలు కూడా జరుగుతున్నాయి. అనిశ్చితి, అనూహ్యత అపూర్వమైన స్థాయికి చేరుకున్నాయి. న్యూఢిల్లీలో జరిగిన జీ20 శిఖరాగ్ర సమావేశం విజయవంతమైన ప్రకాశాన్ని, వాస్తవికత తాలూకు తాజా మోతాదుతో తగ్గించాల్సిన అవసరం ఉంది.

వ్యాసకర్త విదేశాంగ మాజీ కార్యదర్శి
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాటలు తాజాగా ఇలా...!

ఇదా పద్ధతి?



నేనొక వికలాంగురాలిని. ముంబయిలోని ఖార్ రిజిస్ట్రార్ ఆఫీసులో అక్టోబర్ 16న పెళ్లి చేసుకున్నాను. ఆఫీసు రెండో అంతస్థులో ఉంది. లిఫ్టు లేదు. సంతకాల కోసం వాళ్లు కిందికి దిగలేదు. నన్ను రెండు అంతస్థుల వరకూ మోసుకెళ్లాల్సి వచ్చింది.

– విరాలీ మోదీ, టెడెక్స్ స్పీకర్

ముందైతే ఎంగేజ్‌మెంట్



నిన్న బాధపడ్డాం. ఇవాళ ఉత్కర్ష్ సక్సేనా (న్యాయవాది), నేను మా హక్కులను నిరాకరించిన అదే కోర్టు దగ్గరికి వెళ్లి మా ఉంగరాలను మార్చుకున్నాం. ఈ వారం న్యాయం జరగకపోవడం గురించినది కాదు. మా నిశ్చితార్థం గురించినది. పోరాడటానికి మరో రోజు వస్తాం.

– అనన్యా కోటియా, పీహెచ్‌డీ విద్యార్థి

అన్నింటికీ మందులా?



కొన్నిసార్లు ఒక ఫిజిషియన్‌గా కష్టమైన విషయం ఏమిటంటే, పేషెంట్‌కు ఏమీ చేయనక్కర్లేదని చెప్పాల్సి రావడం! 'వేచి ఉండండి. వాటికవే మానిపోతాయి'... ఇలా చెప్తే పేషెంట్లు తమ కన్సల్టేషన్ ఫీజుకు తగిన విలువ రాలేదనుకుంటారు. వాస్తవం ఏమిటంటే, కొన్ని జబ్బులకు మందులు అక్కర్లేదు.

– జోయీతా, ఫిజిషియన్

అంతా వ్యతిరేకమే!



ఇండియాలోని మా 'క్వీర్' జనానికి దేశ సమైక్యత, మత సామరస్య పురస్కారాలను ఇవ్వాలి. అన్ని మతాల్లోని ఛాందసులను ఏకస్వరంలో మాట్లాడించేలా చేయగలిగే మాంత్రిక శక్తి మా దగ్గరుంది. అది రెయిన్‌బో మ్యాజిక్!

– అభిజిత్ మజుందార్, ప్రొఫెసర్

శాంతి కోసం...



అక్టోబర్ 27 శుక్రవారాన్ని ఉపవాసం, ప్రాయశ్చిత్తం, శాంతి కోసం ప్రార్థన జరిపే రోజుగా ప్రకటించాలని నిర్ణయించాను. వివిధ క్రైస్తవ సమూహాలను, ఇతర మతాల సభ్యులను, ప్రపంచంలో శాంతిని అతి ముఖ్యమైనదిగా తలిచే అందరినీ భాగస్వాములు కావాలని ఆహ్వానిస్తున్నాను.

– పోప్ ఫ్రాన్సిస్, మత గురువు

మంచి వ్యూహం



ఇరాన్ వ్యూహంలో ఎంత అద్భుతమైన మార్పు! మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా (సౌదీ అరేబియాతో) చక్కని సమన్వయంతో ముందడుగు వేయడం ఇందులో కీలకాంశం. ఇది ఇరాన్‌కు మరింత బలాన్ని పెంచుతుంది. అమెరికాను చర్చలకు దిగేలా ఒత్తిడి చేస్తుంది. (ఇజ్రాయిల్, పాలస్తీనా) ప్రాంతీయ రాజకీయాల్లో తప్పక జరిగే పర్యవసానం.

– ఎం.కె. భద్రకుమార్, మాజీ దౌత్యవేత్త

ఆపేద్దాం!



నేనొక ఇజ్రాయిలీ యూదును. నాకు ఏ హోదా లేదు. కానీ మనుషులం అందరం శాంతిగా బతికే అవకాశం ఉందని నమ్ముతాను. ప్రతి మనిషి జీవితం ఎంతో విలువైనదే. ఈ చిన్న గ్రహంలో మనమందరం ప్రేమతో అనుసంధానితమై ఉన్నాం. గాజాలో సాగుతున్న ఈ యుద్ధం వెంటనే ఆగిపోవాలి.

– అమీ దార్, యాక్టివిస్ట్

ఇన్ బాక్స్

ఆటను ఆటగానే చూడాలి!

ఇప్పటికే క్రికెట్ ప్రపంచ కప్ సందడి మొదలయింది. ప్రస్తుతం దసరా సెలవులు కూడా రావడంతో ఈ సందడికి మరింత ఊపు వచ్చింది. మన దేశంలో క్రికెట్‌ని ఓ మతంలా చూస్తారు. అంత వరకు బాగానే ఉంటుంది. కానీ ఆ క్రీడను ఆస్వాదించేటప్పుడు మతాన్ని ప్రాతిపదికగా తీసుకోవడమే ఇబ్బందికరం.

ఇండియా, పాకిస్తాన్ మధ్య క్రికెట్ మ్యాచ్ అంటే ప్రపంచ వ్యాప్తంగా ఓ ప్రత్యేకమైన ఆసక్తి నెలకొంటుంది. మీడియా ప్రచారం కూడా ఇందుకు తోడౌతుంది. అభిమానులు తీవ్ర భావోద్వేగాలకు గురౌతుంటారు. ఆటగాళ్లు కూడా తీవ్రమైన ఒత్తిడిలో ఉంటారు. కానీ ఈ మ్యాచ్‌ను కూడా ఓ సాధారణ మ్యాచ్‌గానే చూడాలి. అయితే ఇటీవల ఈ రెండు జట్ల మధ్య అహ్మదాబాద్‌లో జరిగిన మ్యాచ్‌లో కొంత మంది ప్రేక్షకులు పెద్ద ఎత్తున 'జై శ్రీరామ్' అని నినాదాలు చేశారంటూ వార్తలు వచ్చాయి.

తాజాగా పాకిస్తాన్ వికెట్ కీపర్ – బ్యాట్స్‌మన్ మహ్మద్ రిజ్వాన్ వివాదంలో చిక్కుకున్నారు. పాకిస్తాన్ – నెదర్లాండ్స్ మ్యాచ్ సందర్భంగా రిజ్వాన్ మైదానంలో నమాజ్ చేశాడు. ఇప్పుడు ఈ అంశంపై ఐసీసీలో ఫిర్యాదు దాఖలైంది. రిజ్వాన్‌పై సుప్రీంకోర్టు న్యాయవాది వినీత్ జిందాల్ ఐసీసీకి ఫిర్యాదు చేశారు. ఆయన మైదానంలో ప్రార్థన చేయడం ఆటస్ఫూర్తికి విరుద్ధమని జిందాల్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. నిజానికి, రిజ్వాన్ గతంలో కూడా అలాగే చేశాడు.

ఏది ఏమైనా ఆటను ఆటగా చూసి ఆనందించాలి. ఆట జరిగేది రెండు జట్ల మధ్యే గానీ, రెండు మతాల మధ్య కాదని గ్రహించాలి. ఆటల్లోకి మతం వంటి సున్నితమైన విషయాలను జొప్పించకూడదు. అది క్రీడాస్ఫూర్తికి విరుద్ధం.

– ఎమ్. రాం ప్రదీప్, తిరువూరు

అనవసర ద్వేషం మంచిది కాదు!

అభిప్రాయం



అడుసుమిల్లి జయప్రకాష్

తెలుగు రాష్ట్రాల్లో ఒక సామాజిక వర్గంవారు కేవలం ఇద్దరు పత్రికాధిపతులు, టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పేవి మాత్రమే వింటున్నారు. వాస్తవాలను పట్టించు కోనంతగా ఆ మాటలను నమ్ముతున్నారు. ఫలితంగా మిగతా ప్రజల నుంచి వేరుపడి ఒంటరివారవు తున్నారు. చంద్రబాబు అధికారం చేజిక్కించుకోవడానికి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. అలాగే చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండడం ఆ ఇద్దరు పత్రికాధిపతులకు అవసరం. ఎందుకంటే బాబు సీఎంగా ఉంటేనే వాళ్ళ వ్యాపారాలు బాగుంటాయి.

తనను ఓడించినందుకు జగన్‌పై చంద్రబాబుకు కోపం. తమ నేతను ఓడించి తమ వ్యాపారాలపై దెబ్బ వేసి తాము ఇన్నేళ్ళుగా చేస్తూ వస్తున్న అవినీతిని ప్రశ్నించినందుకు ఆ పత్రికాధిపతులకు జగన్‌పై కోపం. తమ కోపాన్ని వాళ్ళు మొత్తం ఒక కులం కోపంగా మార్చేస్తున్నారు. ఇది ముమ్మాటికీ ఖండనీయం. జగన్ పాలనలో రాష్ట్రానికి పరిశ్రమలు రావడం లేదనీ, ఉద్యోగాలు పెరగలేదనీ, మొత్తంగా రాష్ట్రం అభివృద్ధి చెందడం లేదనీ ఈ ముగ్గురు చెప్పారు కాబట్టి మిగతావారు మొత్తం అదే నిజమని నమ్ముతున్నారు. వారు తమ చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను నిజాలు తెలుసుకోడానికి వాడడం లేదు.

ప్రతి ఊళ్లో ఇంతకు ముందు ప్రభుత్వ భవనాలు రెండే ఉండేవి – ఒకటి స్కూల్ భవనం, రెండోది గ్రామ పంచాయితీ భవనం. మరి ఇప్పుడు చూడండి – 'గ్రామ సచివాలయం', 'విలేజ్ క్లినిక్', 'రైతు భరోసా కేంద్రం' లాంటివి అదనంగా వచ్చి చేరాయి. వాటిలో పని చేయడానికి 15 నుండి 20 మంది కొత్త ఉద్యోగులు వచ్చారు. దీంతో ఆ గ్రామం ముఖచిత్రం మారిపోలేదా? 'నాడు – నేడు' పథకంతో స్కూల్, ఆస్పత్రి రూపాలు మారిపోలేదా? ఇవి కాక 104, 108 అంబులెన్సుల మాటేమిటి? చెత్త సేకరణకు వాహనాలు రాలేదా? ఈ అంబులెన్సుల్లో, రేషన్‌ను పంపిణీ చేసే వాహనాల్లో, చెత్త సేకరణ వాహనాల్లో డ్రైవర్‌తోపాటు సిబ్బంది నియమితులయ్యారు కదా! ఇవన్నీ కొత్త ఉద్యోగాలు కావా? వృద్ధులకు, వికలాంగులకు పెన్షన్ ఇంటివద్దనే ఇస్తున్నారు. లక్షలాది ఉద్యోగాలు నాలుగైదేళ్లలో ఇచ్చి పరిపాలనను ప్రజల ముంగిటకు తీసుకువస్తే అది అభివృద్ధి కాదా? సామాజిక మార్పు కాదా?



గ్రామాల్లో పేదల పిల్లలు ట్యాబులు పట్టుకొని తిరుగుతున్నారు. కనిపించడం లేదా? ఇంగ్లీష్ మాట్లాడుతున్నారు. వినలేదా? ఈ మధ్యనే అమెరికా వెళ్ళి ఐక్యరాజ్యసమితి ఆఫీసులో మాట్లాడారు. ప్రపంచ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో అధికారులతో ముచ్చటించారు. చూడలేదా? అసలు ఈ 75 ఏళ్ళ స్వతంత్ర భారత దేశంలో ఏ ప్రభుత్వం అయినా, ఎప్పుడైనా పేదల పిల్లలను ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయం వరకూ తీసుకెళ్ళిందా?

రాష్ట్రంలో మొత్తం 17 మెడికల్ కాలేజీలు నిర్మిస్తున్నారు. ఒక్కో కాలేజీకి 150 సీట్లు వస్తాయి. అంటే మొత్తం 2550 కొత్త మెడికల్ సీట్లు. ఒక్క ఐదేళ్ళలోనే ఇన్ని అదనపు సీట్లు రాష్ట్రానికి వస్తున్నాయి. ఇది అభివృద్ధి కాదా? పైగా ప్రతి కాలేజీకి అనుబంధంగా ఒక టీచింగ్ ఆస్పత్రి నిర్మిస్తున్నారు. అంటే 17 కొత్త ఆస్పత్రులు రాష్ట్రంలోకి వస్తున్నట్లే కదా! వైద్య ఆరోగ్య రంగంలో ఇది విప్లవాత్మక మార్పు కాదా? ఈ 17 ఆస్పత్రుల్లో ఎన్ని లక్షల మందికి వైద్యం లభిస్తుందో ఆలోచించాలి. రాష్ట్రంలో 8 ఫిషింగ్ హార్బర్లు వస్తున్నాయి. 4 ఓడ రేవులు వస్తున్నాయి. ఇవి ఆ పత్రికాధిపతులు చెప్పరు.

మొన్ననే ఇన్ఫోసిస్ ఆఫీసు విశాఖపట్నంలో ఓపెన్ చేశారు. రెండు నెలల ముందు కాకినాడలో 4 పరిశ్రమలు ప్రారంభించారు. మొన్న మరో 3 పరిశ్రమలు ప్రారంభించారు. వీటి గురించి ఆ ముగ్గురు చెప్పరు. ఆ ముగ్గురు స్వార్థంతో చెప్పే మాటలు గుడ్డిగా నమ్మినందువల్ల కలిగే ప్రయోజనం ఏమిటి? వాళ్ళు చెప్పిందే వేదం అని నమ్మేసి అవాకులూ చవాకులూ పేలే కొందరి వల్ల ఇతర కులాల వారు ఒక సామాజిక వర్గాన్ని దూరం పెడుతున్నారనే సంగతి గ్రహించాలి. కళ్ళు తెరచి వాస్తవాలను గ్రహించడానికి ఇప్పటికైనా ఆలస్యం కాలేదు. కావలసిన సమాచారం ఎవరికి వారు అనేక మూలాల ద్వారా సేకరించి తెలుసుకోవాలి. అప్పుడే ఏం జరుగుతుందనే వాస్తవం అర్థమవుతుంది. జగన్ ప్రభుత్వం పట్ల అనవసర ద్వేషం తొలగిపోతుంది. ప్రజలందరితో మమేకమై సమష్టి జీవన సౌరభాన్ని ఆస్వాదించగలుగుతారు.

వ్యాసకర్త మాజీ శాసనసభ్యులు

భగవద్ధ్యానం!

కావడిలో కుండల వంటివి సుఖదుఃఖాలని జీవితాన్ని తరచి చూసిన వాళ్ళకు అవగత మయ్యే సత్యం. రెండు వైపులా నీటితో నిండిన కుండలు లేకుండా కావడి ఎలాగైతే ఉండడం సాధ్యం కాదో అలాగే ఒకప్పుడు సుఖం మరొకప్పుడు దుఃఖం లేకుండా మానవ జీవితం గడవడం సాధ్యం కాదన్నది కూడా అంతే నిజం. సుఖంలో రోజులు గంటలుగా, గంటలు నిమిషాలుగా గడిచిపోతుంది జీవితం. కష్టంలోనూ, దుఃఖంలోనూ ఒక్కొక్క నిమిషం ఒక్కొక్క గంటలా మారి కాలం నత్త నడక నడుస్తున్నట్లుగా అనిపిస్తుంది. నిజానికి కాలం సుఖంలోనూ, దుఃఖంలోనూ ఏ తేడా లేకుండా ఒకేలా గడుస్తుంది. కాని అనుభవిస్తున్న మనిషికి మాత్రం అప్పుడు ఆ వ్యక్తి మనసున్న స్థితిని బట్టి ఆ రెండింటి మధ్య చాలా తేడా ఉన్నదన్న ఒక మిథ్యా భావనను కలిగిస్తుంది. కాబట్టి మనసు ఉన్న స్థితి అన్ని అనుభవాలకు కారణమని తెలుస్తుంది. తామరపల్లి తిమ్మయ ప్రధాని తన రచనయైన 'శేషధర్మం' కావ్యం ప్రథమాశ్వాసంలో ఈ భావననే ఒక చక్కని కందపద్యంలో తేలికగా అర్థమయ్యే మాటలలో చెప్పాడు.



వినుసుఖదుఃఖంబులకును
మనసే కారణము దాని మాటికి నెటకుం
జననీయక హరియందుం
బనుపఱుపుము కౌతుకంబు పాటిలు నీకున్.

మనుషుల ఆనందానికైనా, దుఃఖానికైనా మనస్సే కారణం. అంటే మనసు చేసే ఆలోచనలు, పొందే అనుభూతులే కారణం. కనుక మనసును అదుపులో ఉంచుకోవడం ద్వారా ఆలోచనలు పరిపరి విధాలుగా వెళ్ళడాన్ని నియంత్రించడం ఆవశ్యకం. అది అంత సులభంగా జరిగే పని కాదు కాబట్టి భగవంతుని ధ్యానంలో మనసు లగ్నం చేయడం మొదలు పెట్టి క్రమంగా అందులో ప్రావీణ్యాన్ని సాధించాలి. సుఖంలో మనసు మహదానందాన్ని అనుభవిస్తుంది. అదే దుఃఖంలో శోక సాగరంలో మునిగిపోయిన నౌకలా తయారవుతుంది. ఈ రెండు రకాల అనుభూతులు అనర్థదాయకాలే! ఆ స్థితి నుండి మనసును బయటికి లాగి స్థిర చిత్తం అనే అమృతమార్గం వైపునకు దారి చూపేది పరమాత్ముని ధ్యానమే కనుక అనంతుడు, అమేయుడు అయిన ఆ పరమేశ్వరుడిని ధ్యానించడంలో మనసును లగ్నం చేస్తే, తప్పక స్వస్థత చేకూరుతుంది అని సారాంశంగా పై పద్యంలో చెప్పబడింది.

– భట్టు వెంకటరావు

క్లుప్తంగా...

పీజీ మెడికల్ యాజమాన్య కోటా వెబ్ ఆప్షన్లకు అవకాశం

సాక్షి, అమరావతి: పీజీ మెడికల్ యాజమాన్య కోటా సీట్ల భర్తీ(2023–24)కి సంబంధించిన ఫేజ్–2 కౌన్సెలింగ్‌లో వెబ్ ఆప్షన్ల నమోదుకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. సాయంత్రం 4 గంటల నుంచే ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించింది. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ఆప్షన్‌ల నమోదు గడువు ముగుస్తుంది. https://pgmq.ysruhs.com/ వెబ్‌సైట్‌లో ఆప్షన్లు నమోదు చేయాలి. ఏమైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే 7416563063, 7416253073, 9063400829 ఫోన్ నంబర్లను సంప్రదించాలని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి సూచించారు.

ఉన్నత విద్యలో ప్రవేశాలకు 30వ తేదీ ఆఖరు

రాష్ట్ర మండళ్లకు యూజీసీ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్య కోర్సుల్లో ప్రవేశాలను ఈనెల 30వ తేదీకల్లా పూర్తి చేయాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఉన్నత విద్యా మండళ్లకు సూచించింది. దసరా తర్వాత నుంచి డిగ్రీ, పోస్టు–గ్రాడ్యుయేషన్ కోర్సులకు సంబంధించిన క్లాసులు ప్రారంభించాలని ఆదేశించింది. సాంకేతిక విద్యకు సంబంధించిన కాలేజీల్లోనూ అన్ని రకాల అనుమతులు, ప్రవేశాలను ఇదే సమయంలో పూర్తి చేయాలని పేర్కొంది. ఇందుకు సంబంధించిన సర్క్యులర్‌ను తెలంగాణ సహా అన్ని రాష్ట్రాలకు తాజాగా జారీచేసింది. ఇంజనీరింగ్ కాలేజీల్లో యాజమాన్య కోటా సీట్లను ఉన్నత విద్యా మండలి నోటిఫికేషన్ ఆధారంగా భర్తీ చేస్తారు. ఇలా భర్తీ చేసిన అభ్యర్థుల వివరాలను మండలి పరిశీలించి, అనుమతిస్తుంది. ర్యాటిఫికేషన్ ప్రక్రియలోనూ ప్రతి సంవత్సరం జాప్యం జరుగుతోంది. ఈసారి దీన్ని కూడా అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేయాలని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి ఆదేశించింది. తెలంగాణలో ర్యాటిఫికేషన్ ప్రక్రియ ఇప్పటికీ మొదలు కాలేదు. నవంబర్ నెలలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మరింత ఆలస్యమవడం అనివార్యమని అధికారులు చెబుతున్నారు. ఇలా జరిగినప్పుడు ఈ విషయాన్ని ఏఐసీటీఈకి తెలియజేయాల్సి ఉంటుంది. ఇక దోస్త్ ద్వారా డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ ఈనెల మొదటి వారం కూడా నడిచింది. సాంకేతికంగా ఇప్పటికే డిగ్రీ అడ్మిషన్లు పూర్తయినట్లేనని అధికారులు అంటున్నారు. పోస్టు–గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. యూజీసీ ఆదేశాల మేరకు ఈ నెలాఖరుకు పూర్తి చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

‘మణప్పురం’లో బంగారం మాయం

- 10.660 కిలోల ఆభరణాలు చోరీ చేసిన బ్రాంచ్ హెడ్ పావని
- కృష్ణా జిల్లా కంకిపాడులో ఘటన... కేసు నమోదు



కంకిపాడులోని మణప్పురం ఫైనాన్స్ సంస్థ కార్యాలయ భవనం

కంకిపాడు: కృష్ణా జిల్లా కంకిపాడులోని మణప్పురం ఫైనాన్స్ సంస్థలో ఖాతాదారులు తనఖా పెట్టిన బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఆ సంస్థ బ్రాంచ్ హెడ్ మరో వ్యక్తితో కలిసి ఏకంగా రూ.6కోట్లకు పైగా విలువైన 10.660 కిలోల బంగారు ఆభరణాలను స్వాహా చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. కంకిపాడు ఎస్ఐ కె.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణాజిల్లా గుడివాడ సమీపంలోని లింగవరం గ్రామానికి చెందిన రెడ్డి వెంకట పావని(30) ఏడాది నుంచి కంకిపాడులోని మణప్పురం ఫైనాన్స్ సంస్థ బ్రాంచి హెడ్‌గా పనిచేస్తోంది. ప్రస్తుతం ఈ బ్రాంచ్‌లో 1,477 మంది ఖాతాదారులు 16 కిలోల బంగారు ఆభరణాలను తనఖా పెట్టి రుణాలు పొందారు. సోమవారం రాత్రి బ్రాంచ్ హెడ్‌గా ఉన్న పావని విధులు ముగించుకుని వెళ్లారు. ఆమె మంగళవారం విధులకు హాజరుకాలేదు. కొందరు ఖాతాదారులు తాము తనఖా పెట్టిన బంగారు ఆభరణాలు విడిపించుకునేందుకు మంగళవారం మణప్పురం బ్రాంచ్‌కు వచ్చారు. వారు ఇచ్చిన రశీదుల ప్రకారం చూడగా, బ్రాంచ్‌లో ఆభరణాలు కనిపించలేదు. దీంతో సిబ్బంది తమ సంస్థ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. కంకిపాడు బ్రాంచిలోని రికార్డులను పూర్తి స్థాయిలో పరిశీలించిన అనంతరం సంస్థ ఉన్నతాధికారులు అర్ధరాత్రి సమయంలో పోలీసులకు సమాచారం అందించారు. జిల్లా ఎస్పీ జాషువా ఆదేశాలతో బుధవారం గన్నవరం డీఎస్పీ జయసూర్య, సీసీఎస్, కంకిపాడు, పెనమలూరు, ఉయ్యూరు పోలీసులు రంగంలోకి దిగి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. మొత్తం 951 మంది ఖాతాదారులకు సంబంధించిన 10.660 కిలోల బంగారు ఆభరణాలు కనిపించలేదని తేల్చారు. అపహరణకు గురైన బంగారు ఆభరణాల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.6కోట్లకు పైగా ఉంటుంది. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో మాత్రం రూ.3.08 కోట్ల విలువైన 10.660 కిలోల బంగారు ఆభరణాలు కనిపించడం లేదని మణప్పురం అధికారులు పేర్కొన్నారు.

ఖాతాదారుల్లో ఆందోళన

మణప్పురం కంకిపాడు బ్రాంచ్‌లో పది కిలోలకు పైగా బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలియడంతో తనఖా పెట్టి రుణాలు తీసుకున్న ఖాతాదారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. నమ్మకంగా పని చేస్తున్న సిబ్బందే బంగారం చోరీ చేశారని తెలిసి నివ్వెరపోతున్నారు. మరోవైపు ఈ బ్రాంచ్‌లో సీసీ కెమెరాలు కూడా పని చేయడం లేదని పోలీసులు గుర్తించారు. రెండు నెలలుగా సీసీ కెమెరాలు పనిచేయడం లేదని తెలిసినా పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మణప్పురం ఆఫీసు కింద ఉన్న షాపుల సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలే పోలీసుల విచారణకు తోడ్పడ్డాయి.

బ్రాంచ్ హెడ్ పావని పనే...

బంగారు ఆభరణాల చోరీ వెనుక బ్రాంచి హెడ్‌గా పనిచేస్తున్న రెడ్డి వెంకట పావని హస్తం ఉన్నట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఆమె సోమవారం రాత్రి విధులు పూర్తిచేసుకున్న అనంతరం తనతోపాటు వచ్చిన మరో వ్యక్తితో కలిసి కార్యాలయం మూసివేసి కారులో వెళ్లినట్లు సీసీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. సీసీ ఫుటేజ్‌లో కారు నంబరు ఆధారంగా దావులూరు టోల్‌గేట్ వద్ద వివరాలు సేకరించారు. ఈ మేరకు బంగారు ఆభరణాల చోరీలో పావనికి సహకరించిన వ్యక్తిని గుర్తించి అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. అయితే, ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించలేదు.

ఏపీ క్రీడాకారులకు ‘టార్గెట్ గోవా’

- శాప్ సారథ్యంలో జాతీయ పోటీలకు ఏపీ క్రీడా బృందాల సన్నద్ధం
- ఇప్పటికే 233 మంది బృందాలకు రూ.10 లక్షలు మంజూరు



గోవాకు చేరుకున్న బ్యాడ్మింటన్ బృందం

సాక్షి, అమరావతి: క్రీడాకారుల అభ్యున్నతికి ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతోంది. ఆర్థికంగా వెనుకబడి, ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించడంతో పాటు ప్రత్యేక శిక్షణ ద్వారా నైపుణ్యాలకు పదునుపెడుతోంది. 37వ జాతీయ క్రీడలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని టార్గెట్ గోవా నిర్వహించింది. దాదాపు 6 నెలల పాటు 16 క్రీడాంశాల్లో 288 మంది క్రీడాకారులకు తర్ఫీదు ఇచ్చింది. సుమారు రూ.80 లక్షల వ్యయంతో నిపుణులైన కోచ్‌ల ఆధ్వర్యంలో పతకాలు సాధించేలా మెళకువలు నేర్పించింది.

ఇప్పటికే రూ.10 లక్షలు మంజూరు

గోవాలో ఈ నెల 25వ తేదీ నుంచి నవంబర్ 9వరకు జాతీయ క్రీడాపోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులకు టీఏ, డీఏలతో పాటు స్పోర్ట్స్ కిట్స్‌ను అందిస్తోంది. ఇప్పటివరకు 15 క్రీడాంశాల్లో 166 మంది క్రీడాకారులకు, 57 మంది కోచ్‌లు, జట్టు మేనేజర్లకు కలిపి మొత్తం 233 మందికి బృందానికి రూ.10.25 లక్షలు నిధులను మంజూరు చేసింది.

తానే బాధ్యతలు చేపట్టిన శాప్

జాతీయ క్రీడా పోటీలను భారత ఒలింపిక్ అసోసియేషన్ నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే ఆయా రాష్ట్రాల క్రీడా సంఘాలు స్థానిక ఒలింపిక్ సంఘాల ద్వారా పోటీల్లో పాల్గొనడం ఆనవాయితీగా వస్తోంది. అయితే భారత ఒలింపిక్ సంఘం జాతీయ క్రీడలకు వెళ్లే ఏపీకి ఒలింపిక్ సంఘాన్ని నామినేట్ చేయలేదు. ఫలితంగా శాప్ స్వయంగా క్రీడాకారుల బాధ్యతలను తీసుకుంది. క్రీడా సంఘాలతో చర్చించి శిక్షణ మొదలు టోర్నీలో ప్రదర్శన ఇచ్చే వరకు అన్నీతానై వ్యవహరిస్తోంది.

క్రీడా స్ఫూర్తిని పెంచేలా..

క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీయడంతో పాటు వారికి అవసరమైన ఆర్థిక ప్రోత్సాహం అందించేందుకు శాప్ ఎప్పుడూ ముందుంటుంది. 37వ జాతీయ క్రీడల్లో ఏపీకి పతకాలే లక్ష్యంగా క్రీడాకారులకు మంచి శిక్షణ అందించాం. ఒలింపిక్ సంఘం ప్రమేయం లేకుండానే శాప్ స్వయంగానే జాతీయ క్రీడల్లో పాల్గొనే ఏపీ బృందాన్ని పర్యవేక్షిస్తోంది. వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను అందిస్తోంది.

– ధ్యానచంద్ర, ఎండీ, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ

వైట్ కాలర్ నేరాల్లో సయామీ కవలలు

- చంద్రబాబు –రామోజీ పెంచినోళ్లను కాటేయడంలో సిద్ధహస్తులు: సజ్జల
- స్కిల్ స్కామ్ నుంచి దృష్టి మళ్లించేందుకు టీడీపీ రోజుకో డ్రామా



సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, ఈనాడు రామోజీ వైట్ కాలర్ నేరాలకు పాల్పడే సయామీ కవలలు అని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. తమను పెంచిన వారినే కాటేయగలమని నిరూపించారని మండిపడ్డారు. వారిద్దరి నేరాల్లో సారూప్యత, సామీప్యత స్పష్టంగా కనిపిస్తోందని, మోడ్రన్ గజదొంగల ముఠాకు నాయకుల్లా వ్యవహరిస్తున్నారని తూర్పారబట్టారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సజ్జల మీడియాతో మాట్లాడారు.

రామోజీని తమ్ముడిలా చూసుకున్న జీజే రెడ్డి

పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్‌కు చంద్రబాబు అత్యంత క్రూరంగా వెన్నుపోటు పొడిస్తే వ్యాపారపరంగా తనకు జీవితాన్ని ఇచ్చిన జీజే రెడ్డి షేర్లను కొట్టేసి రామోజీ వంచనకు పాల్పడ్డాడు. కొండపల్లి సీతారామయ్య రిఫరెన్స్‌తో జీజే రెడ్డి వద్ద టైపిస్టుగా ఉద్యోగంలో చేరిన రామోజీ 1960ల్లో ఆయన దగ్గర రూ.5 వేలు తీసుకుని మార్గదర్శి చిట్ ఫండ్స్‌ను ప్రారంభించాడు. ఆ పెట్టుబడితో జీజే రెడ్డిని ప్రమోటర్ డైరెక్టర్‌గా షేర్లు అలాట్ చేశారు. ఆ షేర్లు 2016 వరకూ కొనసాగాయి. ఇందులో ప్రతి ఒక్కటీ వాస్తవమే అని రామోజీనే అంగీకరిస్తున్నాడు. తనను చిన్న తమ్ముడిలా చూసుకున్న జీజే రెడ్డికి డబ్బులు ఎలా ఎగ్గొట్టాలా అని రామోజీ చూశాడు. ఆయన కుమారులను తుపాకీతో బెదిరించి స్టాంప్ పేపర్లపై సంతకాలు చేయించుకున్నారు. జీజే రెడ్డిని ముంచేసి తన వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నాడు. ఆయన చెబుతున్నట్లు 228 షేర్ల విలువ రూ.2.88 లక్షలే అయితే రామోజీ షేర్లు అన్నీ అదే రేటుకు ఇవ్వగలరా? నువ్వు బంగారు సింహాసనం మీద కూర్చుని జీజే రెడ్డి కుమారులను రోడ్డుపై నిలబెట్టావు. జీజే రెడ్డి నీకు చేసిన సాయానికి ఎంతో చేసి ఉండాల్సింది. నీకు వస్తున్న లాభాల్లో జీజే రెడ్డి కుమారులకూ వాటా రావాలి. పెద్ద మనుషులుగా చెలామణి అవుతూ, మార్గదర్శకులం అని చెప్పుకుంటూ ఇలాంటి నీచమైన పనులు చేశారు. ఆయన అక్రమ సామ్రాజ్యం అంతా ఇలా వచ్చిందే. జీజే రెడ్డి షేర్లను కాజేయడం రామోజీ ఆర్థిక నేరాల్లో ఒక చిన్న ఉదాహరణ మాత్రమే. మార్గదర్శి టర్నోవర్ రూ.1,200 కోట్లు అని రామోజీరావే చెబుతారు. మరి అంత టర్నోవర్ ఉంటే ఇన్నేళ్ల బిజినెస్‌కు కేవలం రూ.39 లక్షల డివిడెండ్ మాత్రమే జీజే రెడ్డి కుమారులకు వచ్చిందా? డబ్బు పెట్టిన జీజే రెడ్డి మెయిన్ ప్రమోటర్ అవుతాడు. అంతా ఆయన కుమారులకే వెళ్లాలి.

తప్పించుకునే యత్నాలు..

చంద్రబాబు 1995లో సీఎం అయ్యిందే సంపాదన కోసం అన్నట్లు ప్రవర్తించాడు. సీఎం అయిన రెండు నెలలకే చట్టాల్లో మార్పు చేసి డిఫర్డ్ టాక్స్ పేరుతో ప్రజల సొమ్ము రూ.ఆరేడు కోట్లు తీసుకుని దాని మీదే హెరిటేజ్ సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు. ఇప్పటికీ ప్రజల సొమ్మును ప్రభుత్వానికి చెల్లించలేదు. స్కిల్ స్కామ్‌లో ఖజానా నుంచి రూ.371 కోట్లు కాజేసి రూ.241 కోట్లను షెల్ కంపెనీల ద్వారా మళ్లించి జేబులో వేసుకున్నాడు. తన పీఎస్‌ను గుట్టుగా దేశం దాటించేశారు. బాబు ఆరోగ్యంపై జైలు అధికారుల నివేదికను టీడీపీ నేతలే లీక్ చేశారు. ప్రిజనర్స్‌కి ఎవరైనా రోజూ హెల్త్ బులిటెన్ ఇస్తారా? ఆయన కోర్టు కస్టడీలో ఉన్నందున దీనిపై న్యాయస్థానంలోనే అడగాలి. చంద్రబాబును ఆయన కుటుంబ సభ్యులే బట్టలిప్పి రోడ్డు మీద నిలబెడుతున్నారు. ములాఖత్‌లో రోజుకు ఒకసారికి మించి వాళ్ల లాయర్లు ఏం మాట్లాడతారు? చంద్రబాబు విచారణను ఎదుర్కొని నిర్దోషిత్వాన్ని నిరూపించుకోకుండా సాంకేతిక కారణాల సాకుతో తప్పించుకునే యత్నం చేస్తున్నారు.

15 నుంచి కులగణన

▶ మొదటి పేజీ తరువాయి

గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల సహకారంతో ప్రత్యేక యాప్ ద్వారా కులగణన ప్రారంభిస్తున్నట్టు వివరించారు. బీసీ నాయకుల సూచనలు, సలహాల కోసం ప్రాంతాల వారీగా విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, కర్నూలు, తిరుపతిలో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. వ్యక్తిగతంగా సలహాలు, సూచనలు ఇచ్చేవారి కోసం ప్రత్యేక ఈ–మెయిల్ ఐడీ అందుబాటులో పెడతామన్నారు.

1931లో జరిగిన కులగణనే చివరిది..

దేశంలో బ్రిటిష్ కాలంలో 1872లో కులగణన ప్రక్రియ ప్రారంభమైందని మంత్రి చెల్లుబోయిన చెప్పారు. ఇది 1941 వరకు ప్రతి పదేళ్లకోసారి జరిగిందన్నారు. రెండో ప్రపంచ యుద్ధం కారణంగా 1941 కులగణనను పరిగణనలోకి తీసుకోలేదని, అందువల్ల 1931 కులగణనే చివరిదని మంత్రి చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1951 నుంచి జనగణన మాత్రమే చేస్తున్నారన్నారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ వర్గాలను మినహా మిగిలిన అన్ని కులాలను గంపగుత్తగా లెక్కిస్తున్నట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో దశాబ్దాలుగా కులగణన డిమాండ్ వినిపిస్తోందన్నారు. బీసీ వర్గాల కులగణన వినతులను గత ప్రభుత్వాలు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ వర్గాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ 139 బీసీ కులాలను గుర్తించి వాటికి ప్రత్యేకకార్పొరేషన్లు ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. మంత్రివర్గంలో ఏకంగా 10 మంది బీసీలకు స్థానం కల్పించారన్నారు.

ఏఎన్నార్ కుమార్తె నాగ సరోజ కన్నుమూత

సాక్షి, హైదరాబాద్: దివంగత నటుడు అక్కినేని నాగేశ్వరరావు (ఏఎన్నార్) కుమార్తె, టాలీవుడ్ నటుడు నాగార్జున సోదరి నాగ సరోజ అనారోగ్యంతో చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూశారు. దీంతో అక్కినేని వారి ఇంట విషాదం నెలకొంది. ఏఎన్నార్‌కు సత్యవతి, నాగ సుశీల, నాగ సరోజ, వెంకట్, నాగార్జున.. ఇలా ఐదుగురు సంతానం. వారిలో సత్యవతి చాలా ఏళ్ల క్రితమే మరణించగా, ఇప్పుడు నాగ సరోజ మృతి చెందారు. స్టార్ హీరో కుమార్తె అయినప్పటికీ చిత్రపరిశ్రమకు దూరంగా ఉంటూ చాలా సాధారణ జీవితాన్ని గడిపారు.

మలాలా యూసఫ్‌జాయ్ రూ.2.5 కోట్ల విరాళం



లండన్: గాజా ఆసుపత్రిలో జరిగిన బాంబు పేలుడు ఘటనలో ఏకంగా 500 మందికిపైగా జనం మృతిచెందడం పట్ల ప్రపంచ వ్యాప్తంగా సానుభూతి వెల్లువెత్తుతోంది. ఈ మారణకాండను ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో ఖండిస్తున్నాయి. పెద్ద సంఖ్యలో చిన్నారులు బలి కావడం పట్ల పాకిస్తాన్ సాహస బాలిక, నోబెల్ శాంతి బహుమతి విజేత మలాలా యూసఫ్‌జాయ్ చలించిపోయారు. ఈ మేరకు బుధవారం ఒక వీడియో సందేశం విడుదల చేశారు. గాజాలోని అల్–అహ్లీ ఆసుపత్రిలో బాంబు పేలుడు ఘటనను మీడియాలో చూసి భయాందోళనకు గురయ్యానని చెప్పారు. ఈ ఘాతుకాన్ని ఖండిస్తున్నానని తెలిపారు. వెంటనే కాల్పుల విరమణ పాటించాలని, గాజాకు నిత్యావసరాలు, ఆహారం, నీరు సరఫరా చేయాలని ఇజ్రాయెల్ ప్రభుత్వాన్ని మలాలా కోరారు. ఈ విపత్కర సమయంలో గాజాలో పాలస్తీనియన్ల సంక్షేమం కోసం కృషి మూడు స్వచ్ఛంద సంస్థలకు 3 లక్షల డాలర్ల (రూ.2.5 కోట్లు) విరాళం ఇవ్వబోతున్నానని మలాలా ప్రకటించారు. ఇజ్రాయెల్, పాలస్తీనాతోపాటు ప్రపంచవ్యాప్తంగా శాంతి కోసం పోరాడుతున్నవారితో తాను కూడా గొంతు కలుపుతున్నానని వ్యాఖ్యానించారు. గాజా జనాభాలో సగం మంది 18 ఏళ్లలోపు వారేనని అన్నారు.

దాడి ఘటనపై మోదీ దిగ్భ్రాంతి

న్యూఢిల్లీ: గాజా ఆసుపత్రిలో బాంబు పేలుడులో పెద్ద సంఖ్యలో జనం మరణించడం పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్–హమాస్ ఘర్షణలో సాధారణ ప్రజలు బలి కావడం దురదృష్టకరమని వాపోయారు. ఈ మేరకు బుధవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఇప్పటికైనా గాజాలో హింసకు తెర పడాలని ఆకాంక్షించారు. ఆసుపత్రిలో బాంబు పేలుడుకు బాధ్యులైన వారిని తప్పనిసరిగా శిక్షించాలని నరేంద్ర మోదీ డిమాండ్ చేశారు. బాధితుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

ఐరాసలో వీగిపోయిన తీర్మానం

ఐరాస: గాజాలోని పాలస్తీనియన్లకు మానవతా సాయం అందించేందుకు వీలుగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో బుధవారం బ్రెజిల్ ప్రవేశపెట్టిన ముసాయిదా తీర్మానం వీగిపోయింది. ఇజ్రాయెల్ మిత్రదేశం అమెరికా ఈ తీర్మానాన్ని వీటో చేసింది. ఇజ్రాయెల్ ఆత్మరక్షణ హక్కు గురించి ఈ తీర్మానంలో ప్రస్తావించకపోవడం తమను అసంతృప్తికి గురి చేసిందని అమెరికా వెల్లడించింది. ముసాయిదా తీర్మానానికి అనుకూలంగా 12 దేశాలు ఓటు వేశాయి. రష్యా, బ్రిటన్ గైర్హాజరయ్యాయి. ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశమైన అమెరికా వీటో చేయడంతో తీర్మానం ఆమోదం పొందలేదు.

ఆ కిరాతకం మీదే..



అహ్లీ ఆసుపత్రిలో పేలుడులో బలైన పాలస్తీనియన్ల మృతదేహాలు

అల్–అహ్లీ ఆసుపత్రిలో పేలుడుపై ఇజ్రాయెల్–హమాస్ పరస్పర నిందలు

మిలిటెంట్ల రాకెట్ గురితప్పడం వల్లే ఈ దారుణం

- ఇజ్రాయెల్ సైన్యం స్పష్టీకరణ.. ఖండించిన హమాస్
- ముమ్మాటికీ ఇజ్రాయెల్ బాధ్యత వహించాలని స్పష్టీకరణ
- ఆసుపత్రిలో పేలుడు ఘటనలో 471 మంది మృతి
- ఇజ్రాయెల్‌లో అమెరికా అధ్యక్షుడు బైడెన్ పర్యటన

గాజా స్ట్రిప్/టెల్ అవీవ్/వాషింగ్టన్/న్యూఢిల్లీ: గాజా సిటీలోని అల్–అహ్లీ ఆసుపత్రిలో పేలుడు ఘటనపై ఇజ్రాయెల్, హమాస్ పరస్పరం నిందలు మోపుకుంటున్నాయి. దాదాపు 500 మందిని బలిగొన్న కిరాతకులు మీరంటే మీరేనని వాదులాటకు దిగాయి. ఇస్లామిక్ జిహాద్ మిలిటెంట్లు ప్రయోగించిన రాకెట్ గురితప్పడంతో ఈ దుర్ఘటన జరిగిందని ఇజ్రాయెల్ చెబుతోంది. కానీ, ముమ్మాటికీ ఇజ్రాయెల్ సైన్యమే ఈ ఘాతుకానికి ఒడిగట్టిందని హమాస్ ఆరోపించింది. అల్–అహ్లీ ఆసుపత్రి ప్రాంగణంలో హృదయవిదారక వాతావరణం నెలకొంది. క్షతగాత్రులను ఎక్కడికి తరలించాలో తెలియడం లేదని వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికే గాజాలో ఆసుపత్రులన్నీ బాధితులతో నిండిపోయాయని గుర్తుచేస్తున్నారు. ఇక్కడ వైద్య సదుపాయాలు లేకపోవడంతో మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉందంటున్నారు. మరోవైపు ఇజ్రాయెల్–హమాస్ మధ్య యుద్ధం బుధవారం 12వ రోజుకు చేరింది. ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో గాజాలో ఇప్పటివరకు 3,478 మంది మరణించారని, 12,000 మందికిపైగా క్షతగాత్రులుగా మారారని గాజా ఆరోగ్య శాఖ ప్రకటించింది. మరో 1,300 మంది శిథిలాల కింద చిక్కుకుపోయినట్లు భావిస్తున్నామని, వారు ప్రాణాలతో బయటపడతారన్న నమ్మకం లేదని వెల్లడించింది. హమాస్ రాకెట్ దాడుల్లో ఇజ్రాయెల్‌లో 1,400 మందికిపైగా జనం ప్రాణాలు కోల్పోయారని స్థానిక అధికారులు పేర్కొన్నారు. దాదాపు 200 మంది బందీలు ఇప్పటికీ హమాస్ అధీనంలోనే ఉన్నారు. వారిని విడిపించేందుకు ఇజ్రాయెల్ సాగిస్తున్న ప్రయత్నాలు పెద్దగా ఫలితాన్ని ఇవ్వడం లేదు. ఇరుపక్షాలు మెట్టు దిగిరావడం లేదు. దాంతో బందీల పరిస్థితి ఏమిటన్నది ఆందోళనకరంగా మారింది. గత 12 రోజుల్లో హమాస్ మిలిటెంట్లు ఇజ్రాయెల్‌పై 450 రాకెట్లు ప్రయోగించారని అంచనా. ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ గాజాపై వైమానిక దాడులు కొనసాగించింది.

భయంకరమైన ఊచకోత: హమాస్

అల్–అహ్లీ హాస్పిటల్‌లో పేలుడుకు తాము కారణం కాదని ఇజ్రాయెల్ సైనిక ప్రతినిధి డేనియల్ హగారీ చెప్పారు. ఆ పేలుడుతో తమకు సంబంధం లేదన్నారు. పేలుడు జరిగిన సమయంలో తాము ఆ ప్రాంతంపై అసలు ఎలాంటి దాడులు చేయలేదని స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం 6.59 గంటల సమయంలో సమీపంలోని ఓ శ్మశాన వాటిక నుంచి పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్ అయిన ఇస్లామిక్ జిహాద్ సభ్యులు రాకెట్‌ను ప్రయోగించినట్లు తమ రాడార్ గుర్తించిందని తెలిపారు. ఈ రాకెట్ గురితప్పి, ఆసుపత్రి బయట పార్కింగ్ ప్రాంతంలో పేలిందని వెల్లడించారు. ఆసుపత్రిలో పేలుడు ఘటనను 'భయంకరమైన ఊచకోత'గా హమాస్ అభివర్ణించింది. ఈ దురాగతానికి ఇజ్రాయెల్ సైన్యమే కారణమని పేర్కొంది. ఈ మారణకాండకు బాధ్యత వహించకుండా ఇజ్రాయెల్ తప్పించుకోవాలని కుట్ర పన్నుతోందని ఆరోపించింది. అల్–అహ్లీ ఆసుపత్రిని ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ కొన్ని రోజుల క్రితమే ఆదేశించిందని గుర్తుచేసింది. ఆసుపత్రిలో పేలుడులో 500 మంది చనిపోయారని గాజా ఆరోగ్య శాఖ మంగళవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. బుధవారం ఆ సంఖ్యను 471గా సవరించింది.

బైడెన్‌తో సమావేశాలు రద్దు

గాజా ఆసుపత్రిలో పేలుడు ఘటనకు నిరసనగా జోర్డాన్ కఠిన నిర్ణయం తీసుకుంది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో జరగాల్సిన సమావేశాన్ని జోర్డాన్ రాజు అబ్దుల్లా–2 రద్దు చేసుకున్నారు. పాలస్తీనా నేత మొహమ్మద్ అబ్బాస్, ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్–సిసీ కూడా ఇదే బాటలో నడిచారు. బైడెన్‌తో తాము భేటీ కావడం లేదని తేల్చిచెప్పారు. దాంతో బైడెన్ తన పర్యటనను కేవలం ఇజ్రాయెల్‌కే పరిమితం చేసుకుంటున్నారు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం మధ్య ప్రాచ్యాన్ని ప్రమాదంలోకి నెడుతోందని జోర్డాన్ విదేశాంగ మంత్రి సఫాదీ చెప్పారు.

హమాస్ లావాదేవీలపై ఆంక్షలు

ఇజ్రాయెల్‌పై దాడికి దిగి, వెయ్యి మందికిపైగా జనాన్ని బలి తీసుకున్న మిలిటెంట్ సంస్థ హమాస్‌పై అగ్రరాజ్యం అమెరికా కఠిన చర్యలు ప్రారంభించింది. 10 మంది హమాస్ మిలిటెంట్ల బృందం ఆర్థిక లావాదేవీలపై ఆంక్షలు విధిస్తున్నట్లు బుధవారం అమెరికా ప్రకటించింది. అలాగే హమాస్ ఆర్థిక నెట్‌వర్క్‌పైనా ఆంక్షలు ఉంటాయని పేర్కొంది. గాజా, సూడాన్, తుర్కియే, అల్జీరియా, ఖతార్‌లో ఈ ఆంక్షలు అమలవుతాయని వెల్లడించింది. ఈ ఆంక్షల వల్ల విదేశాల నుంచి హమాస్‌కు నిధులు అందకుండా కట్టడి చేసినట్లు అవుతుందని అమెరికా ట్రెజరీ సెక్రెటరీ జానెట్ చెప్పారు. ఇరాన్ ప్రభుత్వం హమాస్ మిలిటెంట్లకు అండగా నిలుస్తూ, భారీ ఎత్తున ఆర్థిక సాయం అందిస్తోంది. అమెరికా ఆంక్షల కారణంగా ఇకపై నిధులు ఇవ్వడం సులభం కాదు. వివిధ దేశాల్లో హమాస్ సభ్యుల బ్యాంకు ఖాతాలు, ఆర్థిక లావాదేవీలపై అమెరికా ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ఆయా ఖాతాల్లోకి డబ్బులు ఎక్కడి నుంచి వస్తున్నాయి? అనేదానిపై దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

ఆ పేలుడుకు కారణం ఇజ్రాయెల్ కాదు: బైడెన్

గాజా హాస్పిటల్‌లో భీకర పేలుడుకు ఇజ్రాయెల్ ఎంతమాత్రం కారణం కాదని, 'మరో బృందం' ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు కనిపిస్తోందని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చెప్పారు. ఆయన బుధవారం ఇజ్రాయెల్‌లో టెల్ అవీవ్‌కు చేరుకున్నారు. ఎయిర్‌పోర్టులో బైడెన్‌కు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలు సమావేశమయ్యారు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం, తాజా పరిణామాలు, గాజా ప్రజలకు అందించాల్సిన మానవతా సాయంపై చర్చించుకున్నారు. అల్–అహ్లీ ఆసుపత్రిలో పేలుడు ఉదంతం ప్రస్తావనకు వచ్చింది. ఇస్లామిక్ జిహాద్ సభ్యులు ప్రయోగించిన రాకెట్ మిస్‌ఫైర్ కావడం వల్లే ఈ పేలుడు జరిగిందన్న ఇజ్రాయెల్ వాదనతో బైడెన్ ఏకీభవించారు. ఈ ఘటనలో పెద్ద సంఖ్యలో జనం ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్‌కు సంఘీభావంగా ఆయన ఇక్కడ పర్యటిస్తున్నారు. ఇజ్రాయెల్ ప్రజల ధైర్యసాహసాలు, అంకితభావం, శౌర్యాన్ని గౌరవిస్తూ ఇజ్రాయెల్‌లో పర్యటిస్తుండడాన్ని గర్వకారణంగా భావిస్తున్నానంటూ బైడెన్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఇజ్రాయెల్ ప్రజల దుఃఖాన్ని అమెరికన్లు సైతం పంచుకున్నారని చెప్పారు. ఇజ్రాయెల్–హమాస్ ఘర్షణ మరింత విస్తరించకూడదన్నదే తన ఉద్దేశమని తెలిపారు. ఈజిప్టు నుంచి మానవతా సాయాన్ని గాజాలోకి అనుమతించేందుకు ఇజ్రాయెల్ అంగీకరించిందని వివరించారు.



జో బైడెన్‌కు స్వాగతం పలుకుతున్న బెంజమిన్ నెతన్యాహూ

గాజా, వెస్ట్‌బ్యాంక్‌కు 100 మిలియన్ డాలర్ల సాయం: బైడెన్

టెల్ అవీవ్: గాజా, వెస్ట్‌బ్యాంక్‌కు 100 మిలియన్ డాలర్ల (రూ.832.87 కోట్లు) మానవతా సాయం అందిస్తామని అమెరికా అధ్యక్షుడు బైడెన్‌ప్రకటన బుధవారం ప్రకటించారు. గాజా ప్రజలకు ఇప్పుడు ఆహారం, నీరు, ఔషధాలు, వసతి చాలా అవసరమని అన్నారు. గాజాకు ఇతర దేశాల నుంచి మానవతా సాయం చేరడానికి అంగీకరించాలని ఇజ్రాయెల్ కేబినెట్‌ను కోరానని 'ఎక్స్'లో పోస్టు చేశారు. తాము అందించే 100 మిలియన్ డాలర్ల సాయం హమాస్‌కు, ఉగ్రవాద సంస్థలకు చేరకుండా జాగ్రత్తలు తీసుకుంటామని, బాధిత పాలస్తీనియన్లకు మాత్రమే అందేలా తగిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇజ్రాయెల్‌కు తమ మద్దతు ఉంటుందని బైడెన్ పునరుద్ఘాటించారు.

ఇజ్రాయెల్‌పై నిరసనల వెల్లువ



యెమెన్ రాజధాని సనాలో..



లెబనాన్ రాజధాని బీరుట్‌లో..



బీరుట్‌లో..



తుర్కియేలోని ఇస్తాంబుల్‌లో..



ట్యునీషియాలో..



ఇరాన్‌లోని టెహ్రాన్‌లో

జనాన్ని దోచుకుంటున్న అదానీ



పత్రికలో వచ్చిన కథనాన్ని చూపుతున్న రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ మీద కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ మరోసారి ఆరోపణలు ఎక్కుపెట్టారు. బొగ్గు దిగుమతులను విపరీతంగా పెంచి చూపడం ద్వారా ప్రజల నుంచి అదానీ గ్రూప్ ఏకంగా రూ.12 వేల కోట్లు దోచుకుందని బుధవారం ఆరోపించారు. ఈ మేరకు పలు మీడియా రిపోర్టులను విలేకరుల ముందు ప్రదర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ దీనిపై తక్షణం విచారణకు ఆదేశించి తన నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకోవాలని సవాల్ విసిరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో నెగ్గి కాంగ్రెస్ అధికారంలోకి ఈ ఉదంతంపై సమగ్ర విచారణకు ఆదేశిస్తుందని ప్రకటించారు. దీనిపై మోదీకి మౌనమెందుకని ప్రశ్నించారు. విచారణకు ఆదేశించి తన విశ్వసనీయతను నిరూపించుకోవచ్చు కదా అని నిలదీశారు. 'అదానీ ఇండొనేసియాలో కొనుగోలుచేసిన బొగ్గు ధర భారత్‌కు వచ్చేసరికి రెట్టింపు అవుతోంది! ఈ అడ్డగోలు పెంపు కారణంగా భారత్‌లో కరెంట్ చార్జీలు పెరిగాయి. వినియోగదారుల జేబుకు చిల్లు పడుతోంది. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలపై సబ్సిడీ భారం పెరిగింది' అని రాహుల్ ఆరోపించారు. ఇలాంటివి ఇంకే దేశంలో జరిగినా ప్రభుత్వాలే పడిపోయేవని ఆయన వ్యాఖ్యానించారు. కానీ మన దగ్గర ఇంత జరిగినా కనీస చర్యలు లేవని ఆరోపించారు. 'ఒకే ఒక్క వ్యక్తి చేస్తున్న ఈ దారుణ దోపిడీని ప్రధాని చూసీచూడనట్టు పోతున్నారు. ఆయనను పదేపదే కాపాడుతున్నారు' అని రాహుల్ మండిపడ్డారు.

గాంధీలది అవినీతి కుటుంబం: బీజేపీ

గాంధీల కుటుంబమే అవినీతిలో కూరుకుపోయిందని బీజేపీ విమర్శించింది. వారిపై అవినీతి కేసులున్నాయని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ అన్నారు. అదానీ అంశం సుప్రీంకోర్టులో ఉన్నా రాహుల్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారంటే ఆయనకు కోర్టు మీద గౌరవం లేదని స్పష్టమవుతోందన్నారు. 'రాహులే నేషనల్ హెరాల్డ్ కేసులో బెయిల్ మీద ఉన్నారు. వారిది ప్రపంచంలోకెల్లా అత్యంత అవినీతిమయమైన కుటుంబం' అంటూ మండిపడ్డారు.

ఏడు దేశాలకు బాస్మతీయేతర బియ్యం ఎగుమతులు

న్యూఢిల్లీ: బాస్మతీయేతర తెల్ల బియ్యాన్ని మరో ఏడు దేశాలకు ఎగుమతి చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతించింది. నేపాల్, మలేషియా, ఫిలిప్పైన్స్, సీషెల్స్, కామెరూన్, ఐవొరీ కోస్ట్, రిపబ్లిక్ ఆఫ్ గినియా దేశాలకు బాస్మతీయేతర బియ్యాన్ని వివిధ పరిమాణాల్లో ఎగుమతి చేయవచ్చని సూచించింది. నేషనల్ కో–ఆపరేటివ్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్, ది డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్‌ల ద్వారా మాత్రమే బియ్యం ఎగుమతులకు అనుమతిస్తూ ప్రభుత్వం బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏడు దేశాలకు 10,34,800 టన్నుల బాస్మతీయేతర తెల్ల బియ్యాన్ని ఎగుమతి చేయవచ్చని పేర్కొంది. నేపాల్‌కు 95,000 టన్నులు, కామెరూన్‌కు 1,90,000 టన్నులు, ఐవొరీ కోస్ట్‌కు 1,42,000, రిపబ్లిక్ ఆఫ్ గినియాకు 1,42,000, మలేషియాకు 1,70,000, ఫిలిప్పైన్స్‌కు 2,95,000 టన్నుల తెల్లబియ్యం ఎగుమతులకు అనుమతి మంజూరు చేసింది. యూఏఈ, సింగపూర్ దేశాలకు కూడా బాస్మతీయేతర తెల్లబియ్యం ఎగుమతికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

మళ్లీ అణు పరీక్షల బాటలో రష్యా!

మాస్కో: ఉక్రెయిన్‌తో యుద్ధం ఇప్పటికే దీర్ఘకాలిక పోరుగా మారిపోయిన నేపథ్యంలో ఆ దేశానికి పాశ్చాత్య దేశాల సాయానికి అడ్డుకట్ట వేసేందుకు అవసరమైతే అణు పరీక్షలు జరిపేందుకు రష్యా సిద్ధమవుతోందా? తాజా పరిణామాలను చూస్తుంటే అవుననే అనిపిస్తోంది. అంతర్జాతీయ సమగ్ర అణు పరీక్షల నిషేధ ఒప్పందానికి ఆమోదాన్ని వెనక్కు తీసుకునేందుకు ఉద్దేశించిన బిల్లుకు రష్యా పార్లమెంట్ డ్యూమా దిగువ సభ తుది ఆమోదం తెలిపింది. బుధవారం జరిగిన సమావేశంలో చట్ట సభ సభ్యులంతా ఏకగ్రీవంగా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇక ఆ బిల్లు వచ్చే వారం ఎగువ సభ అయిన ఫెడరేషన్ కౌన్సిల్ ముందుకు వెళ్లనుంది. 2000 నాటి ఈ ఒప్పందం నుంచి తప్పుకుంటామని పుతిన్ ఇటీవలే ప్రకటించడం తెల్సిందే. 1996లో తెరపైకి వచ్చిన ఈ ఒప్పందం ఏ దేశమూ ప్రపంచంలో ఎక్కడా అణు దాడులు చేయకూడదు. అయితే ఈ ఒప్పందం పూర్తిస్థాయిలో అమల్లోకి రాలేదు. రష్యా మాత్రమే దీనికి పూర్తి ఆమోదం తెలిపింది. అమెరికా, భారత్, పాకిస్థాన్, ఉ.కొరియా తదితర దేశాలేవీ దీనికి ఆమోదం తెలపలేదు. రష్యా వీలైనంత త్వరగా మళ్లీ అణు పరీక్షలకు దిగి సత్తా చాటాలని ఆ దేశ రాజకీయ వర్గాల నుంచి పుతిన్‌పై ఒత్తిడి పెరిగిపోతోంది.

జర్నలిస్టు సౌమ్య హత్య కేసులో నలుగురూ దోషులే

- తీర్పు వెలువరించిన ఢిల్లీ కోర్టు
- సహకరించిన ఐదో వ్యక్తినీ దోషిగా తేల్చిన కోర్టు

న్యూఢిల్లీ: ప్రముఖ టీవీ మహిళా పాత్రికేయురాలు సౌమ్యా విశ్వనాథన్ హత్య కేసు 15 ఏళ్ల తర్వాత ఓ కొలిక్కి వచ్చింది. ఈ సంచలనాత్మక కేసులో ఒక వ్యవస్థీకృత నేరగాళ్ల బృందానికి చెందిన నలుగురిని దోషులుగా తేలుస్తూ ఢిల్లీ కోర్టు తీర్పుచెప్పింది. ఈ మేరకు బుధవారం తీర్పు వెలువరించింది. 2008 సెప్టెంబర్ 30వ తేదీన దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన ఈ హత్య దేశమంతటా సంచలనం సృష్టించింది. ప్రముఖ ఇంగ్లిష్ వార్తా చానల్‌లో పని చేస్తున్న సౌమ్య 30వ తేదీన తెల్లవారుజామున ఆఫీస్ పని ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా నెల్సన్ మండేలా మార్గ్‌లో గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపారు. దారిదోపిడీ యత్నమే హత్యకు దారి తీసిందని పోలీసులు పేర్కొన్నారు. ఈ కేసులో రవి కపూర్, అమిత్ శుక్లా, బల్జీత్ మాలిక్, అజయ్ కుమార్‌లను హత్య, దోపిడీ అభియోగాల కింద దోషులుగా నిర్ధారిస్తూ అదనపు సెషన్స్ జడ్జి రవీంద్ర కుమార్ పాండే తీర్పు వెలువరించారు. దోచుకున్న సొత్తును తీసుకోవడంతో పాటు హంతకులకు సాయం చేసిన అభియోగాల్లో ఐదో నిందితుడు అజయ్‌సేఠీనీ కోర్టు దోషిగా నిర్ధారించింది. ఈ ఐదుగురు దోషులకు ఈనెల 26వ తేదీన శిక్షలు ఖరారు చేయనున్నారు. కిటకిటలాడిన కోర్టు గదిలో జడ్జి తీర్పు చదివి వినిపించారు. నిందితులంతా దోపిడీకి పాల్పడే ఉద్దేశంతోనే సౌమ్యను హత్య చేసినట్టు బలమైన ఆధారాలతో రుజువైందని జడ్జి తన తీర్పులో పేర్కొన్నారు. ఐపీసీ సెక్షన్లు 302, 34 కింద ఈ ఐదుగురినీ దోషులుగా ప్రకటించారు.

వీరికి జీవిత ఖైదు పడాలి: తల్లి

దోషులందరికీ జీవిత ఖైదు విధించాలని సౌమ్య తల్లి మాధవి డిమాండ్ చేశారు. తమ కుటుంబం అనుభవించిన క్షోభను వాళ్లూ అనుభవించి తీరాలన్నారు. తీర్పు అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. నిందితులంతా 2009 నుంచీ పోలీసు కస్టడీలోనే ఉన్నారు. జిగీశా ఘోష్ అనే ఐటీ ఉద్యోగి హత్యకు వాడిన ఆయుధాన్ని రికవర్ చేయడంతో సౌమ్య కేసును ఛేదించేందుకు మార్గం సుగమం అయిందని పోలీసులు వెల్లడించారు.

'ఎక్స్'లో పోస్ట్ పెట్టాలంటే డబ్బులు కట్టాలి

వాషింగ్టన్: మైక్రోబ్లాగింగ్ సైట్ 'ఎక్స్'(ట్విట్టర్) తన వినియోగదారులకు చేదువార్త చెప్పింది. 'నాట్ ఎ బాట్' అనే కొత్త సబ్‌స్క్రిప్షన్ ప్లాన్‌ను అమల్లోకి తీసుకొచ్చింది. దీనిప్రకారం.. 'ఎక్స్'లో కొత్త యూజర్లు పోస్టులు చేయాలన్నా, వేరొకరి ట్వీట్‌ను రీట్వీట్ చేయాలన్నా, రిప్లై ఇవ్వాలన్నా, లైక్ కొట్టాలన్నా, షేర్ చేయాలన్నా డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఈ సబ్‌స్క్రిప్షన్ ఫీజు కింద ఏడాదికి ఒక డాలర్ చొప్పున 'ఎక్స్' యాజమాన్యం వసూలు చేయనుంది.

కేంద్ర ప్రభుత్వోద్యోగులకు 4 శాతం డీఏ

- రైల్వే ఉద్యోగులకు 78 రోజుల బోనస్
- గోధుమ మద్దతు ధర రూ.150 పెంపు
- చక్కెర ఎగుమతులపై నిషేధం పొడిగింపు
- కేంద్ర కేబినెట్ నిర్ణయాలు

న్యూఢిల్లీ: పండుగ సీజన్‌లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు తీపి కబురు. ఉద్యోగులకు డీఏ, పెన్షనర్లకు డీఆర్‌ను 4 శాతం పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీంతో ఉద్యోగులకు డీఏ వారి మూల వేతనంలో 46 శాతానికి చేరింది. అలాగే నాన్ గెజిటెడ్ రైల్వే ఉద్యోగులకు 78 రోజుల వేతనాన్ని బోనస్‌గా ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ మేరకు పలు నిర్ణయాలు తీసుకున్నారు. కేబినెట్ నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ తర్వాత మీడియా సమావేశంలో వెల్లడించారు. డీఏ, డీఆర్ పెంపుతో 48.67 లక్షల మంది కేంద్ర ప్రభుత్వోద్యోగులు, 67.95 లక్షల మంది పెన్షనర్లు లబ్ధి పొందుతారని ఆయన తెలిపారు. వీటితో ఖజానాపై రూ.2,857 కోట్ల భారం పడనుంది. డీఏ పెంపు 2023 జూలై 1 నుంచి వర్తిస్తుంది. గత మార్చి, 2022 సెప్టెంబర్‌లో డీఏ, డీఆర్ 4 శాతం మేరకు పెరిగాయి. ఇక బోనస్ పెంపుతో లోకో పైలట్లు, గార్డులు, స్టేషన్ మాస్టర్లు, సూపర్‌వైజర్లు, టెక్నీషియన్లు, పాయింట్స్ మెన్, ఇతర గ్రూప్– సి సిబ్బంది సహా 11.07 లక్షల మంది రైల్వే ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు. దీని ద్వారా రైల్వేలపై రూ.1,969 కోట్ల ఆర్థిక భారం పడనుందని ఠాకూర్ తెలిపారు. మరోవైపు చక్కెర ఎగుమతులపై నిషేధాన్ని అక్టోబర్ నెలాఖరును దాటి నిరవధికంగా కేంద్రం పొడిగించింది. భారత్ ప్రపంచంలో అతి పెద్ద చక్కెర తయారీదారు. రెండో అతి పెద్ద ఎగుమతిదారు. 2024–25 రబీ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి గోధుమలకు మద్దతు ధరను మరో రూ.150 మేర పెంచుతూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం క్వింటాల్‌కు మద్దతు ధర రూ.2,125గా ఉంది. దీన్ని రూ.2,275కు పెంచినట్లుగా కేంద్రం ప్రకటించింది. కేంద్రంలో మోదీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ స్థాయిలో మద్దతు ధరను పెంచడం ఇదే తొలిసారి. ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో గోధుమలు సహా బార్లీ, ఎర్రపప్పు, శనగలు, కుసుమ, ఆవాల మద్దతు ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఎర్ర పప్పు (మసూర్) ధర రూ.425 మేర పెంచడంతో క్వింటాల్ ధర రూ.6,425కి చేరింది. ఆవాలకు కనీస మద్దతు ధరను రూ.200 పెంచడంతో అది రూ.5,650కి చేరుకుంది. కుసుమలు క్వింటాల్ రూ.5,650గా ఉండగా, రూ.150 చొప్పున పెంచడంతో రూ.5,800లకు చేరింది. బార్లీ మద్దతు ధరను రూ.115 మేర పెంచడంతో ధర 1,735 నుంచి రూ.1,850కి చేరింది. శనగల కనీస మద్దతు ధరను రూ.150 మేర పెంచారు. దీని ధర క్వింటాల్‌కు రూ.5,335 నుంచి రూ.5,440కి చేరింది.

మరింత సహకారం

- పుతిన్, జిన్‌పింగ్ నిర్ణయం
- ద్వైపాక్షిక అంశాలపై చర్చలు



జిన్‌పింగ్‌తో సమావేశమైన రష్యా అధినేత పుతిన్

తైపే: విదేశీ విధానంతో పాటు పలు అంశాల్లో మధ్య మరింత సమన్వయంతో ముందుకెళ్లాలని, అన్ని విషయాల్లోనూ పరస్పరం సహకరించుకోవాలని చైనా, రష్యా నిర్ణయించాయి. చైనా ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ (బీఆర్ఐ) ప్రాజెక్టు పదో వార్షికోత్సవంలో పాల్గొనేందుకు చైనాకు విచ్చేసిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ బుధవారం ఉదయం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. బీఆర్ఐలో భాగంగా ఆసియా, మధ్యప్రాచ్యంతో పాటు పలు ఇతర చోట్ల ఎన్నో దేశాల్లో చైనా భారీ నౌకాశ్రయాలు, జాతీయరహదారులు, విద్యుత్కేంద్రాల వంటివి నిర్మిస్తోంది. దీంతో శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాలు చైనాకు భారీగా రుణపడిపోయాయి. తద్వారా ఆయా దేశాలలో తన పట్టు పెంచుకోవడమే ఈ ప్రాజెక్టు వెనుక చైనా అసలు ఉద్దేశమని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు కొన్నేళ్లుగా హెచ్చరిస్తూనే ఉన్నారు. మరోవైపు రియల్ ఎస్టేట్ రంగంలో మితిమీరిన పెట్టుబడులు తదితరాల కారణంగా చైనా ఆర్థిక వ్యవస్థ సైతం నేలచూపులు చూస్తోంది. ఈ కఠిన పరిస్థితుల్లో ఇరు దేశాల విదేశీ విధానంలో మరింత సన్నిహిత సమన్వయం అవసరమని పుతిన్ ద్వైపాక్షిక భేటీ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ద్వైపాక్షిక వర్తకం తిరిగి పట్టాలకెక్కిందని, ఈ ఏడాది రికార్డు స్థాయిలో ఏకంగా 200 బిలియన్ డాలర్లను దాటనుందని పుతిన్ వివరించారు. అతి గోప్యమైన పలు అంశాలు చర్చకు వచ్చినట్లు పుతిన్ తెలిపారు. చర్చలు చాలా ఫలప్రదంగా జరిగాయన్నారు. బీఆర్ఎఫ్ ఫోరం భేటీకి పుతిన్ రావడం వరుసగా ఇది మూడో సారని పింగ్ అన్నారు. తన సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు రష్యా చేసే అన్ని ప్రయత్నాలకూ చైనా మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. రష్యా చమురు, గ్యాస్ ఉత్పత్తులకు చైనా ప్రధాన వినియోగదారు అన్నది తెలిసిందే. తద్వారా ఉక్రెయిన్ యుద్ధంతో చితికిపోతున్న రష్యా ఆర్థిక వ్యవస్థకు చైనా ఊపిరులూదుతోంది. ముఖ్యంగా అమెరికా, పాశ్చాత్య దేశాల వరుస కఠిన ఆంక్షల నేపథ్యంలో రష్యాను చైనా ఎంతగానో ఆదుకుంటోంది. ప్రతిగా చైనా విదేశీ విధానాలన్నింటికీ రష్యా కొంతకాలంగా మద్దతిస్తూ వస్తోంది. స్వయంపాలిత తైవాన్‌పై అనుసరిస్తున్న అణచివేత విధానాలకు వత్తాసు పలుకుతోంది. ఈ నేపథ్యంలో విదేశీ విధానాల్లో బంధాన్ని మరింత దృఢం చేసుకుంటామంటూ పుతిన్, జిన్‌పింగ్ చేసిన ప్రకటన ఆందోళన పెంచేదేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆజం ఖాన్‌కు ఏడేళ్ల జైలు

- భార్య, కుమారునికి కూడా
- తప్పుడు బర్త్ సర్టిఫికేట్ కేసులో శిక్ష

రాంపూర్(యూపీ): తప్పుడు బర్త్ సర్టిఫికేట్ల కేసులో సమాజ్‌వాదీ పార్టీ నేత ఆజం ఖాన్ తో పాటు ఆయన భార్య తజీన్ ఫాతిమా, కుమారుడు అబ్దుల్లా ఆజమ్‌లకు ఏడేళ్ల జైలు శిక్ష పడింది. ఎంపీ, ఎమ్మెల్యే ప్రత్యేక కోర్టు జడ్జి శోభిత్ బన్సల్ బుధవారం ఈ మేరకు తీర్పు వెలువరించారు. ఆ వెంటనే కోర్టు గదిలోనే ముగ్గురినీ పోలీసులు జ్యుడీషియల్ కస్టడీకి తీసుకున్నారు. తర్వాత రాంపూర్ జిల్లా జైలుకు తరలించారు. అబ్దుల్లాకు రెండు బర్త్ సర్టిఫికేట్లు ఉన్నాయంటూ బీజేపీ ఎమ్మెల్యే ఆకాశ్ సక్సేనా 2019లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తప్పుడు సర్టిఫికేట్ పొందేందుకు తల్లిదండ్రులిద్దరూ అతనికి సాయం చేశారని పేర్కొన్నారు. వారు ముగ్గురు ఐపీసీ సెక్షన్లు 420, 467, 468, 471, 472, 120బి కింద శిక్షార్హులని జడ్జీ పేర్కొన్నారు. జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.50 వేల జరిమానా విధించారు. 2017లో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి అబ్దుల్లాకు వయసు చాలకపోవడంతో దాన్ని ఎక్కువ చేసి చూపుతూ లక్నో నుంచి తప్పుడు బర్త్ సర్టిఫికెట్ తీసుకున్నారని సక్సేనా తెలిపారు. ఆ ఎన్నికల్లో అబ్దుల్లా ఎమ్మెల్యేగా గెలిచారు. 2022 ఎన్నికల్లోనూ ఆయన మళ్లీ నెగ్గారు. ప్రభుత్వోద్యోగిపై చేయి చేసుకున్న కేసులో గత ఫిబ్రవరిలో మొరాదాబాద్ కోర్టు ఆయనకు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. దాంతో అబ్దుల్లా శాసన సభ్యత్వం రద్దయింది. విద్వేష ప్రసంగాల కేసులో మూడేళ్ల జైలు శిక్ష పడటంతో 2019లో ఆజాం ఖాన్ శాసన సభ్యత్వం రద్దవడం తెలిసిందే. ఆయన రికార్డు స్థాయిలో ఏకంగా 10సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. లోక్‌సభ, రాజ్యసభ సభ్యునిగా చేశారు.

నరసాపురం జైన్ జ్యుయల్ పార్క్‌లో కస్టమ్స్ సోదాలు

- భారీగా బంగారం, సొమ్ము దొరికినట్టు సమాచారం

నరసాపురం: పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో కోర్టు ఎదురుగా ఉన్న జైన్ జ్యుయల్‌పార్క్ జ్యుయలరీ షాపుపై బుధవారం కస్టమ్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు షాపు తెరవకముందే పట్టణానికి చేరుకున్న కస్టమ్స్ అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో షాపు, షాపు యజమాని రాజ్ జైన్ నివాసంలో సోదాలు చేశారు. రాత్రి 10 గంటల వరకు సోదాలు కొనసాగుతూనే ఉన్నాయి. దాడులు, సోదాల్లో కస్టమ్స్ డ్యూటీ చెల్లించకుండా భారీగా దిగుమతి చేసుకున్న బంగారం నిల్వలను అధికారులు గుర్తించినట్టు సమాచారం. అలాగే భారీగా హవాలా సొమ్ము దొరికినట్టు తెలిసింది. ఉభయగోదావరి జిల్లాల్లోనే నరసాపురంలో హోల్‌సేల్, రిటైల్ బంగారం వ్యాపారం పెద్ద ఎత్తున సాగుతుంది. కాగా, గత ఎన్నికల సమయంలో తెలంగాణ, కర్ణాటకకు నరసాపురం నుంచి చేరిన హవాలా సొమ్ము భారీగా పట్టుబడింది. ప్రస్తుతం తెలంగాణతో సహా 5 రాష్ట్రాలకు ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వడం, హవాలా సొమ్ములు దొరుకుతుండడంతో స్థానికంగా కస్టమ్స్ అధికారుల దాడులు చర్చనీయాంశమయ్యాయి.

మహాలక్ష్మీదేవిగా దుర్గమ్మ అభయం

- ఇంద్రకీలాద్రిపై వైభవంగా దసరా ఉత్సవాలు
- మూలా నక్షత్రానికి ప్రత్యేక ఏర్పాట్లు
- రేపు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించనున్న సీఎం జగన్



సాక్షి ప్రతినిధి, విజయవాడ/ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దసరా వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. కనకదుర్గమ్మ బుధవారం మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం నగరోత్సవం కనులపండుగగా సాగింది. కనకదుర్గానగర్‌లో కళావేదికపై ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కనకదుర్గమ్మ జన్మనక్షత్రమైన ఈ నెల 20వ తేదీ, శుక్రవారం కలిసి రావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉంది. అమ్మవారు సరస్వతీదేవి రూపంలో భక్తులను అనుగ్రహించనున్నారు. ఆ రోజు తెల్లవారుజామున రెండు గంటల నుంచే భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు. రాత్రి 12 గంటల వరకు దర్శనం కొనసాగనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం 3.00 నుంచి 3.15 గంటల మధ్య అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఇప్పటికే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అమ్మవారి దర్శనానికి రెండు లక్షల మంది వస్తారని అంచనా. శుక్రవారం నాటికి ఐదు లక్షల లడ్డూలను సిద్ధం చేస్తున్నారు. మూలా నక్షత్రం రోజు వృద్ధులు, దివ్యాంగులకు ఉదయం 5 గంటల నుంచి 6 గంటల వరకు ప్రత్యేక స్లాట్, అలాగే వీఐపీలు, ప్రోటోకాల్ భక్తులకు ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు టైం స్లాట్ కేటాయించారు.కాగా, ఇంద్రకీలాద్రిపై నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలలో గురువారం అమ్మవారు శ్రీమహాచండీదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు.

కల్పవృక్షం, సర్వభూపాల వాహనాలపై మలయప్ప



సర్వభూపాల వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

తిరుమల: తిరుమలేశుని నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. బుధవారం ఉదయం శ్రీమలయప్ప కల్పవృక్ష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి సర్వభూపాల వాహనంలో స్వామివారు భక్తులను కటాక్షించారు. వేయి నేతి దీపాల వెలుగులో ఉత్సవమూర్తులు ఊయలపై ఊగుతూ భక్తులకు కనులవిందు చేశారు. కాగా, బ్రహ్మోత్సవాల్లో విశిష్టమైన గరుడ వాహన సేవ గురువారం రాత్రి 6.30 గంటలకు ప్రారంభించి అర్ధ రాత్రి 2 గంటల వరకు నిర్వహించనున్నారు. రెండున్నర లక్షల మందికిపైగా భక్తులు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని టీటీడీ అధికారులు భావిస్తున్నారు. ఇందు కోసం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. శ్రీవారి గరుడ వాహన సేవ కోసం సర్వం సిద్ధం చేశామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ధర్మారెడ్డి తెలిపారు. కాగా, దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కొల్హాపూర్ శ్రీమహాలక్ష్మీదేవి అమ్మవారికి బుధవారం టీటీడీ తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. టీటీడీ ముంబయి స్థానిక సలహామండలి అధ్యక్షుడు రాజేష్ కుమార్ శర్మ, బోర్డు సభ్యుడు మిలింద్ కేశవ్ నర్వేకర్, తిరుమల శ్రీవారి ఆలయ పారుపత్తేదార్ తులసీప్రసాద్ పాల్గొన్నారు.

దసరా పండుగకు ప్రత్యేక రైళ్లు



రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని విజయవాడ మీదుగా ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ప్రకటించారు. నాందేడ్-కాకినాడ టౌన్ (07061) రైలు ఈ నెల 20న సాయంత్రం 4.30 గంటలకు నాందేడ్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 7.45 గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. హైదరాబాద్-కటక్ (07165) రైలు ఈ నెల 24న రాత్రి 8.10 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి, మరుసటి రోజు సాయంత్రం 5.45 గంటలకు కటక్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07166) ఈ నెల 25న రాత్రి 10.30 గంటలకు కటక్‌లో బయలుదేరి, మరుసటి రోజు రాత్రి 9 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది.

20న అల్పపీడనం!

- మధ్య బంగాళాఖాతంలో ఏర్పడే అవకాశం
- 23 నుంచి రాష్ట్రంలో వర్షాలకు ఆస్కారం
- ఆపై ఈశాన్య రుతుపవనాల రాకకు అనుకూలం



సాక్షి, విశాఖపట్నం: అండమాన్ సముద్రానికి ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది సముద్రమట్టానికి 4.5 కి.మీ.ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. ఈ ఉపరితల ఆవర్తనం వాయవ్య దిశగా కదులుతూ ఈనెల 20 నాటికి బంగాళాఖాతం మధ్య ప్రాంతాల్లో అల్పపీడనంగా బలపడుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) బుధవారం నివేదికలో వెల్లడించింది. మరోవైపు రాష్ట్రంపైకి ఈశాన్య గాలులు వీస్తున్నాయి. రానున్న మూడు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఒకట్రెండు చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు లేదా జల్లులు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఈనెల 23 నుంచి రాష్ట్రంలోని కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసేందుకు ఆస్కారం ఉందని పేర్కొంది. కాగా నైరుతి రుతుపవనాల ఉపసంహరణ రేఖ మచిలీపట్నం, కర్నూలు మీదుగా పయనిస్తున్నది. మరో నాలుగైదు రోజుల్లో నైరుతి రుతుపవనాలు రాష్ట్రం నుంచి పూర్తిగా నిష్క్రమించే పరిస్థితులున్నాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. సాధారణంగా నైరుతి రుతుపవనాలు పూర్తిగా ఉపసంహరించుకున్న వెనువెంటనే ఈశాన్య రుతుపవనాలు ప్రవేశిస్తాయి. ఇందుకు బంగాళాఖాతంలో అల్పపీడనం లేదా ఉపరితల ఆవర్తనం వంటివి ఏర్పడితే మరింత అనుకూలతకు దోహదం చేస్తుంది. ఈ నేపథ్యంలో ఈనెల 20న బంగాళాఖాతం మధ్య ప్రాంతాల్లో ఏర్పడనున్న అల్పపీడనం కారణంగా ఈశాన్య రుతుపవనాల ఆగమనానికి పరిస్థితులు అనుకూలంగా మారనున్నాయని చెబుతున్నారు. అనంతరం రాష్ట్రంలో వర్షాలు ఊపందుకుంటాయని వీరు పేర్కొంటున్నారు.

ఏఐతో రాజమార్గాల్లా.. జాతీయ రహదారులు

- ప్రమాదాల నివారణకు కొత్త టెక్నాలజీ
- 'వైడ్స్' విధానంలో 14 రకాల వీడియో చిత్రీకరణ
- ప్రతి 10 కి.మీ.కు కెమెరాల ఏర్పాటు
- 100 కి.మీ.కు ఓ కమాండ్ కంట్రోల్ సెంటర్
- రాజ్‌మార్గ్ యాప్‌తో కమాండ్ కంట్రోల్ సెంటర్ అనుసంధానం
- ఎన్‌హెచ్‌ఏఐ ప్రణాళిక



సాక్షి, అమరావతి: జాతీయ రహదారులపై ప్రమాదాలకు అధునాతన టెక్నాలజీతో చెక్ పెట్టేందుకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) సిద్ధమవుతోంది. అందుకోసం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) పరిజ్ఞానంతో 'అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సిస్టం(ఏటీఎస్)' విధానాన్ని రూపొందించింది. ఇప్పుడున్న సీసీ కెమెరాలతో ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారంగా పూర్తిస్థాయిలో డిజిటల్ పరిజ్ఞాన పర్యవేక్షణ విధానాన్ని ప్రవేశపెట్టాలని ఎన్‌హెచ్‌ఏఐ నిర్ణయించింది. వచ్చే ఏడాది నుంచి దశలవారీగా కొత్త టెక్నాలజీని అమలు చేయనుంది.

సరికొత్తగా పర్యవేక్షణ..

ప్రస్తుతం జాతీయ రహదారులపై ఉన్న కెమెరాల స్థానంలో సరికొత్త 'వీడియో ఇన్సిడెంట్ డిటెక్షన్-ఎన్‌ఫోర్స్‌మెంట్ సిస్టం(వైడ్స్)' టెక్నాలజీ కెమెరాలను ఏర్పాటు చేస్తారు. వైడ్స్‌తో రూపొందించిన ఈ కెమెరాలతో 14 రకాలుగా వాహనాలను పర్యవేక్షించడానికి సాధ్యపడుతుంది. వాహనాల వేగం అంచనాతో పాటు ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకపోవడం, నిర్దేశిత లైన్‌ను ఉల్లంఘించి ప్రయాణించడం, రాంగ్‌రూట్‌లో ప్రయాణం, జాతీయ రహదారులపై పశువుల సంచారం, పాదచారులు రోడ్డు దాటేందుకు ఏర్పాటు చేసిన క్రాసింగ్ లైన్స్, అంబులెన్స్‌ల రాక సహా 14 రకాల సంఘటనలను రికార్డ్ చేస్తుంది. ఈ సమాచారంతో వెంటనే జాతీయ రహదారులపై విధులు నిర్వహించే పాట్రోలింగ్ అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేయవచ్చు.

ప్రతి 10 కి.మీ.కు కెమెరాలు..

జాతీయ రహదారులపై ప్రతి 10 కి.మీ.కు ఓ చోట ఈ వైడ్స్ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ నిర్ణయించింది. ఇక ప్రతి 100 కి.మీ.కు ఓ మినీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను నెలకొల్పుతారు. జాతీయ రహదారుల వెంబడి వేయనున్న ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్‌ను సద్వినియోగం చేసుకుని ఈ సెంటర్లు పని చేస్తాయి. ఈ సెంటర్ల పరిధిలోని ప్రాంతంలోని కెమెరాల డాటాను అక్కడ విశ్లేషిస్తారు. వైడ్స్ కెమెరాల ద్వారా వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్లను ఆటోమేటిగ్గా గుర్తించే వ్యవస్థను అందుబాటులోకి తెస్తారు. ఇక ప్రమాదాలను గుర్తించడం, రహదారులపై నిలిచిపోయిన వాహనాలను గుర్తించి తగిన చర్యలు తీసుకునేలా సిబ్బందిని అప్రమత్తం చేస్తారు. ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఆ ప్రాంతంలోని పోలీసు స్టేషన్లతో పాటు ఆయా రాష్ట్రాల విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయాలతో అనుసంధానిస్తారు. సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి కనీసం ఒకరు ఆ కమాండ్‌కంట్రోల్ సెంటర్లలో అందుబాటులో ఉంటారు.

'రాజ్‌మార్గ్ యాత్ర' యాప్‌తో అనుసంధానం

జాతీయ రహదారులపై ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ఉద్దేశించిన 'రాజ్‌మార్గ్ మొబైల్ యాప్'తో ఈ వైడ్స్ కెమెరాల డేటాను అనుసంధానిస్తారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనాలకు ఆటోమేటిగ్గా ఈ-చలానాలు జారీ చేస్తుంది. ఆ సమాచారాన్ని రాజ్‌మార్గ్ మొబైల్ యాప్ ద్వారా వెంటనే వాహన చోదకులకు చేరవేస్తుంది. దాంతోపాటు జాతీయ రహదారులపై ఎదురుగా ఉన్న సైన్‌బోర్డులు, ట్రాఫిక్ జామ్, ఇతర ప్రమాదకర పరిస్థితుల గురించి అప్రమత్తం చేస్తూ సందేశాలను పంపుతుంది. వాహన చోదకులు ఏదైనా అత్యవసర సహాయాన్ని అర్థించేందుకు ఆ యాప్ ద్వారా ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను సంప్రదించవచ్చు.

ఆడబిడ్డకు అన్యాయంపై రాజకీయం చేస్తున్న కన్నా!

బాధితురాలు గొలమాల జ్యోతి కంటతడి



మాట్లాడుతున్న బాధితురాలు గొలమాల జ్యోతి


సత్తెనపల్లి: ఆడబిడ్డకు అన్యాయం జరిగితే అండగా నిలవాల్సింది పోయి, నిందితులకే నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కన్నా లక్ష్మీనారాయణ కొమ్ముకాస్తున్నాడని సత్తెనపల్లి మండలం, ధూళిపాళ్ల ఎస్సీ కాలనీకి చెందిన బాధితురాలు గొలమాల జ్యోతి ఆవేదన వ్యక్తం చేసింది. పల్నాడు జిల్లా, సత్తెనపల్లిలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో స్థానిక దళిత నాయకులతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. తన గ్రామానికి చెందిన గొలమాల ప్రభుదాసు ఈనెల 15న అర్ధరాత్రి తనపై అఘాయిత్యం చేయబోగా ప్రతిఘటించానని, ఈనెల 16న సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని గొలమాల జ్యోతి తెలిపారు. పోలీసుల విచారణ అనంతరం నిందితుడు ప్రభుదాసుపై కేసు నమోదు చేశారన్నారు. అయితే మాజీ మంత్రి కన్నా నిందితుడిని వెనకేసుకొస్తున్నారని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు మాట్లాడుతూ ఈ విషయంలో మంత్రి అంబటికి ఎలాంటి సంబంధం లేకపోయినా కన్నా లక్ష్మీనారాయణ, మాలమహానాడు నాయకులు గోళ్ల అరుణ్‌కుమార్ ఆయనపై చౌకబారు విమర్శలు చేయడం సరికాదన్నారు. పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలక జైపాల్ మాట్లాడుతూ రాజకీయ లబ్ధికోసం నిందితులకు కొమ్ము కాస్తూ, దళిత ఆడబిడ్డకు అన్యాయం చేస్తావా... అంటూ కన్నా తీరుపై మండిపడ్డారు. దళిత సంఘ నాయకుడు జూపల్లి పాల్, కట్టమూరు, కంకణాలపల్లి సర్పంచ్‌లు దార్ల సంధ్య, చెరుకూరు వన్నూరు, నందిగం ఎంపీటీసీ అక్కేశ్వరరావు, గుడిపూడి మాజీ సర్పంచ్ గుంటూరు నతానియేలు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ నాయకులు కాటుమాల డేవిడ్, జంగాల సంపత్‌కుమార్, పైర్ల సుబ్బారావు, బిల్ల రవి పాల్గొన్నారు.

నలుగురు మావోయిస్టులు అరెస్టు

ఎటపాక (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఎటపాక మండలం గొల్లగుప్ప అటవీ ప్రాంతంలో మావోయిస్టు పార్టీకి చెందిన నలుగురు సభ్యులను అరెస్ట్ చేశారు. ఓఎస్డీ కేవీ మహేశ్వరరెడ్డి బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా అర్లంపల్లి గ్రామానికి చెందిన సోడి మంగి 2018లో మావోయిస్టు పార్టీలో చేరి ఎల్‌వోయస్ సభ్యురాలుగా పనిచేస్తోంది. గొల్లపల్లి పీఎస్ పరిధిలోని బండారుచిలకకు చెందిన మడకం లింగ, కుంట పీఎస్ పరిధిలో మైతాకు చెందిన మడకం రామయ్య, కురసం భీమయ్య మావోయిస్టు సభ్యులుగా పనిచేస్తున్నారు. 2021 మార్చిలో సుకుమా జిల్లా చింతగుప్ప పీఎస్ పరిధిలో జర్మెట్టా గ్రామంలో జరిగిన అంబుష్ దాడిలో 17మంది, జీరాగూడలో జరిగిన అంబుష్ దాడిలో 22 మంది సీఆర్పీఎఫ్ కమాండోలు మరణించిన ఘటనల్లో సోడి మంగి పాల్గొంది. ఎటపాక మండలం చెరువుగుంపు గ్రామానికి చెందిన మడివి రాజ్‌కుమార్‌ను కిడ్నాప్ చేసి హత్య చేసిన ఘటనతోపాటు చింతూరు మండలం సరివెల గ్రామం వద్ద బస్సును దగ్ధం చేసిన ఘటనలోనూ ఆమె పాల్గొంది. 2023 జనవరిలో చింతూరు మండలం బుర్కనకోట గ్రామానికి చెందిన సోయం సుబ్బయ్యను పోలీసు ఇన్‌ఫార్మర్ అనే అనుమానంతో చంపిన ఘటనలో కూడా ఆమె పాల్గొంది.

18 నుంచి సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర


- విజయవాడ నుంచి ప్రత్యేకంగా 'భారత్ గౌరవ్ టూరిస్టు రైలు'
- జ్యోతిర్లింగ దర్శనం, స్టాట్యూ ఆఫ్ యూనిటీ సందర్శన
- 13 రోజుల పాటు యాత్ర



సాక్షి, అమరావతి: భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ విజయవాడ నుంచి 'భారత్ గౌరవ్ టూరిస్టు రైలు' పేరుతో సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర నిర్వహిస్తోంది. వచ్చే నెల 18వ తేదీ నుంచి 30 వరకు జ్యోతిర్లింగ దర్శనంతో పాటు స్టాట్యూ ఆఫ్ యూనిటీని సందర్శించేలా ప్యాకేజీ రూపొందించింది. బుధవారం మీడియాతో ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ వీవై ప్రసాద్ మాట్లాడారు. విజయవాడలో బయలుదేరే ఈ ప్రత్యేక రైలులో ఖమ్మం, కాజీపేట్, సికింద్రాబాద్‌లో ప్రయాణికులు ఎక్కేందుకు హాల్టు ఇచ్చామన్నారు. 13 రోజుల యాత్రలో ఉజ్జయిని (మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్), స్టాట్యూ ఆఫ్ యూనిటీ, ద్వారకా (నాగేశ్వర్), సోమనాథ్, పూణే (భీమశంకర్), నాసిక్ (త్రయంబకేశ్వర్), ఔరంగాబాద్ (గ్రిష్ణేశ్వర్) ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శించనున్నట్టు తెలిపారు. స్లీపర్ క్లాస్ శ్రేణికి రూ.21వేలు, 3ఏసీ శ్రేణికి రూ.32,500, 2ఏసీ శ్రేణికి రూ.42,500 టికెట్ రేట్లు నిర్ణయించామన్నారు. ఆయా శ్రేణుల వారీగా నాన్ ఏసీ, ఏసీ బస, రవాణా సౌకర్యాలతో పాటు శాకాహారం భోజన సదుపాయాలను కల్పిస్తున్నట్టు వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎల్టీసీ వినియోగించుకోవచ్చని సూచించారు. టికెట్లు బుక్ చేసుకునేందుకు www.irctctourism.com వెబ్‌సైట్ సందర్శించాలని పేర్కొన్నారు.

వచ్చే నెల 2న విజయవాడలో బుడగ జంగాల 'కృతజ్ఞత' సభ


- తమ కులంపై సీఎం జగన్ విప్లవాత్మక నిర్ణయంపై హర్షం
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేడ(బుడగ) జంగం హక్కుల పోరాట సమితి



సాక్షి, అమరావతి : వచ్చే నెల 2న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేడ (బుడగ) జంగం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేసేందుకు విజయవాడలో కృతజ్ఞత సభ నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేడ(బుడగ) జంగం హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఎలమర్తి మధు తెలిపారు. తాడేపల్లిలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కులం లేని సామాజికవర్గం అంటూ ఏదైనా ఉందంటే అది బేడ, బుడగ జంగమలేనని, సంచార జాతులుగా ముద్రపడిన తమకు ఏ కేటగిరి కింద కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారనేది కొరుకుడు పడని ప్రశ్నగా ఉందన్నారు. బుడగ జంగాలను షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చే దిశగా సీఎం వైఎస్ జగన్ సారథ్యంలోని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని, దీనికి గల సాధ్యాసాధ్యాల పరిశీలనకు ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జేసీ శర్మకు ఈ కమిషన్ బాధ్యతలను అప్పగించిందన్నారు. అసెంబ్లీలో అలానే బేడ(బుడగ) జంగం కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చి.. తీర్మానాన్ని కేంద్రానికి పంపినందుకు గాను సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపేందుకు సభ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉదయం 11 గంటలకు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ సభ జరుగుతుందని వివరించారు. సభకు సీఎం జగన్ ప్రతినిధిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి హాజరవుతారని, సభలో రాష్ట్ర మంత్రులు, వైఎస్సార్‌సీపీ అన్ని అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొంటారని తెలిపారు.

సీఎం జగన్ హయాంలోనే రాజధాని అభివృద్ధి

1,116వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే రాజధాని ప్రాంతంలో అభివృద్ధి జరిగిందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,116వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో బుధవారం పలువురు మాట్లాడారు. అసంపూర్తిగా ఉన్న సీడ్ యాక్సిస్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయడంతో పాటు, గొల్లపూడి-చినకాకాని వరకు 17 కిలోమీటర్ల ఫ్లైఓవర్ నిర్మాణం దాదాపు పూర్తయిందన్నారు. చంద్రబాబు వదిలేసిన తాత్కాలిక హైకోర్టు నిర్మాణం పక్కన సీఎం జగన్ మరో భవన నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. అలాగే విజయవాడలో కనకదుర్గమ్మ వంతెనపై ఫ్లైఓవర్, బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్‌ను శరవేగంగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కాదా అని ప్రశ్నించారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు పేదలకు చేసిన మేలు ఏమీ లేదని, తమ కులవాదులకు దోచిపెట్టేందుకు స్కాములు చేసి రూ. లక్షల కోట్లు వెనకేసుకున్నారని మండిపడ్డారు. 29 గ్రామాల్లో ప్రశాంతంగా ఉన్న వాతావరణాన్ని కలుషితం చేసిన చంద్రబాబు తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. నాయకులు ఈపూరి ఆదాం, మాదిగాని గురునాథం, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష



జగనన్న ఆరోగ్య సురక్ష	14 వ రోజు
నిర్వహించిన మొత్తం శిబిరాలు	9,536
వైద్య సేవలు పొందిన ప్రజలు	38,17,416
నిర్వహించిన వైద్య పరీక్షలు	6,03,03,664
మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు రెఫర్ చేసినవారి సంఖ్య	65,425



అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలంలోని మూరేవాండ్లపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్యపరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు



విశాఖలోని 87వ వార్డు కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో రక్తపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



తిరుపతి జీవకోనలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవల కోసం వేచి ఉన్న స్థానికులు



తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యసేవలందుకుని మందుల కిట్ తీసుకుని ట్రై సైకిలుపై వెళుతున్న వృద్ధురాలికి సహాయపడుతున్న వైద్య, ఆరోగ్యశాఖ సహాయకుడు



కర్నూలు జిల్లా సి.బెళగల్ మండలంలోని సంగాల గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష వైద్య శిబిరంలో వృద్ధుడికి చికిత్స చేస్తున్న డాక్టర్ మిధున్‌రెడ్డి



గుంటూరు జిల్లా నగరం కొప్పరావుకాలనీలో మహిళకు బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది



శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అనంతపురం గ్రామంలో స్థానికులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది



ప్రకాశం జిల్లా హనుమంతునిపాడు మండలం లింగంగుంట్లలో ఓపీలు రాయించుకుంటున్న ప్రజలు



ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



విజయనగరం జిల్లా బాడంగి మండలం కోడూరులో ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది

పేదల కళ్లల్లో కాంతులు

వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా పేదలు, విద్యార్థులకు మూడు విడతల సేవలు

- జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలోనూ ఉచిత కంటి స్క్రీనింగ్
- 5.62 లక్షల మందిలో కంటి సమస్యల గుర్తింపు
- 1.57 లక్షల మందికి మందులు అందజేత
- 3.12 లక్షల మందికి అద్దాలు సూచించిన వైద్యులు
- 48 వేల మందికి కాటరాక్ట్ సర్జరీలు అవసరమని నిర్ధారణ
- తదుపరి వైద్యం, సర్జరీలు అవసరమైన వారు ఆస్పత్రులకు తరలింపు



శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం గొర్రిబంద సచివాలయం ఆవరణలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రతాప్

నంద్యాల జిల్లా కొలిమిగుంట్ల మండలం బెలుం గ్రామానికి చెందిన బాలసంటి వయసు 90 ఏళ్లు పైనే. చూపు మందగించడంతో గతంలో కంటి పరీక్ష చేయించుకుని అద్దాలు కొనుక్కున్నాడు. మళ్లీ కొన్నాళ్లుగా కళ్లు సరిగా కనిపించక ఇబ్బంది పడుతున్నాడు. ఇటీవల గ్రామంలోనే ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి వెళ్లాడు. వైద్యులకు తన సమస్య వివరించాడు. కంటి పరీక్షలు చేసిన వైద్యులు ఆయనకు చికిత్స అందించారు. ఇప్పుడు బాలసంటి ఉల్లాసంగా ఉన్నాడు.

బాలసంటిలానే కంటి సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రుల వరకూ వెళ్లలేని వారికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఓ వరంగా మారింది. ఈ కార్యక్రమంలో తాము ఉంటున్న ఊరిలోనే కంటితో పాటు, ఇతర వైద్య సేవలు అందుబాటులోకి రావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలన్నది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష. ఇందుకోసం వైద్య రంగంలో పలు సంస్కరణలు ప్రవేశపెట్టారు. వైద్యాన్ని ప్రజల చెంతకు తీసుకెళ్తున్నారు. గ్రామాల్లోనే వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులను అత్యాధునికంగా తీర్చి దిద్దుతున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రజల్లో కంటి సమస్యలతో బాధపడుతున్నవారి కోసం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టారు. మూడు విడతల్లో కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు ఇచ్చారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయించారు. ఇంకా ఎవరైనా మిగిలిపోయి ఉంటే వారికి ఇప్పుడు నిర్వహిస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాల్లో కంటి పరీక్షలు చేస్తున్నారు. గత నెల 30వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరాల్లో మంగళవారం వరకు 35 లక్షల మందికిపైగా వైద్య సేవలు పొందారు. వీరిలో 5,26,045 మంది వివిధ రకాల కంటి సమస్యలతో బాధపడుతున్నట్టు వైద్యులు గుర్తించారు. వీరిలో 1,57,614 మందికి మందులతో నయమయ్యే సమస్యలేనని తేల్చారు. వారందరికీ అవసరమైన మందులు ఇచ్చారు. మరో 3,12,478 మందికి కళ్లద్దాలను సూచించారు. వీరందరికీ కళ్లద్దాలను వైద్య శాఖ అందిస్తోంది. 55,953 మందిని తదుపరి వైద్యం కోసం ఆస్పత్రులకు పంపించారు. 48,507మందికి కాటరాక్ట్ శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. తదుపరి వైద్యం, కాటరాక్ట్ సర్జరీలు అవసరమున్న వారిని స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్,సీహెచ్‌వో, ఏఎన్ఎంలకు మ్యాప్ చేశారు. వీరందరికీ వైద్యం అందిస్తున్నారు. వీరంతా కంటి సమస్యలు తొలగి పూర్తిస్థాయి చూపుతో తిరిగి ఇళ్లకు చేరుకోనున్నారు.

ప్రైవేటు వైద్యుల సేవలు కూడా...

రాష్ట్ర వ్యాప్తంగా రోజుకు 800 ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నాం. ఈ క్రమంలో పెద్ద ఎత్తున కంటి వైద్యులు అవసరం. మన రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులతో పాటు తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా వైద్యులను పిలిపించాం. కంటి సమస్యల బాధితులకు అవసరమైన మందులను శిబిరాల్లోనే అందిస్తున్నాం. అద్దాలు అవసరమైన వారికి స్థానిక విక్రేతల ద్వారా అందజేస్తున్నాం. క్యాటరాక్టర్ సర్జరీలు అవసరమున్న వారిని ప్రభుత్వ, ప్రైవేటు, ఎన్‌జీవో ఆస్పత్రులకు తరలించి ఉచితంగా సర్జరీలు చేయిస్తున్నాం.

– డాక్టర్ వెంకటేశ్వర్, డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్

హృద్రోగి ప్రాణం నిలిపిన ఆరోగ్య సురక్ష



గుండెపోటుతో బాధపడుతున్న బాబూరావుకు చికిత్స అందిస్తున్న వైద్య బృందం

తుని రూరల్: తీవ్ర గుండెనొప్పితో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి వచ్చిన రోగికి స్పెషలిస్ట్ డాక్టర్లు అత్యవసర వైద్యసేవలు అందించి ప్రాణాలు కాపాడారు. కాకినాడ జిల్లా తుని మండలం చేపూరులో తేటగుంట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.అన్వేషి పర్యవేక్షణలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన కుంచె బాబూరావు ఛాతిలో తీవ్రమైన నొప్పితో అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి తీసుకువచ్చారు. స్పెషలిస్ట్ డాక్టర్లు సౌమ్య, రమణ ఈసీజీ తీసి బాబూరావుకు గుండె పోటు వచ్చినట్లు గుర్తించి అత్యవసర, ఆధునిక వైద్యసేవలు అందించి ప్రాణాలు కాపాడారు. వైద్యుల పర్యవేక్షణలో 108 అంబులెన్సులో తుని ఏరియా ఆస్పత్రికి బాబూరావును తరలించినట్లు డాక్టర్ అన్వేషి తెలిపారు. ఫిట్స్‌తో బాధపడుతున్న కె.వరలక్ష్మి అనే మహిళ ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోవడంతో ఆమెకు అత్యవసర వైద్య సేవలు అందించి మెరుగైన చికిత్స కోసం తుని ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు.

క్లుప్తంగా...

ఐఆర్ఆర్ కేసు విచారణ 7కి వాయిదా

సాక్షి, అమరావతి: ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్) అలైన్‌మెంట్‌లో అక్రమాలు, క్విడ్ ప్రోకోపై సీఐడీ నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దాఖలు చేసిన వ్యాజ్యంలో విచారణను హైకోర్టు నవంబర్ 7వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పీటీ వారెంట్ విషయంలో ముందుకెళ్లొద్దని ఏసీబీ కోర్టుకు స్పష్టం చేస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించారు. అంతకు ముందు చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు అరెస్టుకు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ ప్రకారం గవర్నర్ అనుమతి తప్పనిసరంటూ తాము దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్ చేసిందని హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పు ప్రభావం ఈ కేసుపై కూడా ఉంటుందన్నారు. అందువల్ల దసరా సెలవుల తరువాత విచారణ చేపట్టాలని కోరారు. సీఐడీ తరఫున హాజరైన ఏజీ ఎస్.శ్రీరామ్ కూడా వాయిదాకు అభ్యంతరం లేదన్నారు. దీంతో విచారణను నవంబర్ 7కి వాయిదా వేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

లాయర్ల ములాఖత్‌లలో కోత దారుణం

- టీడీపీ నేతలు కళా వెంకట్రావు, కొల్లు రవీంద్ర
- బాబుతో భువనేశ్వరి, లోకేశ్, బ్రాహ్మణి ములాఖత్

సాక్షి, రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో జ్యుడీషియల్ రిమాండ్ అనుభవిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని టీడీపీ నేతలు కళా వెంకట్రావు, కొల్లు రవీంద్ర చెప్పారు. జైల్లో చంద్రబాబుతో ఆయన భార్య భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, కోడలు బ్రాహ్మణి బుధవారం సాయంత్రం ములాఖత్ అయ్యారు. వారు 40 నిమిషాల పాటు బాబుతో వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం లోకేశ్ మీడియా ముందుకు రాకుండా రాజమండ్రిలోని క్యాంప్ కార్యాలయానికి వెళ్లిపోయారు. టీడీపీ నేతలు కళా వెంకట్రావు, కొల్లు రవీంద్ర సెంట్రల్ జైలు వద్ద మీడియాతో మాట్లాడారు. జైల్లో చంద్రబాబుకు ప్రభుత్వ వైద్యులు చేస్తున్న వైద్యం, అందజేస్తున్న మందులతో ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. బాబు హెల్త్ బులిటెన్, ఆరోగ్య సమాచారం, వైద్య పరీక్షల రిపోర్టులు కుటుంబ సభ్యులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పుడే బాబుకు పాత మందులే ఇవ్వాలా? లేక వాటిని మార్పు చేయాలా? అన్న విషయంలో స్పష్టత వస్తుందన్నారు. లాయర్ల ములాఖత్‌లలో కోత విధించడం దారుణమన్నారు.

నేటితో ముగియనున్న రిమాండ్ గడువు

ఏసీబీ కోర్టు బాబుకు విధించిన రిమాండ్ గడువు గురువారంతో పూర్తి కానుంది. ఈ మేరకు చంద్రబాబును వర్చువల్ విధానంలో కోర్టు ముందు హాజరుపర్చనున్నారు. ఈ మేరకు జైలు అధికారులు ఏర్పాట్లు చేసినట్టు తెలిసింది.


గవర్నర్‌ని కలిసిన టీడీపీ నేతలు

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ నేతలు అచ్చెన్నాయుడు, యనమల రామకృష్ణుడు, వర్ల రామయ్య, గద్దె రామ్మోహన్ తదితరులు బుధవారం గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిశారు. చంద్రబాబుపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చేస్తోందని, తమ పార్టీ నేతలపైనా కేసులు పెడుతున్నారని ఫిర్యాదు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి రాష్ట్ర అభివృద్ధిని వదిలేసి కేవలం తమ పార్టీ నేతలపై దౌర్జన్యం చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని, దీనిపై కేంద్రానికి నివేదిక పంపాలని ఆయన్ను కోరినట్లు టీడీపీ నేతలు తెలిపారు.

సెల్‌ఫోన్లలో 'ఆరోగ్యశ్రీ'

యాప్ ద్వారా వైద్య పరీక్షలు, చికిత్స సమాచారం

- మెడికల్ రిపోర్టుల డౌన్‌లోడ్‌కూ వెసులుబాటు
- ఆరోగ్యశ్రీ కార్డుదారుల ఫోన్లలో యాప్ ఉండేలా ప్రభుత్వం చర్యలు
- ఒక్క రోజులోనే 1.81 లక్షల మందితో డౌన్‌లోడ్ చేయించిన వలంటీర్లు
- ఇప్పటివరకు 6.83 లక్షల మంది ఫోన్లలో యాప్ నిక్షిప్తం



సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డుదారుల సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఓ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. తాము చేయించుకున్న చికిత్సలు, వైద్య పరీక్షల వివరాలను లబ్ధిదారులు 'వైఎస్సార్ ఆరోగ్యశ్రీ' యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. భవిష్యత్‌లో ఎప్పుడైనా మెడికల్ రిపోర్టులు అవసరమైతే ఈ యాప్ నుంచే డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అలాగే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సంబంధించిన పూర్తి సమాచారం కూడా తెలుసుకోవచ్చు. కార్డుదారులకు అవసరమైన చికిత్సలు ఏఏ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్నాయో తెలియజేసే వివరాలన్నీ ఈ యాప్‌లో ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు చేపట్టిన మొదటి విడత ఇంటింటి సర్వే సమయంలోనే.. ఈ యాప్‌ను ఆరోగ్యశ్రీ కార్డుదారులు తమ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామ, వార్డు వలంటీర్లు తమకు కేటాయించిన క్లస్టర్ల పరిధిలోని లబ్ధిదారుల ఫోన్లలో దీనిని డౌన్‌లోడ్ చేయించి.. దాని ద్వారా కలిగే ప్రయోజనాల గురించి వివరిస్తున్నారు. ఆరోగ్యశ్రీ కార్డు నంబర్ లేదా సంబంధిత కుటుంబసభ్యుని ఆధార్ నంబర్‌ను యాప్‌లో నమోదు చేస్తే.. ఆ కుటుంబానికి సంబంధించిన ఆరోగ్యశ్రీ వివరాలన్నీ అందులో ప్రత్యక్షమవుతాయి. వారంతా ఈ పథకం ద్వారా పొందిన చికిత్సల వివరాలను తెలుసుకోవచ్చు. చికిత్స సమయంలో జరిగిన వైద్య పరీక్షల రిపోర్టులు కూడా అందుబాటులో ఉంటాయి. ఎప్పుడైనా ఆ వైద్య పరీక్షల రిపోర్టులు అవసరమైతే ఈ యాప్ నుంచే డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చికిత్స అందించినందుకు సంబంధిత ఆస్పత్రికి ప్రభుత్వం ఎంత మొత్తం చెల్లించిందన్న వివరాలను కూడా వారు ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చని అధికారులు వివరించారు.

నెల్లూరు జిల్లాలో అత్యధికం..

వలంటీర్ల ద్వారా ఆరోగ్యశ్రీ కార్డుదారుల మొబైల్‌ఫోన్లలో యాప్ డౌన్‌లోడ్‌కు సంబంధించిన కార్యక్రమం నవంబర్ 29 వరకు కొనసాగనుంది. దీనికి సంబంధించిన పురోగతిని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ అధికారులు ప్రతి రోజూ పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటివరకు 6,83,635 మంది ఆరోగ్యశ్రీ కార్డుదారులు ఈ యాప్‌ను తమ ఫోన్లలో నిక్షిప్తం చేసుకున్నారు. బుధవారం ఒక్క రోజే 1,81,507 మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. అత్యధికంగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో లక్ష మందికి పైగా, ఏలూరు జిల్లాలో 99,427 మంది, కాకినాడ జిల్లాలో 85,166 మంది డౌన్‌లోడ్ చేసుకున్నారని అధికారులు చెప్పారు.

రామోజీ, శైలజా కిరణ్‌పై చర్యలన్నీ 8 వారాలు నిలిపివేత

మార్గదర్శి షేర్ల అక్రమ బదలాయింపు వ్యవహారంలో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

- వారిద్దరిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని సీఐడీకి ఆదేశం
- తదుపరి విచారణ డిసెంబర్ 6కి వాయిదా



సాక్షి, అమరావతి : మార్గదర్శి సహ వ్యవస్థాపకుడు గాదిరెడ్డి జగన్నాథ రెడ్డి (జీజే రెడ్డి) షేర్లను అక్రమంగా బదలాయించిన వ్యవహారంపై నమోదైన కేసులో నిందితులైన ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు, మార్గదర్శి ఎండీ అయిన ఆయన కోడలు శైలజా కిరణ్‌పై తదుపరి చర్యలన్నింటినీ 8 వారాలు నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వారిద్దరిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని సీఐడీని ఆదేశించింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీని ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 6వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐడీకి ఒక్క రోజే గడువిచ్చిన న్యాయస్థానం

తన తండ్రి జీజే రెడ్డికి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో ఉన్న వాటాల కోసం వెళితే రామోజీరావు తనను తుపాకీతో బెదిరించి, తమ వాటాలను శైలజా కిరణ్ పేరిట అక్రమంగా బదలాయించారంటూ యూరి రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐడీ ఈ నెల 13న కేసు నమోదు చేసింది. ఈ కేసును కొట్టేయాలంటూ ఈ నెల 16న రామోజీ, శైలజా కిరణ్ హైకోర్టులో క్వాష్ పిటిషన్లు దాఖలు చేశారు. సాధారణంగా క్వాష్ పిటిషన్లలో ఆ కేసు పూర్తి వివరాలను తెలుసుకొని, కోర్టు ముందుంచేందుకు పోలీసులకు న్యాయమూర్తులు వారం, మూడు రోజులు ఇలా కొంత గడువు ఇస్తారు. రామోజీరావు, శైలజా కిరణ్ వ్యాజ్యాలు న్యాయమూర్తి జస్టిస్ చక్రవర్తి ముందుకు మంగళవారం విచారణకు వచ్చాయి. పూర్తి వివరాలు కోర్టు ముందుంచేందుకు రెండు రోజులు గడువివ్వాలన్న సీఐడీ స్పెషల్ పీపీ వై.శివకల్పనారెడ్డి వినతిని న్యాయమూర్తి తోసిపుచ్చారు. ఒక్క రోజే గడువిచ్చి, విచారణను బుధవారానికి వాయిదా వేశారు. బుధవారం రామోజీ తరఫున సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా, శైలజా కిరణ్ తరఫున మరో సీనియర్ న్యాయవాది నాగముత్తు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వాదనలు వినిపించారు. షేర్లు కొన్నందుకు యూరి రెడ్డికి చెక్కు రూపంలో చెల్లించామని, వాటాలను బదలాయిస్తూ ఆయన సంతకాలు కూడా చేశారని తెలిపారు. ఆ తర్వాత ఆయన రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌కి ఫిర్యాదు చేశారన్నారు. ఫిర్యాదు అక్కడ పెండింగ్‌లో ఉండగా, ఇప్పుడు సీఐడీకి ఫిర్యాదు చేశారని తెలిపారు.

మార్గదర్శి అక్రమాలపై దర్యాప్తు చేస్తున్నాం కాబట్టే సీఐడీకి ఫిర్యాదు చేశారు

సీఐడీ తరఫున వై.శివకల్పనా రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో అత్యంత కీలకమైన ఎస్‌హెచ్–4 ఫారంను వ్యాజ్యాలతో జత చేయలేదని, దీనిని కోర్టు తప్పక పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. మార్గదర్శి అక్రమాలపై ఏపీ సీఐడీ విచారణ జరుపుతోందన్న విషయం తెలిసి ఫిర్యాదుదారు తమకు ఫిర్యాదు చేశారని వివరించారు. మార్గదర్శికి ఏపీలో కూడా శాఖలున్నాయన్నారు. వాటాల బదిలీ డాక్యుమెంట్లపై ముద్రించిన స్టాంపు ఎక్కడిదో పరిశీలించాల్సి ఉందన్నారు. అందువల్ల ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వొద్దని కోరారు. దర్యాప్తునకు సంబంధించిన కేసుల్లో యాంత్రికంగా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వకూడదని సుప్రీంకోర్టు చెప్పిందంటూ ఆ కేసు గురించి శివకల్పన ప్రస్తావించారు. అన్ని కేసులూ తనకు తెలుసునని న్యాయమూర్తి జస్టిస్ చక్రవర్తి అన్నారు. రామోజీ, శైలజా కిరణ్‌పై తదుపరి చర్యలన్నీ 8 వారాలు నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

తెలంగాణ

తెలంగాణలో బీజేపీకి జనసేన మద్దతు!

పవన్‌కళ్యాణ్‌తో కిషన్‌రెడ్డి, కె.లక్ష్మణ్ చర్చలు

సాక్షి, హైదరాబాద్: జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ను కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ కలిశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి జనసేన మద్దతివ్వడం, లేదా ఇరుపార్టీలు ఉమ్మడిగా పోటీ చేసే అవకాశాలపై బుధవారం పవన్ కార్యాలయంలో వారు చర్చలు జరిపారు. 'ఉమ్మడిగా పోటీచేసే విషయంలో ఒకటి, రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశముందని పవన్ కళ్యాణ్ వెల్లడించారు. 2014 ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ అభ్యర్థులకు మద్దతిచ్చాం. బీజేపీ అగ్రనేతల విజ్ఞప్తి మేరకు జీహెచ్ఎంసీ ఎన్నికల నుంచి విరమించుకుని ఆ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేసిన విషయాన్ని పవన్ గుర్తుచేశారు. కనీసం 30 స్థానాల్లో జనసేన పోటీచేయకపోతే కార్యకర్తల స్థైర్యం దెబ్బతింటుందన్న తమ పార్టీ నాయకుల అభిప్రాయాన్ని పవన్ వారికి తెలియజేశారు.' అని పవన్ కళ్యాణ్ రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

వెనక్కి తగ్గొద్దు: పవన్‌కు రాష్ట్ర జనసేన విజ్ఞప్తి

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో జనసేన పోటీ చేయాల్సిందేనని పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు ఆ పార్టీ రాష్ట్ర నాయకులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం రాత్రి జనసేన నాయకులతో పవన్ సమావేశమై ఇక్కడ ఎన్నికల సన్నద్ధతతో పాటు పోటీ చేయదలచుకున్న అభ్యర్థుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మిత్రపక్షమైన బీజేపీ విజ్ఞప్తి మేరకు హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికలలో పోటీ నుంచి విరమించుకున్నామని, ఈసారి తప్పనిసరిగా పోటీచేయాల్సిందేనని పలువురు కోరినట్టు సమాచారం. ఈ దఫా పోటీ చేయకపోతే తెలంగాణలో పార్టీ ఎదుగుదలను అడ్డుకున్నట్లేనని అభిప్రాయపడ్డారు.

బ్లాక్ మార్కెటింగ్ నిరోధానికి ఏం చేస్తున్నారు!

తెలియజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: యానాంలో వినియోగించడానికి, విక్రయించడానికి ఉద్దేశించిన పెట్రోలియం ఉత్పత్తులను ఆంధ్రప్రదేశ్‌లో బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్నారంటూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. బ్లాక్ మార్కెటింగ్‌ను అడ్డుకునేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ రాజమండ్రికి చెందిన నాగ రమేష్ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తులు జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ తెల్లాప్రగడ మల్లికార్జునరావు ఇటీవల ధర్మాసనం విచారణ జరిపింది. బ్లాక్ మార్కెటింగ్ నిరోధానికి ఏం చర్యలు తీసుకుంటున్నారో వివరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని స్పష్టం చేస్తూ.. తదుపరి విచారణను అక్టోబర్ 31కి వాయిదా వేసింది.

బస్సు దహనం కేసులో బెయిల్ పిటిషన్ ఉపసంహరణ

సాక్షి, న్యూఢిల్లీ: చిలకలూరిపేట బస్సు దహనం కేసులో నిందితుడు సాతులూరి చలపతిరావు సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్ ఉపసంహరించుకున్నారు. బెయిల్ మంజూరు చేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ రాజేశ్ బిందాల్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. న్యాయపరమైన అంశాలు ఏమైనా ఉంటే హైకోర్టులో తేల్చుకోవాలని ధర్మాసనం సూచించింది. నిందితుడు పిటిషన్ ఉపసంహరించుకోవడంతో విచారణ ముగిస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

సీఐడీ విచారణకు సహకరించాలి

ఆదిరెడ్డి అప్పారావుకు సుప్రీంకోర్టు సూచన

సాక్షి, న్యూఢిల్లీ: జగజ్జనని చిట్ ఫండ్ వ్యవహారంలో ఏపీ సీఐడీ విచారణకు సహకరించాలని ఆదిరెడ్డి అప్పారావు, శ్రీనివాస్‌లకు సుప్రీంకోర్టు సూచించింది. హైకోర్టు బెయిల్ మంజూరును సవాల్ చేస్తూ ఏపీ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ రాజేశ్ బిందాల్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఏపీ సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఏప్రిల్ 30న అప్పారావు, శ్రీనివాస్‌లను అరెస్టు చేయగా మే 10న హైకోర్టు బెయిలు మంజూరు చేసిందన్నారు. వారిద్దరూ విచారణకు సహకరించడం లేదని తెలిపారు. స్పందించిన ధర్మాసనం ఇరువురూ విచారణకు సహకరించేలా చూడాలని ఆదిరెడ్డి అప్పారావు తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రాను ఉద్దేశించి వ్యాఖ్యానించింది. విచారణకు సహకరిస్తారని లూథ్రా ధర్మాసనానికి హామీ ఇవ్వడంతో ఈ దశలో ఈ దశలో హైకోర్టు ఆదేశాల్లో జోక్యం చేసుకోబోమని ధర్మాసనం విచారణ ముగించింది.

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులుగా తాజాగా 2,526 గ్రామ సచివాలయాలు

- పంచాయతీ కార్యదర్శులకు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ అధికారాలు
- రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో విడతల వారీగా రిజిస్ట్రేషన్ సౌకర్యం



సాక్షి, అమరావతి: గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ విధానాన్ని ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం, అన్ని గ్రామాల్లో శరవేగంగా విస్తరించేందుకు చర్యలు తీసుకుంటోంది. తాజాగా 2,526 గ్రామాల్లో రిజిస్ట్రేషన్లు చేసేందుకు అనుమతులు మంజూరు చేసింది. రీ సర్వే పూర్తయి, ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సిల్ నంబర్) వచ్చిన గ్రామాల్లో ఈ సేవలు అందుబాటులోకి తెచ్చింది.

దశలవారీగా విస్తరణ

తొలిసారి 51 గ్రామాల్లో ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని ప్రారంభించి, రెండోదశలో 1500 గ్రామ సచివాలయాల్లో ఈ సేవలు అందుబాటులోకి తీసుకురాగా, ఇప్పుడు మళ్లీ 2,526 గ్రామ సచివాలయాల్లో ఈ సేవలు ప్రారంభించనున్నది. ఇందుకోసం సచివాలయాలను సబ్ డిస్ట్రిక్టులుగా నోటిఫై చేసి, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుగా ప్రభుత్వం ప్రకటించింది.

బాధ్యతలు ఎవరికంటే...


అక్కడ పనిచేసే కార్యదర్శులకు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ హోదా అధికారం కల్పించారు. డిజిటల్ అసిస్టెంట్లు రిజిస్ట్రేషన్ వ్యవహారాల్లో కార్యదర్శులకు సహకరించే అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇందుకోసం సీఎస్ జవహర్ రెడ్డి మూడు వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేశారు.

త్వరలో మరో రెండువేల గ్రామాల్లో...

ఇప్పటివరకు గ్రామ సచివాలయాల్లో 4 వేలకుపైగా రిజిస్ట్రేషన్లు చేశారు. ఇందుకోసం సచివాలయాల కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు రిజిస్ట్రేషన్ వ్యవహారాలపై శిక్షణ ఇచ్చారు. గ్రామ సచివాలయాలతోపాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. భూముల రీ సర్వే తొలి దశలో 2 వేల గ్రామాలు, రెండో దశలో మరో 2 వేల గ్రామాల్లో పూర్తవడంతో ఆ గ్రామాల్లో రిజిస్ట్రేషన్ సేవల్ని అందుబాటులోకి తెచ్చింది. త్వరలో మరో 2 వేల గ్రామాల్లో సర్వే పూర్తయ్యే అవకాశాలుండడంతో అక్కడ కూడా రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభంకానున్నాయి.

ఆస్తుల రిజిస్ట్రేషన్ ఇక ఈజీ

ఆయా గ్రామాల ప్రజలు ఇకపై ఆస్తుల రిజిస్ట్రేషన్లను తమ సచివాలయాల్లోనే సులభంగా చేసుకోవచ్చు. తాజాగా అనుమతించిన గ్రామాలతో కలిపి మొత్తం 4,077 గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం అనుమతించినట్లయింది. అలాగే ముఖ్యమైన రిజిస్ట్రేషన్లు, ఈసీలు పొందడం వంటి పనుల్ని ఈ కార్యాలయాల్లోనే చేసుకోవచ్చు.



చిన్నబోయిన కృష్ణమ్మ!

వర్షాభావంతో నాలుగు రాష్ట్రాల్లో నీటికి కటకట

- 2,130 టీఎంసీల లభ్యత ఉంటుందని బచావత్ ట్రిబ్యునల్ అంచనా
- వర్షాభావంతో ఈ ఏడాది ఇప్పటివరకు 882 టీఎంసీలే లభ్యత
- శ్రీశైలానికి ఈ ఏడాది ఇప్పటివరకు వచ్చిన ప్రవాహం 120 టీఎంసీలే
- 2019–20 నుంచి 2022–23 వరకు నాలుగేళ్లలో రికార్డు స్థాయిలో నీటి లభ్యత

సాక్షి, అమరావతి: నిండా నీటితో పరుగులు తీసే కృష్ణమ్మ ఈ ఏడాది చిన్నబోయింది. కృష్ణా నది పరీవాహక ప్రాంతాల్లో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధాన పాయతోపాటు కృష్ణా ఉపనదులైన కోయినా, ఘటప్రభ, మలప్రభ, తుంగభద్ర, వేదవతి, భీమాలలోనూ వరద ప్రవాహం కనిష్ట స్థాయికి చేరింది. బేసిన్‌లో బచావత్ ట్రిబ్యునల్ అంచనా వేసిన నికర జలాల లభ్యతలో ఈ ఏడాది సగం కూడా లభించడం లేదు. నీటి లభ్యత కనిష్ట స్థాయికి చేరుకోవడంతో కృష్ణా బేసిన్‌లోని మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఏపీలో నీటికి కటకట ఏర్పడింది. సాగునీటికే కాదు తాగునీటికీ ఇబ్బందులు నెలకొన్నాయి. మహారాష్ట్రలోని పశ్చిమ కనుమల్లో మహాబలేశ్వర్ పర్వత శ్రేణుల్లో పురుడు పోసుకునే కృష్ణమ్మ మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఏపీ మీదుగా 1,400 కి.మీ. పొడవున ప్రవహించి కృష్ణా జిల్లా హంసలదీవి వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది.

పదేళ్లలో శ్రీశైలం ప్రాజెక్టులోకి వచ్చిన ప్రవాహాలు ఇలా..

సంవత్సరం	ప్రవాహం (టీఎంసీల్లో)
2014-15	614.05
2015-16	58.69
2016-17	337.95
2017-18	423.93
2018-19	541.39
2019-20	1,673.66
2020-21	1,511.07
2021-22	1,087.92
2022-23	1,821.13
2023-24	120.00
	(మంగళవారం వరకూ)

శ్రీశైలం ప్రాజెక్ట్ చరిత్రలో రెండో కనిష్ట ప్రవాహం

కృష్ణా నదిలో ఏటా సగటున 75 శాతం లభ్యత (నికర జలాల) ఆధారంగా 2,130 టీఎంసీల లభ్యత ఉంటుందని బచావత్ ట్రిబ్యునల్ అంచనా వేసింది. అందులో మహారాష్ట్రకు 585, కర్ణాటకకు 734, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టీఎంసీల (ఆంధ్రప్రదేశ్‌కు 512, తెలంగాణకు 299) చొప్పున కేటాయించింది. కానీ.. ఈ ఏడాది కృష్ణా బేసిన్‌లో వర్షాభావ పరిస్థితుల వల్ల ప్రధాన పాయతోపాటు ఉప నదుల్లో వరద ప్రవాహం పెద్దగా రాలేదు. దాంతో నీటి లభ్యత కనిష్ట స్థాయికి చేరుకుంది. మహారాష్ట్రలో కృష్ణా ప్రధాన పాయ, కోయినా, దూద్‌గంగ, భీమా వంటి ఉప నదుల ద్వారా ఇప్పటివరకు ఆ రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లోకి 298 టీఎంసీల ప్రవాహం వచ్చింది. కర్ణాటకలో కృష్ణా ప్రధాన పాయతోపాటు ఘటప్రభ, మలప్రభ, వేదవతి, తుంగభద్ర ద్వారా ప్రాజెక్టుల్లోకి 427 టీఎంసీల ప్రవాహం వచ్చింది. బేసిన్‌లో దిగువన గల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టుల్లోకి కృష్ణా ప్రధాన పాయతోపాటు మూసీ, పాలేరు, మున్నేరు వంటి ఉప నదుల ద్వారా ఇప్పటివరకు కేవలం 157 టీఎంసీల లభ్యత మాత్రమే ఉంది. శ్రీశైలంలోకి 120 టీఎంసీల ప్రవాహం మాత్రమే వచ్చింది. ఇది ఆ ప్రాజెక్టు చరిత్రలో రెండో కనిష్ట ప్రవాహం కావడం గమనార్హం. 2015–16లో శ్రీశైలం ప్రాజెక్టులోకి వచ్చిన 58.69 టీఎంసీలే ఆ ప్రాజెక్టు చరిత్రలో కనిష్ట ప్రవాహం. కృష్ణా బేసిన్‌లో 2019–20 నుంచి 2022–23 వరకూ నాలుగేళ్లు సమృద్ధిగా వర్షాలు కురవడంతో బచావత్ ట్రిబ్యునల్ అంచనా వేసిన దానికంటే అధికంగా జలాలు లభించాయి. ఈ ఏడాది నీటి లభ్యత కనిష్ట స్థాయికి చేరుకోవడంతో బేసిన్‌లో కరువు పరిస్థితులు నెలకొన్నాయి.

నవంబర్ 15లోగా అభిప్రాయం చెప్పండి

- కృష్ణా జలాల పంపిణీకి కొత్త విధి విధానాలపై ఏపీకి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఆదేశం
- విచారణ నవంబర్ 22, 23కు వాయిదా

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు కృష్ణా నది జలాల పంపిణీ కోసం కేంద్ర జల్ శక్తి శాఖ ఈనెల 6న జారీ చేసిన కొత్త విధి విధానాలపై నవంబర్ 15లోగా అభిప్రాయం చెప్పాలని ఏపీ ప్రభుత్వాన్ని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ–2) ఆదేశించింది. ఆలోగా అభిప్రాయాన్ని చెబుతూ అఫిడవిట్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేసే బాధ్యతను విభజన చట్టంలో సెక్షన్–89 ద్వారా కేంద్రం బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు అప్పగించింది. ట్రిబ్యునల్ 2016 నుంచి నీటి పంపిణీపై విచారణ జరుపుతోంది. కేంద్రం ట్రిబ్యునల్ గడువును ఎప్పటికప్పుడు పొడిగిస్తోంది. కేంద్ర మంత్రివర్గం ఈనెల 4న కృష్ణా జలాల పంపిణీకి కొత్త విధి విధానాలను జారీ చేసింది. ఈమేరకు కేంద్ర జల్ శక్తి శాఖ జారీ చేసిన ఉత్తర్వులపై విచారణ చేపట్టవద్దని, వాటిపై అధ్యయనానికి సమయం ఇవ్వాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌లో ఇంటర్ లొకేటరీ అప్లికేషన్ (ఐఏ) దాఖలు చేసింది. బుధవారం ఢిల్లీలో జస్టిస్ బ్రిజేష్‌కుమార్ అధ్యక్షతన జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ ఎస్.తాళపత్ర సభ్యులుగా ఉన్న కేడబ్ల్యూడీటీ–2 ఏపీ ప్రభుత్వ ఐఏపై విచారణ చేపట్టింది. కొత్త విధి విధానాలపై అధ్యయనానికి తగిన సమయం ఇవ్వాలన్న ఏపీ ప్రభుత్వ వినతిని తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకించింది. కొత్త విధి విధానాల ప్రకారం తక్షణమే విచారణ చేపట్టాలని కోరింది. కానీ, ఏపీ ప్రభుత్వ వాదనతో బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఏకీభవించింది. కొత్త విధి విధానాలపై అధ్యయనం చేసేందుకు సమయం ఇచ్చింది. నవంబర్ 15లోగా కొత్త విధి విధానాలపై అభిప్రాయాన్ని చేపట్టాలని ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను నవంబర్ 22, 23కు వాయిదా వేసింది.

విద్యా సామర్థ్యాల పెంపునకు 'ఏఐ' టెక్నాలజీ

- ఉత్తర్వులు జారీ చేసిన పాఠశాల విద్యాశాఖ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలను మరింత పెంచేందుకు విద్యా బోధనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ బుధవారం జీవో జారీ చేశారు. గత ఏడాది విద్యార్థులకు అందించిన 5 లక్షలకు పైగా బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్స్, ఈ ఏడాది డిసెంబర్‌లో ఇవ్వనున్న మరో 5 లక్షలకు పైగా ట్యాబ్స్‌లో 'డౌట్ క్లియరెన్స్ బాట్' యాప్‌ను అందుబాటులోకి తేనున్నారు. ఈ మేరకు కన్వే జీనియస్ ఏఐ సొల్యూషన్స్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నట్టు ప్రవీణ్ ప్రకాశ్ వెల్లడించారు. 50 శాతం ఉన్నత పాఠశాలల్లో అందుబాటులోకి తెచ్చిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌తో పాటు వచ్చే నెలాఖరులోగా ఇచ్చే మరో 32 వేల ఐఎఫ్‌పీలలోను 'డౌట్ క్లియరెన్స్ బాట్' యాప్ అప్‌లోడ్ చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, మ్యాథ్స్, ఇంగ్లిష్, టోఫెల్‌కు సంబంధించి ఎలాంటి ప్రశ్నకైనా జవాబులు తెలుసుకోవచ్చని, ఇది విద్యార్థులు, ఉపాధ్యాయుల విజ్ఞాన పరిధిని మరింత పెంచుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఈ తరహా ఏఐ టెక్నాలజీ డౌట్ క్లియరెన్స్ యాప్ వినియోగం తొలిసారి ఏపీలో మాత్రమే అందుబాటులోకి తెస్తున్నట్టు ఆయన తెలిపారు.

కృష్ణా జలాల పంపిణీపై న్యాయ పోరాటం

▶ మొదటి పేజీ తరువాయి

జలాల విడుదలకు నిర్వహణ నియమావళి (ఆపరేషన్ ప్రోటోకాల్)ని రూపొందించాలని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు విభజన చట్టం నిర్దేశించింది. బచావత్ ట్రిబ్యునల్ ప్రాజెక్టుల వారీగా చేసిన కేటాయింపులకు రెండు రాష్ట్రాలు కట్టుబడి ఉండాలని కూడా ట్రిబ్యునల్‌కు స్పష్టం చేసింది. దీని ప్రకారం 2016 అక్టోబర్ నుంచి బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ చేస్తోంది. విభజన చట్టం ప్రకారం బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన జలాల పునఃపంపిణీ కుదరని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఇప్పటికే తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో కృష్ణా జలాలను సెక్షన్–3 ప్రకారం పంపిణీ చేయాలని తెలంగాణ చేసిన ఫిర్యాదు ఆధారంగా.. కృష్ణా జలాల పంపిణీకి కొత్త విధి విధానాలను ఈనెల 4న కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. ఆ మేరకు కొత్త విధి విధానాలను బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు ఈనెల 6న కేంద్ర జల్ శక్తి శాఖ జారీ చేసింది. ఈ విధి విధానాల ప్రకారం బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 811 టీఎంసీలతోపాటు అదనంగా కేటాయించిన జలాలను ప్రాజెక్టులవారీగా పంపిణీ చేసి, రెండు రాష్ట్రాల వాటాలను బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తేల్చాలి. విభజన చట్టంలో పేర్కొన్న ప్రాజెక్టులకూ విస్తృతార్థం ఇస్తూ.. పూర్తయిన, నిర్మాణంలో ఉన్న, ప్రతిపాదనలో ఉన్న ప్రాజెక్టులుగా కూడా వర్గీకరించింది. ఈ విధివిధానాలపై ఏపీ ప్రభుత్వం సుప్రీం కోర్టులో వ్యాజ్యం దాఖలు చేసింది.

జాతీయం / అంతర్జాతీయం



రాజస్తాన్, మధ్యప్రదేశ్‌లో గెలుపు కాంగ్రెస్‌దే

- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధీమా
- రెండు రాష్ట్రాల్లో అభ్యర్థుల ఎంపికపై సీఈసీ భేటీ

న్యూఢిల్లీ: రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ మళ్లీ విజయం సాధిస్తుందని, మధ్యప్రదేశ్‌లో కచ్చితంగా అధికారంలోకి వస్తుందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధీమా వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాల్లోపార్టీ అభ్యర్థుల ఎంపికపై చర్చించడానికి ఖర్గే నేతృత్వంలో కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ(సీఈసీ) బుధవారం ఢిల్లీలో సమావేశమైంది. ఈ భేటీలో సీనియర్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, కమల్‌నాథ్, రణదీప్ సూర్జేవాలా, రాజస్తాన్ సీఎం అశోక్ గహ్లోత్, గౌరవ్ గొగోయ్ తదితరులు పాల్గొన్నారు. రాజస్తాన్, మధ్యప్రదేశ్‌లో అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపికపై వేర్వేరుగా చర్చించారు. టికెట్ ఆశిస్తున్న అభ్యర్థుల బలాబలాలు, గెలుపు అవకాశాలపై సంప్రదింపులు జరిపారు. అభిప్రాయాలు పంచుకున్నారు. సర్వేల నివేదికలను సైతం పరిశీలించినట్లు సమాచారం. సీఈసీ సమావేశం అనంతరం ఖర్గే 'ఎక్స్'లో పోస్టు చేశారు. రాజస్తాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం గత ఐదేళ్లుగా సుపరిపాలన అందిస్తోందని, ప్రజలు మళ్లీ తమ పార్టీకే పట్టం కడతారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఓటర్లు కాంగ్రెస్‌ను మళ్లీ ఆశీర్వదిస్తారన్న విశ్వాసం ఉందన్నారు. మధ్యప్రదేశ్‌లో ప్రతి ఐదేళ్లకోసారి అధికారం చేతులు మారడం ఆనవాయితీగా వస్తోంది. దానిప్రకారం ఈ ఎన్నికల్లో తమ పార్టీని విజయం వరిస్తుందని కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నారు. రాజస్తాన్‌లో నవంబర్ 17, రాజస్తాన్‌లో నవంబర్ 25న అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి.



కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీలో రాహుల్ గాంధీ, ఖర్గే

ఛత్తీస్‌గఢ్‌లో హోరాహోరీ పోరు

మళ్లీ గెలుపుపై అధికార కాంగ్రెస్ పార్టీ ధీమా

ప్రజలు తమనే ఆదరిస్తారంటున్న బీజేపీ నేతలు

కింగ్‌మేకర్‌గా మారాలని చిన్న పార్టీల వ్యూహాలు



ఛత్తీస్‌గఢ్ శాసనసభ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్, విపక్ష బీజేపీ హోరాహోరీగా పోరాడుతున్నాయి. మళ్లీ నెగ్గాలన్న కృతనిశ్చయంతో ఉన్న కాంగ్రెస్ వ్యూహాలకు పదును పెడుతోంది. గత ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్‌కు ఉన్న జనాదరణే తమ పార్టీని మళ్లీ గెలిపిస్తుందని కాంగ్రెస్ నేతలు ఆత్మవిశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. కంచుకోట ఛత్తీస్‌గఢ్ తమ చేజారిపోయే ప్రసక్తే లేదని అంటున్నారు. మరోవైపు రాష్ట్రంలో ఈసారి ఎట్టిపరిస్థితుల్లోనూ అధికార పీఠం దక్కించుకోవాలన్న పట్టుదలతో బీజేపీ నాయకులు ప్రచారం ముమ్మరం చేశారు. భూపేశ్ బఘేల్ ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, వారంతా తమనే ఆదరిస్తారని బీజేపీ నేతలు చెబుతున్నారు. ప్రచారం హోరెత్తిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీతో సహా ఇతర చిన్నాచితక పార్టీలు సైతం అదృష్టం పరీక్షించుకుంటున్నాయి. రాష్ట్రంలో 90 అసెంబ్లీ స్థానాలున్నాయి. కొన్ని సీట్లయినా గెలుచుకొని కింగ్‌మేకర్ కావాలని చిన్న పార్టీలు ఆరాటపడుతున్నాయి.

కాంగ్రెస్ అవినీతే బీజేపీ అస్త్రం

చత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్‌కు 15 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత 2018లో అధికారం లభించింది. విపక్ష బీజేపీ మొదట్లో బలహీనంగా ఉన్నట్లు కనిపించినా ఎన్నికలు సమీపించేకొద్దీ బలం పుంజుకుంటోంది. అధికార కాంగ్రెస్‌కు సవాలు విసురుతోంది. ప్రభుత్వ పథకాల అమల్లో అవినీతి, కుంభకోణాలు, బుజ్జగింపు రాజకీయాలు, మత మార్పిడులను ప్రధానంగా తెరపైకి తీసుకొస్తూ బఘేల్ ప్రభుత్వాన్ని ఇరుకునపెడుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కచ్చితంగా విజయం సాధిస్తుందని ఏడాది క్రితం వరకూ బల్లగుద్ది మరీ చెప్పిన విశ్లేషకులు ఇప్పుడు ఆ సాహసం చేయలేకపోతున్నారు. బీజేపీకి విజయావకాశాలు మెరుగయ్యాయని పరోక్షంగా అంగీకరిస్తున్నారు. బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచార వ్యూహం మార్చారు. కాంగ్రెస్ అవినీతిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తున్నారు. మరోవైపు కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎన్నో విజయాలు సాధించిందంటూ ప్రజలకు తెలియజేస్తున్నారు. మోదీకి లభిస్తున్న జనాదరణ ఎన్నికల్లో ఓట్లుగా మారి తమకు లబ్ధి చేకూరుస్తుందని బీజేపీ నాయకులు విశ్వసిస్తున్నారు.

మోదీ, షా మంత్రాంగం

ఛత్తీస్‌గఢ్‌పై ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించారు. మోదీ గత మూడు నెలల్లో నాలుగు బహిరంగ సభల్లో పాల్గొన్నారు. అమిత్ షా తరచుగా ఛత్తీస్‌గఢ్‌లో పర్యటిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో చోటుచేసుకున్న అవినీతిని ఎండగడుతున్నారు. తాము అధికారంలోకి రాగానే బఘేల్ ప్రభుత్వ అవినీతిపై విచారణ జరిపిస్తామని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. రాష్ట్ర బీజేపీ నేతల మధ్య విభేదాలను పరిష్కరించి, గెలుపు దిశగా నడిపించడానికి మోదీ, షా ప్రాధాన్యం ఇస్తున్నారు.

జనాభాలో 32 శాతం గిరిజనులే

రాష్ట్రంలో ముఖ్యంగా కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీ ఉంటుంది. గత ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. ఈ ఎన్నికల్లో కొన్ని సీట్లు గెలిచి, అసెంబ్లీలో అడుగు పెడతామని ఆ పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. అసెంబ్లీలో తమ ప్రాతినిధ్యం తప్పనిసరిగా ఉంటుందని చెబుతున్నారు. ఎన్నికల్లో సర్వ ఆదివాసీ పార్టీ, గోండ్వానా గణతంత్ర పార్టీ కూడా పోటీ పడుతున్నాయి. రాష్ట్ర జనాభాలో 32 శాత మంది గిరిజనులు ఉన్నారు. వారి ఓట్లపై అన్ని పార్టీలు ఆశలు పెట్టుకున్నాయి. రాష్ట్రంలో మొత్తం 90 అసెంబ్లీ సీట్లకు గాను 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ ఏకంగా 68 సీట్లు గెలుచుకొని జయకేతనం ఎగురవేసింది. బీజేపీకి కేవలం 15 సీట్లు లభించాయి. మాజీ సీఎం అజిత్ జోగీ స్థాపించిన జనతా కాంగ్రెస్ ఛత్తీస్‌గఢ్(జే)కు ఐదు సీట్లు దక్కాయి. బీఎస్పీ రెండు స్థానాలు గెలుచుకుంది. ఈసారి ఎన్నికల్లో 75 సీట్లను తన ఖాతాలో వేసుకోవాలని కాంగ్రెస్ లక్ష్యంగా నిర్దేశించుకుంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఫేస్ లేకుండా పోటీ

- ఎన్నికల రాష్ట్రాల్లో బీజేపీ కొత్త ప్రయోగం
- ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించకుండానే బరిలోకి
- నేతల సిగపట్లు, అంతర్గత పోరు భయంతోనే
- ప్రతికూలంగా మారవచ్చంటున్న పరిశీలకులు



ఎంత ప్రయత్నించినా దక్షిణాదిన అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రం కర్ణాటకను కాంగ్రెస్‌కు చేజార్చుకోవడం బీజేపీకి గట్టి షాకే ఇచ్చింది. మరికొద్ది నెలల్లో కీలకమైన లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. ఈ నేపథ్యంలో మధ్యప్రదేశ్, రాజస్తాన్‌తో పాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలను బీజేపీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. కాకపోతే అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్‌లో ప్రభుత్వ వ్యతిరేకత ప్రభావం భయం. మరో పెద్ద రాష్ట్రమైన రాజస్తాన్‌లో వసుంధర రాజె తదితర ముఖ్య నేతల మధ్య కీచులాటలు. ఇటు ఛత్తీస్‌గఢ్‌లోనూ ఇంటి పోరు. వీటన్నింటినీ ఎదుర్కొంటూ కాంగ్రెస్‌ను సమర్థంగా ఢీకొట్టేందుకు అన్ని మార్గాలనూ కమలదళం అన్వేషిస్తోంది. అందులో భాగంగా ఏ రాష్ట్రంలోనూ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎవరినీ ముందస్తుగా ప్రకటించకుండా జాగ్రత్త పడుతోంది. తద్వారా ముఖ్య నేతల పరస్పర కుమ్ములాటలను అదుపు చేయడంతో పాటు కీలక సమయంలో వారెవరూ సహాయ నిరాకరణ చేయకుండా చూడవచ్చని భావిస్తోంది.

మధ్యప్రదేశ్‌లో ఎన్ని క్యాంప్‌లో!

మధ్యప్రదేశ్‌లో ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు వి.డి.శర్మ, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, సీనియర్ నేత కైలాశ్ విజయవర్గీయ... ఇలా సీనియర్లంతా తలో వర్గంగా విడిపోయి కుమ్ములాటల్లో యమా బిజీగా ఉన్నారు. దాంతో కేవలం ప్రధాని నరేంద్ర మోదీ ఛరిష్మానే ప్రధానంగా నమ్ముకుని సాగాల్సిన పరిస్థితి! ఈ పరిస్థితుల్లో చౌహాన్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించడం నేతల విభేదాలను చేజేతులా పెంచడమే అవుతుందని అధిష్టానం నిర్ణయానికి వచ్చింది. పైగా ప్రభుత్వ వ్యతిరేకత దృష్ట్యా చూసుకున్నా అది చేటు చేసేదేనని అభిప్రాయపడుతోంది. అందుకే ముఖ్యమంత్రి అభ్యర్థి మాటెత్తకుండానే ప్రచార పర్వాన్ని ముగించే పనిలో పడింది. ఛత్తీస్‌గఢ్‌లో ఇప్పటికీ బీజేపీకి అతి పెద్ద నేతగా మాజీ సీఎం రమణ్‌సింగ్ ఉన్నా ఆయనపైనా పార్టీలో వ్యతిరేకత నానాటికీ పెరుగుతోంది. మాజీ మంత్రి బ్రిజ్‌మోహన్ అగర్వాల్, ఎమ్మెల్యే అజయ్ చంద్రాకర్, సీనియర్ నేత నంద్‌కుమార్ సాయ్ లాంటివాళ్లు ఆయన నాయకత్వం పట్ల అసంతృప్తి సెగలు కక్కుతున్నారు. అసలే ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారాన్ని నిలబెట్టుకునే అవకాశాలున్నాయన్న అంచనాల మధ్య ఈ తలనొప్పులు బీజేపీ అధిష్టానాన్ని మరింత చికాకు పెడుతున్నాయి. అందుకే ఈసారి ముఖ్యమంత్రి అభ్యర్థి అంటూ ఎవరినీ ముందస్తుగా ప్రకటించబోమని బీజేపీ ఛత్తీస్‌గఢ్ ఇన్‌చార్జి దగ్గుబాటి పురందేశ్వరి ఇటీవల రాష్ట్ర పర్యటనలో ప్రకటించారు. ఇలా సీఎం అభ్యర్థిని ప్రకటించకపోవడం వల్ల వర్గ పోరును అదుపు చేయడం వంటి ప్రయోజనాలు దక్కే మాటెలా ఉన్నా నష్టాలు జరిగే ఆస్కారమూ ఉందన్న భావవ వ్యక్తమవుతోంది. బాధ్యతనంతా భుజాలపై వేసుకుని రాష్ట్ర పార్టీ యంత్రాంగం మొత్తాన్నీ ఒక్కతాటిపై నడిపే నాయకుడంటూ లేకపోతే మొదటికే మోసం వచ్చే ప్రమాదముందన్న అభిప్రాయం బీజేపీలోనే కొందరు నేతల్లో వ్యక్తమవుతోంది. కర్ణాటకలో యడ్యూరప్పను పక్కన పెట్టి అంతా అధిష్టానమే అన్నట్టుగా వ్యవహరించి భంగపడ్డ వైనాన్ని వారు గుర్తు చేస్తున్నారు

– సాక్షి, నేషనల్ డెస్క్

రాజస్థాన్‌లోనూ రచ్చే

రాజస్తాన్‌లో మాజీ సీఎం వసుంధరా రాజె సింధియాకు, సీనియర్ నేతలు అర్జున్‌రామ్ మేఘ్వాల్ తదితరులకు ఉప్పూ నిప్పుగా ఉంటోంది. సింధియా వర్గపు నేత కైలాశ్ మేఘ్వాల్ తాజాగా అర్జున్‌రామ్‌పై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. దాంతో అధిష్టానం ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. కాంగ్రెస్ పాలిత రాజస్తాన్‌లో ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్‌పై వ్యతిరేకత పరాకాష్టకు చేరిందన్నది బీజేపీ అధిష్టానం అంచనా వేస్తోంది. అవినీతి, అసమర్థత తదితర కారణాలతో ప్రజలు విసిగిపోయి ఉన్నారని, ఈ పరిస్థితిని పూర్తిగా తమకు అనుకూలంగా మార్చుకోవాలని భావిస్తోంది. తమ నేతల మధ్య పోరు ఇందుకు అడ్డంకిగా మారకూడదని పట్టుదలగా ఉంది. అందుకే ఢిల్లీ పెద్దలు నిత్యం రాష్ట్ర నేతలతో సంప్రదింపులు జరుపుతూ వారు కట్టుదాటకుండా చూసే ప్రయత్నాల్లో పడ్డారు.

బట్టలు చింపే నేతలకు అధికారం దక్కదు

కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడి

గ్వాలియర్: ఎన్నికల్లో పోటీ చేయడానికి టికెట్లు రాకపోతే బట్టలు చించేయాలని చెప్పే నాయకులకు మధ్యప్రదేశ్ ప్రజలు అధికారం అప్పగించబోరని కేంద్ర మంత్రి, బీజేపీ నేత జ్యోతిరాదిత్య సింధియా తేల్చిచెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అధికారం దక్కడం కలలో మాట అని అన్నారు. దిగ్విజయ్ సింగ్ బట్టలు చించేయాలంటూ మధ్యప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు కమల్‌నాథ్ చేసిన వ్యాఖ్యలపై సింధియా బుధవారం స్పందించారు. కాంగ్రెస్ విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోపై వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఆ మేనిఫెస్టో చాంతాడంత పొడవు ఉందని, అందులో ఒక్క హామీ కూడా నెరవేరదని అన్నారు. కాంగ్రెస్ నేతలకు బట్టలు చించడం మాత్రమే తెలుసని ఎద్దేవా చేశారు. అనుచితంగా మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులకు అధికారం అప్పగిస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందని ప్రజలను సింధియా అప్రమత్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు తమలో తాము తన్నుకోవడం తప్ప ప్రజలకు చేసేదేమీ ఉండదని అన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ అభ్యర్థుల రెండో జాబితా విడుదల

రాయ్‌పూర్: అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఛత్తీస్‌గఢ్‌లో బరిలో దిగనున్న తమ అభ్యర్థుల రెండో జాబితాను కాంగ్రెస్ పార్టీ విడుదలచేసింది. ఆదివారం 30 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల పేర్లు ప్రకటించగా బుధవారం 53 స్థానాలకు అభ్యర్థుల పేర్లను విడుదలచేసింది. భత్‌గావ్ నుంచి పరాస్‌నాథ్ రాజ్‌వాడే, కట్‌ఘోరా నుంచి పురుషోత్తం కన్వర్, బెల్తారా నుంచి విజయ్ కేసర్‌వాణి, అకల్‌తారా నియోజకవర్గం నుంచి రాఘవేంద్ర సింగ్, బిల్హా నుంచి సియారామ్ కౌశిక్ బరిలో నిలుస్తున్నారు. 14 ఎస్‌టీ , ఆరు ఎస్‌సీ స్థానాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించింది. ఆదివారం విడుదలైన అభ్యర్థుల జాబితా ప్రకారం ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ భగేల్.. పటాన్ నియోజకవర్గం నుంచి పోటీచేయనున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో నవంబర్ 7న తొలి దఫా, నవంబర్ 17న రెండో దఫాలో పోలింగ్ ఉంటుంది.



'డీఆర్ఎస్'పై డేవిడ్ వార్నర్ అసంతృప్తి

అంపైర్ నిర్ణయ సమీక్ష పద్ధతి (డీఆర్ఎస్)పై ఆస్ట్రేలియా స్టార్ ఓపెనర్ వార్నర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో మదుషంక బౌలింగ్‌లో వార్నర్ ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. వార్నర్ రివ్యూ కోరినా...డీఆర్ఎస్‌లోనూ అది అవుట్‌గా తేలడం వివాదాస్పదమైంది. 'హాక్-ఐ' టెక్నాలజీ బంతి గమనాన్ని సరిగా అంచనా వేయలేదు. అయినా సరే 'వికెట్లను తగులుతుంది' అనే అవుటిచ్చారు. 'ఈ హాక్-ఐ ఎలా పనిచేస్తోందో అర్థం కావడం లేదు. దయచేసి ఎవరికైనా తెలిస్తే చెప్పండి. లేదంటే ఇది అవసరమా లేదో కూడా చెప్పండి. ఎందుకంటే ఇది టీవీల కోసమా అన్నట్లుగా దీని పని తీరు ఉంటోంది. ఇదేలా అవుటని ఫీల్డ్ అంపైర్‌ను కూడా అడిగాను. అతనేమో (అంపైర్) బంతి స్వింగ్ అయ్యిందని అందుకే అవుటిచ్చానని చెప్పాడు. కానీ బంతి లెగ్‌సైడ్ ఆవల పడింది. ఇలాంటి తప్పుల విషయంలో ఎవరో ఒకరు బాధ్యత వహించాలి కదా' అని వార్నర్ విమర్శించాడు. బెంగళూరులో ఆదివారం జరిగే మ్యాచ్‌లో పాకిస్తాన్‌తో ఆస్ట్రేలియా తలపడుతుంది.

భారత్ జోరుకు ఎదురుందా!

ఎప్పుడో 2007లో ప్రపంచకప్‌లో అనూహ్యంగా బంగ్లాదేశ్ చేతిలో భారత్ ఓడింది... ఆపై మూడు వరల్డ్ కప్‌లలో కూడా బంగ్లాను టీమిండియా చిత్తుగా ఓడించింది...ఇప్పుడు తాజా ఫామ్, బలాబలాలను బట్టి చూస్తే రోహిత్ సేనకు టోర్నీలో వరుసగా నాలుగో విజయం అందుకోవడం పెద్ద కష్టం కాకపోవచ్చు. తమ మొదటి పోరులో అఫ్గన్‌ను ఓడించినా... ఆపై రెండు మ్యాచ్‌లలో చిత్తుగా ఓడిన బంగ్లా మళ్లీ కోలుకునే ప్రయత్నంలో ఉంది. అయితే అన్ని రంగాల్లో అత్యంత పటిష్టంగా ఉన్న టీమిండియాను ఆ జట్టు నిలువరించడం దాదాపు అసాధ్యం కావచ్చు.

- నేడు బంగ్లాదేశ్‌తో టీమిండియా పోరు
- నాలుగో విజయంపై రోహిత్ సేన గురి
- తీవ్ర ఒత్తిడిలో బంగ్లా
- మ.గం.2.00నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం


రోహిత్

పుణే: వరల్డ్ కప్ టైటిల్ లక్ష్యంగా బరిలోకి దిగి వరుస విజయాలతో దూసుకుపోతున్న భారత్ మరో సమరానికి సన్నద్ధమైంది. నేడు జరిగే పోరులో మరో ఆసియా జట్టు బంగ్లాదేశ్‌తో టీమిండియా తలపడుతుంది. ఇటీవలి ఆసియా కప్ సహా గత ఏడాది కాలంలో భారత్‌పై ఆడిన నాలుగు మ్యాచ్‌లలో 3-1తో బంగ్లాదేశ్‌కు మెరుగైన రికార్డు ఉంది. అయితే ప్రస్తుతానికి వచ్చే సరికి ఆ లెక్క ఇక్కడ పని చేయకపోవచ్చు. ఆసీస్, అఫ్గన్, పాక్‌లను అలవోకగా ఓడించిన టీమిండియాకు బంగ్లాపై కూడా అదే జోరు కొనసాగించే అవకాశాలు ఉన్నాయి. ప్రధాన ఆటగాళ్లెవరూ ఫామ్‌లో లేక ఇబ్బంది పడుతున్న బంగ్లా ఎంత వరకు పోటీనిస్తుందనేది చూడాలి. 1998 తర్వాత బంగ్లాదేశ్ జట్టు భారత గడ్డపై భారత్‌ను ఎదుర్కోవడం ఇదే మొదటిసారి.

మార్పుల్లేకుండా...

ఫామ్‌ను బట్టి చూస్తే సహజంగానే ఈ మ్యాచ్ కోసం భారత్ తమ తుది జట్టులో మార్పులు చేయాల్సిన అవసరం లేదు. గత రెండు మ్యాచ్‌లలో 131, 86 స్కోర్లతో సత్తా చాటిన రోహిత్ మళ్లీ చెలరేగితే బంగ్లాకు చుక్కలు చూపించగలడు. పాక్‌తో విఫలమైనా టోర్నీలో ఇప్పటికే రెండు అర్ధ సెంచరీలు చేసిన కోహ్లి కూడా తన ధాటిని ప్రదర్శించగలడు. బంగ్లాదేశ్‌పై ఆడిన 15 వన్డేల్లో ఏకంగా 67.25 సగటుతో చెలరేగిన కోహ్లి 4 సెంచరీలూ బాదాడు. టాప్-5లో ఇతర బ్యాటర్లు గిల్, అయ్యర్, రాహుల్ కూడా చెలరేగిపోగలరు. రాహుల్ ప్రతీ మ్యాచ్‌లో ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేస్తుండగా, అయ్యర్ కూడా ఫామ్‌లోకి వచ్చాడు. పాండ్యా, జడేజా తమ ఆల్‌రౌండ్ పాత్రను సమర్థంగా నిర్వహిస్తున్నారు. శార్దుల్ స్థానంలో కాస్త చర్చ కొనసాగుతున్నా... పిచ్‌ను బట్టి చూస్తే అతడినే కొనసాగించవచ్చు. పేస్ విభాగంలో కూడా బుమ్రా, సిరాజ్ జోరు మీదుండటంతో సీనియర్ షమీకి అవకాశం దక్కడం కష్టమే. మరో వైపు కుల్దీప్ ఇప్పటి వరకు కేవలం 3.9 ఎకానమీ నమోదు చేయడం చూస్తే అతని బౌలింగ్‌ను ఎదుర్కోవడానికి బ్యాటర్లు ఎంత ఇబ్బంది పడుతున్నారో అర్థమవుతుంది. మూడు మ్యాచ్‌లలో కలిపి 28 ప్రత్యర్థి వికెట్లు తీసిన భారత్...మొత్తంగా 9 వికెట్లే కోల్పోయింది.

ఆదుకునేదెవరు...

భారత్‌పై పదహారేళ్ల క్రితం విజయంలో భాగమైన షకీబ్, ముష్ఫికర్ బహుశా చివరి సారి వరల్డ్‌కప్‌లో భారత్‌తో కాస్త మెరుగైన ప్రదర్శన కనబర్చాలని పట్టుదలగా ఉన్నారు. ముష్ఫికర్ రెండు అర్ధ సెంచరీలు సాధించినా షకీబ్ విఫలం కావడంతో జట్టుపై భారం పడుతోంది. మూడు మ్యాచ్‌లు ముగిసినా అతడినుంచి ఆశించిన ప్రదర్శన రాలేదు.


షకీబ్

నజ్ముల్, దాస్ ఒకే మ్యాచ్‌లో ఫర్వాలేదనిపించారు. కొత్త బ్యాటర్ తన్‌జీద్ కూడా ప్రభావం చూపలేకపోగా, ప్రపంచకప్‌కు ముందు అద్భుతంగా ఆడి అంచనాలు పెంచిన తౌహీద్ వరుసగా విఫలమయ్యాడు. మరో ఆల్‌రౌండర్ మిరాజ్‌లోనూ నిలకడ లోపించింది. బౌలింగ్‌లో ముస్తఫిజుర్ మినహా అంతా విఫలమయ్యారు.

తుది జట్లు (అంచనా):

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లి, అయ్యర్, రాహుల్, పాండ్యా, జడేజా, శార్దుల్, బుమ్రా, కుల్దీప్, సిరాజ్.

బంగ్లాదేశ్: షకీబ్ (కెప్టెన్), తన్‌జీద్, దాస్, నజ్ముల్, తౌహీద్, ముష్ఫికర్, మిరాజ్, మహ్మదుల్లా, తస్కీన్, షరీఫుల్, ముస్తఫిజుర్.

పిచ్, వాతావరణం

బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్. గతంలోనూ భారీగా పరుగులు వచ్చాయి. బుధవారం నగరంలో జల్లులు కురిసినా...మ్యాచ్ రోజు వర్షసూచన లేదు.

రోహిత్‌కు 3 జరిమానాలు...

వరల్డ్ కప్‌లో 142 స్ట్రయిక్‌రేట్‌తో దూసుకుపోతున్న భారత కెప్టెన్ రోహిత్ శర్మ రోడ్డుపై అంతకు మించిన వేగాన్ని ప్రదర్శించాడు. ముంబై-పుణే హైవేపై తన కారులో పరిమితికి మించిన వేగంతో వెళ్లడంతో ట్రాఫిక్ అధికారులు అతనిపై మూడు చలాన్లు విధించారు. భారత జట్టుతో చేరేందుకు ముంబైనుంచి తన కారులో పుణేకు వెళ్లిన రోహిత్ చాలా ప్రమాదకరంగా కారు నడిపాడని అధికారులు వెల్లడించారు. అతని అత్యధిక స్కోరు 264 నంబర్ ప్లేటుతో ఉన్న రోహిత్ 'లాంబోర్గిని' ఒక దశలో గంటకు 200-215 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయిందని సమాచారం.

న్యూజిలాండ్ 4/4

- అఫ్గాన్‌పై 149 పరుగులతో భారీ విజయం
- రాణించిన ఫిలిప్స్, లాథమ్, యంగ్



చెన్నై: టాస్ గెలిచి కూడా ఫీల్డింగ్ ఎంచుకొని చేసిన తప్పుడు వ్యూహంతో పాటు ఫీల్డింగ్‌లో మూడు క్యాచ్‌లు వదిలేసిన వైఫల్యం చివరకు అఫ్ఘనిస్తాన్ భారీ ఓటమికి కారణంగా మారింది. తడబడుతూ ఇన్నింగ్స్ కొనసాగించి చివర్లో చెలరేగిన న్యూజిలాండ్, ఆపై బౌలింగ్‌లో సత్తా చాటగా...పేలవ బ్యాటింగ్‌లో అఫ్గన్ కుప్పకూలింది. దాంతో కివీస్ ఖాతాలో వరుసగా నాలుగో విజయం చేరింది. బుధవారం జరిగిన పోరులో కివీస్ 149 పరుగుల తేడాతో అఫ్ఘనిస్తాన్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కివీస్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 288 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గ్లెన్ ఫిలిప్స్ (80 బంతుల్లో 71; 4 ఫోర్లు, 4 సిక్సర్లు), కెప్టెన్ లాథమ్ (74 బంతుల్లో 68; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), విల్ యంగ్ (64 బంతుల్లో 54; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. ఆరంభంలో 109/1తో పటిష్టంగా ఉన్న కివీస్ పరుగు తేడాతో 3 వికెట్లు కోల్పోయి 110/4 వద్ద నిలిచింది. ఈ స్థితిలో లాథమ్, ఫిలిప్స్ ఐదో వికెట్‌కు 144 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. అయినా సరే టీమ్ ఒక దశలో 44 ఓవర్లలో 210 పరుగులే చేసింది. కానీ చివరి 6 ఓవర్లలో బ్యాటర్లు చెలరేగడంతో ఏకంగా 78 పరుగులు సాధించగలిగింది. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన అఫ్గానిస్తాన్ 34.4 ఓవర్లలో 139 పరుగులకే కుప్పకూలింది. రహ్మత్ షా (62 బంతుల్లో 36; 1 ఫోర్) టాప్ స్కోరర్. గత మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను ఓడించి సంచలనం రేపిన అఫ్గన్ గత వరల్డ్ కప్ రన్నరప్ ముందు అదే స్థాయి పోరాటపటిమ కనబర్చలేక చేతులెత్తేసింది.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
న్యూజిలాండ్	4	4	0	8	1.923
భారత్	3	3	0	6	1.821
దక్షిణాఫ్రికా	3	2	1	4	1.385
పాకిస్తాన్	3	2	1	4	-0.137
ఇంగ్లండ్	3	1	2	2	-0.084
బంగ్లాదేశ్	3	1	2	2	-0.699
ఆస్ట్రేలియా	3	1	2	2	-0.734
నెదర్లాండ్స్	3	1	2	2	-0.993
అఫ్ఘానిస్తాన్	4	1	3	2	-1.250
శ్రీలంక	3	0	3	0	-1.532

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (ఎల్బీడబ్ల్యూ) (బి) ముజీబ్ 20; విల్ యంగ్ (సి) ఇక్రామ్ (బి) ఒమర్జాయ్ 54; రచిన్ (బి) ఒమర్జాయ్ 32; మిచెల్ (సి) ఇబ్రహీమ్ (బి) రషీద్ 1; లాథమ్ (బి) నవీనుల్ 68; ఫిలిప్స్ (సి) రషీద్‌ఖాన్ (బి) నవీనుల్ 71; చాప్‌మన్ నాటౌట్ 25; సాన్‌ట్నర్ నాటౌట్ 7; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (50 ఓవర్లలో 6 వికెట్లకు) 288.** **వికెట్ల పతనం:** 1-30, 2-109, 3-110, 4-110, 5-254, 6-255. **బౌలింగ్:** ముజీబ్ 10-0-57-1, ఫరూఖీ 7-1-39-0, నవీనుల్ 8-0-48-2, నబి 8-1-41-0, రషీద్ ఖాన్ 10-0-43-1, అజ్మతుల్లా ఒమర్జాయ్ 7-0-56-2.

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (బి) హెన్రీ 11; ఇబ్రహీమ్ (సి) సాన్‌ట్నర్ (బి) బౌల్ట్ 14, రహ్మత్ షా (సి) అండ్ (బి) రచిన్ 36; హష్మతుల్లా (సి) సాన్‌ట్నర్ (బి) ఫెర్గూసన్ 8; ఒమర్జాయ్ (సి) లాథమ్ (బి) బౌల్ట్ 27; ఇక్రామ్ నాటౌట్ 19; నబి (బి) సాన్‌ట్నర్ 7; రషీద్‌ఖాన్ (సి) మిచెల్ (బి) ఫెర్గూసన్ 8; ముజీబ్ (సి) యంగ్ (బి) ఫెర్గూసన్ 4; నవీనుల్ (సి) చాప్‌మన్ (బి) సాన్‌ట్నర్ 0; ఫరూఖీ (సి) మిచెల్ (బి) సాన్‌ట్నర్ 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (34.4 ఓవర్లలో ఆలౌట్) 139.** **వికెట్ల పతనం:** 1-27, 2-27, 3-43, 4-97, 5-107, 6-125, 7-134, 8-138, 9-139, 10-139.
బౌలింగ్: బౌల్ట్ 7-1-18-2, హెన్రీ 5-2-16-1, సాన్‌ట్నర్ 7.4-0-39-3, ఫెర్గూసన్ 7-1-19-3, ఫిలిప్స్ 3-0-13-0, రచిన్ రవీంద్ర 5-0-34-1.

'పెద్ద జట్లనేవి ఉండవు'

ప్రపంచకప్‌పై విరాట్ కోహ్లి వ్యాఖ్య

పుణే: వరల్డ్ కప్‌లో పెద్ద జట్ల గురించే ఎక్కువ చర్చ సాగుతూ వాటిపైనే దృష్టి కేంద్రీకృతమైతే సంచలనాలు తప్పవని భారత క్రికెటర్ విరాట్ కోహ్లి అభిప్రాయ పడ్డాడు. ఇంగ్లండ్‌పై అఫ్గనిస్తాన్ సాధించిన విజయాన్ని దృష్టిలో ఉంచుకొని అతను ఈ వ్యాఖ్యలు చేశాడు. 'నాకు తెలిసి ప్రపంచ కప్‌లో పెద్ద జట్లు అనేవి ఏమీ ఉండవు. ఒక మెగా టోర్నీలో కేవలం విజయవంతమైన జట్ల గురించే ఎక్కువ సంవాదం జరుగుతుంటే మరో వైపు సంచలన విజయాలు నమోదవుతాయి' అని కోహ్లి అన్నాడు. బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్‌పై విరాట్ ప్రశంసలు కురిపించాడు. 'చాలా ఏళ్లుగా షకీబ్‌కు ప్రత్యర్థిగా నేను ఆడాను. అతనో అద్భుతమైన బౌలర్. బంతిపై చక్కటి నియంత్రణ ఉంటుంది. ఎంతో అనుభవజ్ఞుడు. పైగా కొత్త బంతితో సమర్థంగా బౌలింగ్ చేస్తూ బ్యాటర్లను నియంత్రించగలడు' అని కోహ్లి చెప్పాడు.

నంబర్‌వన్ స్థానంలోనే బాబర్

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తాజా వన్డే బ్యాటర్ ర్యాంకింగ్స్‌లో పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ ఆజమ్ తన అగ్ర స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. 836 రేటింగ్ పాయింట్లతో అతను టాప్‌లో నిలిచాడు. పాక్‌తో విఫలమైనా...భారత ఓపెనర్ శుబ్‌మన్ గిల్ (818) కూడా తన రెండో స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. టాప్-10 జాబితాలో భారత కెప్టెన్ రోహిత్ శర్మ (6వ స్థానం), విరాట్ కోహ్లి (9వ స్థానం) కూడా ఉన్నారు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో హాజల్‌వుడ్ తొలి స్థానంలో నిలవగా... మొహమ్మద్ సిరాజ్ 3వ స్థానంలో, కుల్దీప్ యాదవ్ 8వ స్థానంలో కొనసాగుతున్నారు.

రజతం సాధించిన ఇందు

జాతీయ పవర్‌లిఫ్టింగ్



సాక్షి, హైదరాబాద్: జాతీయ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు చెందిన వీసారపు ఇందు రజత పతకం గెలుచుకుంది. ఇటీవలే బెంగళూరులో జరిగిన ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన పవర్‌లిఫ్టర్లు పాల్గొన్నారు. మహిళల 90 కేజీల విభాగంలో బరిలోకి దిగిన ఇందు మొత్తం 100 కేజీల బరువునెత్తి రెండో స్థానంలో నిలిచింది.

సినిమా


● రామ్‌చరణ్, ఉపాసన

తొలి విహార యాత్ర!


రామ్‌చరణ్, ఉపాసన ఇటలీ వెళ్లారు. తమ కుమార్తె క్లీం కారని తీసుకుని ఈ విహార యాత్రకు వెళ్లారు. కుమార్తెతో చరణ్, ఉపాసన వెళ్లిన ఫస్ట్ వెకేషన్ ఇది. ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో 'గేమ్ ఛేంజర్' సినిమాలో నటిస్తున్నారు రామ్ చరణ్. ఈ సినిమా తాజా షెడ్యూల్ మంగళవారంతో పూర్తయింది. తర్వాతి షెడ్యూల్‌కి కాస్త గ్యాప్ రావడంతో కుటుంబంతో కలిసి బుధవారం ఇటలీ వెకేషన్‌కు బయలుదేరారు రామ్‌చరణ్. దాదాపు వారంరోజుల పాటు ఈ ట్రిప్‌ని ప్లాన్ చేసుకున్నారని సమాచారం.

పులివెందులలో యాత్ర 2


● జీవా

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జీవితంలోని ముఖ్య ఘటనల ఆధారంగా రూపొందుతున్న సినిమా 'యాత్ర 2'. ఈ చిత్రంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాత్రలో జీవా, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి పాత్రలో మమ్ముట్టి నటిస్తున్నారు. 2019లో విడుదలైన 'యాత్ర' సినిమాకు సీక్వెల్‌గా 'యాత్ర 2' తెరకెక్కుతోంది. 'యాత్ర'ను తెరకెక్కించిన మహీ వి. రాఘవ్ 'యాత్ర 2' చిత్రానికీ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ వైఎస్ఆర్ కడప జిల్లా పులివెందులలో జరుగుతోంది. జీవా పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ''వైఎస్ జగన్ మోహన్ రెడ్డిగారి పాత్రలో జీవా జీవిస్తున్నాడు. ప్రస్తుతం నేనే ప్రత్యక్ష సాక్షిని. ఫిబ్రవరి 8న మీరూ (ప్రేక్షకులు) చెబుతారు'' అన్నారు మహీ వి. రాఘవ్. త్రీ ఆటమ్ లీవ్స్, వీ సెల్యూలాయిడ్ నిర్మిస్తున్న ఈ చిత్రం 2024 ఫిబ్రవరి 8న విడుదల కానుంది.

ఉల్లిపాయలు కొంటే మనిషి కాదా!


● విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న తాజా సినిమాకు 'ఫ్యామిలీ స్టార్' అనే టైటిల్ ఖరారు చేశారు. పరశురామ్ పెట్ల ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మృణాల్ ఠాకూర్ హీరోయిన్. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టైటిల్ టీజర్‌ను బుధవారం రిలీజ్ చేశారు మేకర్స్. ఇంట్లో పనులు చేసే ఫ్యామిలీ మ్యాన్‌గా, బయట రౌడీల బెండు తీసే పవర్‌ఫుల్ మ్యాన్‌గా విజయ్ దేవరకొండ టీజర్‌లో కనిపించారు. 'లైన్‌లో నిలబడి ఉల్లిపాయలు తేవడాలు, టైమ్‌కు లేచి పిల్లల్ని రెడీ చేసి స్కూల్‌కు పంపించడాలు అనుకున్నావా మగతనం అంటే' అని విలన్ ఎగతాళిగా మాట్లాడగా... 'భలే మాట్లాడతారన్నా మీరంతా... ఉల్లిపాయలు కొంటే ఆడు మనిషి కాదా... పిల్లల్ని రెడీ చేస్తే ఆడు మగాడు కాదా... ఐరన్ వంచాలా ఏంటి?' అంటూ విజయ్ చెప్పే డైలాగ్‌లు టీజర్‌లో ఉన్నాయి. ''ఫ్యామిలీ స్టార్' సంక్రాంతి పండగకు రిలీజ్ చేయనున్నాం. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం'' అని మేకర్స్ అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: కేయూ మోహనన్, సంగీతం: గోపీసుందర్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: వాసు వర్మ.

కీడా కోలా నవ్విస్తుంది

\- రానా


● చైతన్యా రావు, రానా, తరుణ్ భాస్కర్

తరుణ్ భాస్కర్ కథ అందించి, నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'కీడా కోలా'. బ్రహ్మానందం, చైతన్యా రావు, రాగ్ మయూర్, విష్ణు, రవీంద్ర విజయ్, రఘురామ్ ప్రధాన పాత్రల్లో నటించారు. నటుడు - నిర్మాత రానా సమర్పణలో కె.వివేక్ సుధాంషు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్ నండూరి, శ్రీపాద్ నందిరాజ్, ఉపేంద్ర వర్మ నిర్మించిన ఈ చిత్రం నవంబరు 3న విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్‌ను రిలీజ్ చేసిన రానా మాట్లాడుతూ- ''తాము అనుకున్న కథను బలంగా నమ్మి, కథ... కథనానికి కట్టుబడి సినిమాలు చేసే తరుణ్ భాస్కర్ వంటి ఫిల్మ్ మేకర్స్ చాలా అరుదుగా ఉంటారు. 'కీడా కోలా' చూసి నవ్వుకున్నాను. ప్రేక్షకులు కూడా ఎంజాయ్ చేస్తారనే నమ్మకం ఉంది. నేను హీరోగా చేసే సినిమాల అప్‌డేట్స్ త్వరలో తెలుస్తాయి. అలాగే అరవై ఏళ్లుగా ఉన్న సురేష్ ప్రొడక్షన్స్‌లో చాలా సినిమాల రీమేక్స్ రైట్స్ ఉన్నాయి. అయితే ప్రస్తుతానికి నేను ఏ రీమేక్ చేయడం లేదు. ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ' తో నాకు ఉన్న అసోషియేషన్ ఏంటి? అనేది త్వరలో తెలుస్తుంది'' అన్నారు. ''లాక్‌డౌన్ టైమ్‌లో డబ్బులు ఎలా సంపాదించాలని ఆలోచిస్తున్నప్పుడు ఏదైనా డ్రింక్‌లో ఓ కీడా ఉంటే కన్‌జ్యూమర్ కేసు వేసి, కోట్లు సంపాదించవచ్చు కదా అనే ఆలోచన వచ్చింది. అలా క్రైమ్ కామెడీగా 'కీడా కోలా' కథను కొత్తగా రెడీ చేసుకున్నాను. వెంకటేశ్‌గారితో సురేష్ ప్రొడక్షన్స్‌లో నేను చేయాల్సిన సినిమా కథ సెకండాఫ్ వర్క్ చేస్తున్నాను''అన్నారు. ''తరుణ్ భాస్కర్‌తో సినిమా చేయాలన్న నా కల నేరవేరింది'' అన్నారు చైతన్యా రావు. ''ప్రేక్షకులు ఈ మూవీని ఎంజాయ్ చేస్తారు'' అన్నారు నిర్మాతలు.

జపాన్ రేంజే వేరు


● కార్తీ

'హార్ట్ ఆఫ్ ది సిటీలో ఒకడు కన్నమేసి రెండు వందల కోట్ల రూపాయల విలువ చేసే నగలు ఎత్తుకుపోతే మీ లా అండ్ ఆర్డర్ లాఠీ ఊపుతూ కూర్చుందా?' అనే డైలాగ్‌తో 'జపాన్' చిత్రం టీజర్ విడుదలైంది. కార్తీ హీరోగా రాజు మురుగన్ దర్శకత్వం వహించిన చిత్రం 'జపాన్'. ఇందులో అనూ ఇమ్మాన్యుయేల్ హీరోయిన్‌గా నటించారు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్‌పై ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో దీపావళికి విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్‌ని బుధవారం విడుదల చేశారు. ''ఇండియా అంతటా జపాన్‌పై (కార్తీ పాత్ర పేరు) 182 కేసులున్నాయి. నాలుగు రాష్ట్రాల పోలీసులు వాడి కోసం వెతుకుతున్నారు. కానీ, ఒక్కసారి కూడా వాడు ఎవ్వరికీ దొరకలేదు', 'జపాన్ రేంజే వేరు' వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.


తెలుసు కదా ఆరంభం


● రాశీఖన్నా, సిద్ధు జొన్నలగడ్డ, శ్రీనిధి, నీరజ కోన

సిద్ధు జొన్నలగడ్డ హీరోగా 'తెలుసు కదా' సినిమా ఆరంభం అయింది. ఈ సినిమా ద్వారా స్టైలిస్ట్, కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. ఇందులో రాశీ ఖన్నా, శ్రీనిధీ శెట్టి హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి దర్శకుడు బాబీ కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో నాని క్లాప్ కొట్టగా, దర్శకుడు హరీష్ శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. హీరోలు నితిన్, ఆది పినిశెట్టి స్క్రిప్ట్‌ను మేకర్స్‌కి అందించారు. ''తెలుసు కదా' త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం'' అన్నారు మేకర్స్. దర్శకులు వక్కంతం వంశీ, 'బొమ్మరిల్లు' భాస్కర్, మల్లిక్ రామ్, నందినీ రెడ్డి, నిర్మాతలు నాగవంశీ, విజయేందర్ రెడ్డి, రచయిత కోన వెంకట్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల, సంగీతం: తమన్, కెమెరా: యువరాజ్ జె.

నరేశ్ అంటే ఎవరు అన్నారు

\- వీకే నరేశ్



సంపూర్ణేష్ బాబు హీరోగా వీకే నరేష్, శరణ్య ప్రదీప్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'మార్టిన్ లూథర్ కింగ్'. వై నాట్ స్టూడియోస్, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పిస్తున్న ఈ చిత్రంలో దర్శకుడు వెంకటేశ్ మహా స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించడంతో పాటు క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు. పూజా కొల్లూరు దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలో ఓ కీలక పాత్రలో నటించిన వీకే నరేశ్ మాట్లాడుతూ- ''వినోదం, సందేశం... ఈ రెండు అంశాలు మిళితమై ఉన్న సినిమాలు తక్కువగా వస్తుంటాయి. 'మార్టిన్ లూథర్ కింగ్'లో ఈ రెండూ ఉన్నాయి. ఓ గ్రామంలోని రాజకీయ వర్గానికి నాయకుడిగా నటించాను. తమిళ 'మండేలా' సినిమాకు 'మార్టిన్..' చిత్రం స్ఫూర్తి మాత్రమే. పూర్తి స్థాయి రీమేక్ కాదు. ఈ సినిమా సంపూర్ణేష్‌కు సెకండ్ ఇన్నింగ్స్‌లా ఉంటుంది. 30 మంది నటీనటులు ఈ సినిమాతో పరిచయం అవుతున్నారు. ప్రేక్షకులకు ఈ సినిమా నచ్చుతుంది'' అన్నారు. ఇంకా మాట్లాడుతూ- ''కొంతకాలం రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నాను. ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉంటూ సినిమాలు చేస్తున్నాను. జీవితంలో ఎత్తుపల్లాలు చూశాను. రాజకీయాల నుంచి ఇండస్ట్రీకి తిరిగొచ్చినప్పుడు నరేశ్ అంటే ఎవరు? అని కొందరు అన్నారు. ఎస్వీ రంగారావుగారిని స్ఫూర్తిగా తీసుకుని విభిన్నమైన పాత్రలు చేస్తున్నాను. ఈ తరం దర్శకులు నాకోసం పాత్రలు రాయడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు.

అప్పుడు నా కళ్లలో నీళ్లు తిరిగాయి

\- నిర్మాత అభిషేక్ అగర్వాల్



రవితేజ టైటిల్ రోల్ చేసిన చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. ఇందులో నూపుర్ సనన్, గాయత్రి భరద్వాజ్ హీరోయిన్లుగా నటించారు. వంశీకృష్ణ దర్శకత్వంలో తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం రేపు (శుక్రవారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో నిర్మాత అభిషేక్ అగర్వాల్ చెప్పిన విశేషాలు.

● మంచి కంటెంట్, కొత్త కథలను చెప్పడమే మా అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ సంస్థ ప్రధాన లక్ష్యం. ఈ క్రమంలోనే పవర్‌ఫుల్ కంటెంట్ ఉన్న 'టైగర్ నాగేశ్వరరావు' చేశాం. ఈ సినిమా చేయడానికి ముందే నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను సంప్రదించి, ఆయన పూర్తి వివరాలు తెలుసుకున్నాం. టైగర్ నాగేశ్వరరావు దొంగగా మారడానికి దారి తీసిన కారణాలు, పరిస్థితులు ఏమై ఉంటాయి? ఆయన దొంగగా మారిన తర్వాత ఏం చేశారు? అనే అంశాలు ఈ సినిమాలో ఆసక్తికరంగా ఉంటాయి.

● రవితేజగారు హార్డ్‌వర్క్ చేశారు. యాక్షన్ సీక్వెన్స్‌లన్నీ ఆయనే చేశారు. ఓ రోజు ఆయన చేతికి గాయమైంది. లొకేషన్‌లో ఐదారు వందలమంది ఉన్నారు. ప్రొడక్షన్ కాస్ట్ వృథా కాకూడదని, ఆయనకు ఇబ్బందిగా ఉన్నా షూటింగ్‌లో పాల్గొన్నారు. ఇక అనుపమ్ ఖేర్‌గారు నా లక్కీ చార్మ్ అనే చెప్పాలి. ఫలానా పాత్ర చేయాలని అనుపమ్‌గారిని కోరితే వెంటనే ఓకే అంటారు. నాపై ఆయనకు ఉన్న నమ్మకం అలాంటిది. హేమలత లవణంగా రేణూ దేశాయ్ బాగా నటించారు. రేణుదేశాయ్ 2.ఓ చూస్తారు. ప్రత్యేక శ్రద్ధతో జీవీ ప్రకాష్‌కుమార్ సంగీతం అందించాడు. అవినాష్ కొల్లా అద్భుతంగా ఆర్ట్ డైరెక్షన్ చేశాడు. దర్శకుడిగానే కాదు.. నిర్మాతగా కూడా బాధ్యతలు తీసుకుని పని చేశారు వంశీ. కథకు ఏది అవసరమైతే అది నేను వంద శాతం ఇస్తాను. నిర్మాణంలో రాజీపడను. నా కెరీర్‌లో ఓ మంచి గుర్తుగా నిలిచిపోతుంది 'టైగర్ నాగేశ్వరరావు'. ● పండగ అంటే రెండు, మూడు సినిమాలు రావడం సహజం. మా సినిమా కంటెంట్‌పై నమ్మకం ఉంది. ప్రేక్షకులు ఆదరిస్తారన్న నమ్మకం కూడా ఉంది. నార్త్‌లోనూ మంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది. ● తెలుగు ఇండస్ట్రీలో నిర్మాతగా నేను అవుట్‌సైడర్‌ని. ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. వచ్చిన మూడేళ్లలో నిర్మాతగా జాతీయ అవార్డు ('కశ్మీరీ ఫైల్స్' చిత్రం) అందుకోవడం మా సంస్థకు గౌరవాన్ని తెచ్చింది. అవార్డు అందుకుంటున్నప్పుడు నా కళ్లలో నీళ్లు తిరిగాయి. మా బ్యానర్‌లో త్వరలో ఓ క్రేజీ బయోపిక్ ప్రకటిస్తా.

ఓ మంచి జ్ఞాపకంలా..


● సాయి సుధాకర్, దినేష్ తేజ్, పాయల్

దినేష్ తేజ్ హీరోగా, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'అలా నిన్ను చేరి'. మారేష్ శివన్ దర్శకత్వంలో కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. ఈ సినిమా ట్రైలర్ ఆవిష్కరణ వేడుకకి అతిథిగా హాజరైన దర్శకుడు నక్కిన త్రినాథరావు మాట్లాడుతూ- ''మారేష్ అనుభవం ఉన్న దర్శకుడిలా ఈ సినిమా తీశారు'' అన్నారు. ''ఇలాంటి చిత్రాలను ప్రేక్షకులు ప్రోత్సహించాలి'' అన్నారు నిర్మాత బెక్కం వేణుగోపాల్. ''మా సినిమా అందరికీ ఓ మంచి జ్ఞాపకంలా ఉంటుంది'' అన్నారు దినేష్ తేజ్. ''థియేటర్స్ నుంచి వచ్చాక రెండు గంటల పాటు ప్రేక్షకులు ఈ కథ ట్రాన్స్‌లోనే ఉంటారు'' అన్నారు మారేష్ శివన్. ''క్యూట్ లవ్‌స్టోరీ ఫిల్మ్ ఇది. అంతర్లీనంగా సందేశం ఉంది'' అన్నారు కొమ్మాలపాటి సాయి సుధాకర్. ''ఈ సినిమాలో బోల్డ్‌గా నటించా'' అన్నారు పాయల్ రాధాకృష్ణ.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
551	140
65,877	19,671

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	13,365	▽ 169
డోజోన్స్	33,737	▽ 260
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,588	▽ 87
డాక్స్	15,095	▽ 157
షాంఘై	3,059	▽ 25
నికాయ్	32,042	▽ 2

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,840	△ 557
బంగారం (99.5 స్వచ్ఛత)	59,600	△ 554
వెండి (కిలో)	72,197	△ 1,351

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.48	84.15
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	99.79	103.11
€	యూరో	ఎస్‌బీఐ	86.59	89.64
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.82	56.53
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.04	54.33
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.93	61.87
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.25	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.77	23.56
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.26	12.33

ఇండస్‌ఇండ్ లాభం జూమ్

క్యూ2లో రూ. 2,202 కోట్లు

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ బ్యాంక్ ఇండస్‌ఇండ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 22 శాతం ఎగసి రూ. 2,202 కోట్లను తాకింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 1,805 కోట్లు ఆర్జించింది. మొండిబకాయిలు తగ్గడం, వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 10,719 కోట్ల నుంచి రూ. 13,530 కోట్లకు జంప్ చేసింది. నికర వడ్డీ ఆదాయం 18 శాతం పుంజుకుని రూ. 5,077 కోట్లయ్యింది. నికర వడ్డీ మార్జిన్లు 4.24 శాతం నుంచి 4.29 శాతానికి స్వల్పంగా మెరుగుపడ్డాయి. ఇతర ఆదాయం రూ. 2,011 కోట్ల నుంచి రూ. 2,282 కోట్లకు బలపడింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.11 శాతం నుంచి 1.93 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 0.61 శాతం నుంచి 0.57 శాతానికి నీరసించాయి. ప్రొవిజన్లు రూ. 1,141 కోట్ల నుంచి రూ. 974 కోట్లకు తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 18.21 శాతంగా నమోదైంది. ఈ కాలంలో 3,500 మంది ఉద్యోగులను విధుల్లోకి తీసుకున్నట్లు బ్యాంక్ వెల్లడించింది.



ఫలితాల నేపథ్యంలో ఇండస్‌ఇండ్ షేరు 1% నష్టంతో రూ. 1,421 వద్ద ముగిసింది.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఫలితాలు బాగున్నాయ్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 2023–24 రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. క్యూ2లో నికర లాభం 72% జంప్‌చేసి రూ. 920 కోట్లను తాకింది. వడ్డీ ఆదాయం పుంజుకోవడం, మొండి రుణాలు తగ్గడం ఇందుకు సహకరించింది. నిర్వహణ లాభం 31% బలపడి రూ. 1,920 కోట్లకు చేరినట్లు బ్యాంక్ ఎండీ ఏఎస్ రాజీవ్ పేర్కొన్నారు. బ్యాంక్ మొత్తం ఆదాయం రూ. 4,317 కోట్ల నుంచి రూ. 5,796 కోట్లకు పుంజుకుంది. స్థూల మొండిబకాయిలు 3.4% నుంచి 2.19%కి తగ్గాయి.



విప్రో లాభం ఫ్లాట్

న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం విప్రో లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం నామమాత్ర వృద్ధితో రూ. 2,667 కోట్లను తాకింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 2,649 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం నామమాత్ర క్షీణతతో రూ. 22,516 కోట్లకు పరిమితమైంది. గత క్యూ2లో రూ. 22,540 కోట్ల టర్నోవర్ ప్రకటించింది. ఐదు అనుబంధ సంస్థలను కంపెనీలో విలీనం చేసుకునేందుకు బోర్డు అనుమతించినట్లు విప్రో తాజాగా వెల్లడించింది. వీటిలో విప్రో హెచ్‌ఆర్, ఓవర్‌సీస్ ఐటీ, టెక్నాలజీ ప్రొడక్టు సర్వీసులు, వీఎల్‌ఎస్‌ఐ డిజైన్ సర్వీసులు, విప్రో ట్రేడ్‌మార్క్ హోల్డింగ్ ఉన్నాయి.

గైడెన్స్ వీక్..

ప్రస్తుత త్రైమాసికం(అక్టోబర్–డిసెంబర్)క్యూ3లో ఐటీ సర్వీసుల ఆదాయం 3.5–1.5 శాతం మధ్య క్షీణించవచ్చంటూ విప్రో తాజా అంచనాల(గైడెన్స్)ను ప్రకటించింది. వెరసి కరెన్సీ నిలకడ ప్రాతిపదికన 261.7–267.2 కోట్ల డాలర్ల స్థాయిలో ఆదాయాన్ని ఊహిస్తోంది. అంటే రూ. 21,643–22,097 కోట్ల మధ్య టర్నోవర్‌ను అంచనా కట్టింది. ప్రస్తుత బలహీన ప్రపంచ ఆర్థిక ఔట్‌లుక్ నేపథ్యంలో తాజా గైడెన్స్‌ను ప్రకటించింది.

ఇతర విశేషాలు

- నిర్వహణ మార్జిన్లు నామమాత్ర వృద్ధితో 16.1 శాతానికి చేరాయి.
- 3.78 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులను కుదుర్చుకుంది.
- క్యూ2కల్లా సిబ్బంది సంఖ్య 7 శాతం తగ్గి 2,44,707కు చేరింది.
- ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు గత 6 త్రైమాసికాల్లోనే తక్కువగా 15.5%కి పరిమితమైంది.

అనిశ్చితులు ఉన్నాయ్...

బిజినెస్ వాతావరణం అనిశ్చితిగా ఉన్నట్లు ఫలితాల విడుదల సందర్భంగా విప్రో సీఈవో థియరీ డెలాపోర్ట్ పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లు గరిష్టస్థాయిలలో కొనసాగుతున్నాయని, పెట్టుబడులపట్ల క్లయింట్లు మరింత కఠిన వైఖరిని ప్రదర్శిస్తున్నారని తెలియజేశారు. ప్రస్తుత పెట్టుబడుల గరిష్ట వినియోగంపై దృష్టి పెడుతూనే కొత్త పెట్టుబడులపై వేగవంత రిటర్నులను ఆశిస్తున్నట్లు వివరించారు. విచక్షణా వ్యయాలు, ఆర్డర్లు నెమ్మదిస్తున్నట్లు వెల్లడించారు. ఇది ఆదాయ వృద్ధిపై ప్రభావం చూపుతున్నట్లు తెలియజేశారు. అయితే మార్జిన్లు నిలుపుకుంటున్నట్లు పేర్కొన్నారు.



ఫలితాల నేపథ్యంలో విప్రో షేరు ఎన్‌ఎస్‌ఈలో 1 శాతం నీరసించి రూ. 408 వద్ద ముగిసింది.

బజాజ్ ఆటో లాభం ప్లస్

క్యూ2లో రూ. 2,020 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) రెండో త్రైమాసికంలో ఆటో రంగ దిగ్గజం బజాజ్ ఆటో పటిష్ట ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం దాదాపు 18 శాతం ఎగసి రూ. 2,020 కోట్లను తాకింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 1,719 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 10,537 కోట్ల నుంచి రూ. 11,207 కోట్లకు బలపడింది. అయితే వాహన విక్రయాలు 8% క్షీణించి 10,53,953 యూనిట్లకు పరిమితమయ్యాయి. గత క్యూ2లో 11,51,012 వాహన అమ్మకాలు నమోదయ్యాయి. వీటిలో దేశీ విక్రయాలు 19% తక్కువగా 5,05,320కు పరిమితంకాగా.. ఎగుమతులు 5% నీరసించి 3,76,263 యూనిట్లకు చేరాయి. ఇక త్రిచక్ర వాహన విక్రయాలు మాత్రం 31% జంప్‌చేసి 1,72,370కు చేరాయి.

ఫలితాల నేపథ్యంలో బజాజ్ ఆటో షేరు ఫ్లాట్‌గా రూ. 5,144 వద్ద ముగిసింది.

లాభాలు ఒకరోజుకే పరిమితం

- బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లలో భారీ అమ్మకాలు
- బలహీన అంతర్జాతీయ సంకేతాల ప్రభావం
- మళ్లీ 66 వేల స్థాయి దిగువకు సెన్సెక్స్
- నిఫ్టీకి 140 పాయింట్ల నష్టం

ముంబై: దేశీయ స్టాక్ సూచీల లాభాలు ఒక్కరోజుకే పరిమితమయ్యాయి. బలహీన జాతీయ అంతర్జాతీయ సంకేతాలతో బుధవారం సెన్సెక్స్, నిఫ్టీలు ఒకశాతం మేర నష్టపోయాయి. మార్జిన్ల క్షీణత ఆందోళనలతో బ్యాంకింగ్, ఫైనాన్స్ కంపెనీల షేర్లలో పెద్ద ఎత్తున అమ్మకాలు నెలకొన్నాయి. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ద్వయం, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు 3–1% క్షీణించి సూచీల పతనాన్ని శాసించాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరల అనూహ్య పెరుగుదల, అమెరికా వడ్డీ రేట్ల పెంపు అంచనాల భయాలు, పశ్చిమాసియా దేశాల్లోని యుద్ధ పరిస్థితుల పరిణామాలు ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. ఫలితంగా బుధవారం సెన్సెక్స్ 551 పాయింట్లు నష్టపోయి 66 వేల స్థాయి దిగువన 65,877 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 140 పాయింట్లు నష్టపోయి 19,671 వద్ద నిలిచింది. ఉదయం స్వల్పలాభాలతో మొదలైన సూచీలు వెంటనే నష్టాల్లోకి మళ్లాయి.



ఫార్మా, ఆటో షేర్లు మినహా అన్ని రంగాల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో సూచీలు ఏ దశలో కోలుకోలేదు. ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 586 పాయింట్లు క్షీణించి 65,842 వద్ద, నిఫ్టీ 151 పాయింట్లు పతనమై 19,660 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.85%, 0.32% చొప్పున నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,832 కోట్ల ఈక్విటీ షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,470 కోట్ల షేర్లను కొన్నారు. ఆసియా, యూరప్ మార్కెట్లు అరశాతం నుంచి ఒకశాతం నష్టపోయాయి. కాగా అమెరికా మార్కెట్లు అరశాతానికి పైగా నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

''బలహీన అంతర్జాతీయ సంకేతాలు, పశ్చిమాసియా దేశాల్లోని అనిశ్చిత పరిణామాలు దేశీయ మార్కెట్లో లాభాల స్వీకరణకు పురిగొల్పాయి. క్రూడాయిల్ ధరలు ఒక్కసారిగా పెరగడంతో ఉద్రిక్తతలు మరింత ఎక్కువయ్యాయి. ఫెడ్ చైర్మన్ ప్రసంగానికి ముందు ఎఫ్ఐఐలు అప్రమత్తత వహిస్తూ అమ్మకాలకు పాల్పడ్డారు. దేశీయ ఐటీ, ఫైనాన్స్ రంగ కంపెనీల క్యూ2 ఆర్థిక ఫలితాలు మెప్పించకపోవడం ఇన్వెస్టర్లను మరింత నిరాశపరిచింది'' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రిటైల్ రీసెర్చ్ హెడ్ దీపక్ జెసానీ తెలిపారు.

- సెప్టెంబర్ క్వార్టర్‌లో నికరలాభం 28% క్షీణించడంతో బీఎస్‌ఈలో బజాజ్ ఫైనాన్స్ షేరు 3% నష్టపోయి రూ.7,871 వద్ద స్థిరపడింది. ఫలితంగా కంపెనీ ఒక్కరోజులో రూ.13,345 కోట్ల మార్కెట్ విలువను కోల్పోయింది.
- యాజమాన్యం ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు ఆదాయ వృద్ధి అంచనాలు తగ్గించడంతో ఎల్ అండ్‌టీ టెక్నాలజీ సర్వీసెస్ షేరు 6% క్షీణించి రూ.4,354 వద్ద స్థిరపడింది.
- జెన్సార్ టెక్నాలజీ క్యూ2 ఆర్థిక ఫలితాలు నిరాశపరడంతో కంపెనీ 6% నష్టపోయి రూ. 517 వద్ద స్థిరపడింది.
- సెన్సెక్స్ సూచీలోని 30 షేర్లకు గానూ టాటా మోటార్స్ 2%, సన్ ఫార్మా 1.50%, మారుతీ 0.50% షేర్లు మాత్రమే లాభపడ్డాయి. సూచీ ఒకశాతం పతనంతో ఇన్వెస్టర్లకు ఒక్కరోజులో రూ.2.42 లక్షల కోట్ల నష్టంవాటిల్లింది. బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.321.40 లక్షల కోట్లకు దిగివచ్చింది.

ఏపీలో కోరమాండల్ ప్లాంటు ప్రారంభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎరువుల తయారీలో ఉన్న కోరమాండల్ ఇంటర్నేషనల్ ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా నెలకొల్పిన సల్ఫ్యూరిక్ యాసిడ్ ప్లాంటులో ఉత్పత్తి కార్యకలాపాలను ప్రారంభించింది. విశాఖపట్నం వద్ద ఉన్న కంపెనీకి చెందిన ఫెర్టిలైజర్ కాంప్లెక్స్‌లో రూ.400 కోట్ల పెట్టుబడితో ఈ కేంద్రాన్ని స్థాపించారు. ప్లాంటు ఉత్పత్తి సామర్థ్యం రోజుకు 1,650 మెట్రిక్ టన్నులని కోరమాండల్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అరుణ్ అలగప్పన్ బుధవారం వెల్లడించారు. నూతన కేంద్రం చేరికతో సంస్థ సల్ఫ్యూరిక్ యాసిడ్ తయారీ సామర్థ్యం ఏటా 6 లక్షల టన్నుల నుంచి 11 లక్షల టన్నులకు చేరిందని పేర్కొన్నారు. .

లాట్ దసరా సంబరాలు

హైదరాబాద్: దసరా సంబరాలను లాట్‌తో జరుపుకోవాలని మల్టీ బ్రాండ్ రిటైల్ చైన్ లాట్ మొబైల్స్ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా కస్టమర్లకు ఆఫర్లు ప్రకటించింది. స్మార్ట్‌ఫోన్, స్మార్ట్ టీవీ, ఏసీ, ల్యాప్‌టాప్ కొనుగోళ్లపై కచ్చితమైన బహుమతితో పాటు రూ.10వేల వరకు క్యాష్‌బ్యాక్ ఆఫర్‌ను అందిస్తుంది. బ్రాండెడ్ యాక్సెసరీలు, ఇతర వస్తువులపై 60% వరకు తక్షణ తగ్గింపు ఇస్తుంది. జీరో డౌన్ పేమెంట్ కూడిన రుణ సదుపాయాన్ని ఏడాది కాల వ్యవధితో జీరో కాస్ట్, నో కాస్ట్ ఈఎంఐ సదుపాయాన్ని అందిస్తుంది. ఆఫర్ల అవకాశాన్ని కస్టమర్లంతా వినియోగించుకోవాలని కంపెనీ డైరెక్టర్ ఎం.అఖిల్ కోరారు.



బీ న్యూ దసరా ఆఫర్లు

హైదరాబాద్: దసరా పండుగకి 'బీ న్యూ' ఆఫర్లు ప్రకటించింది. స్మార్ట్ ఫోన్ కొనుగోలుపై రూ.15వేల వరకు క్యాష్‌బ్యాక్‌తో పాటు రూ.6,999 వరకు కచ్చితమైన బహుమతి ఇస్తామని సంస్థ సీఈఓ వై.సాయి నిఖిలేష్ తెలిపారు. స్మార్ట్‌టీవీ కొనుగోలుపై రూ.17,999 విలువైన సౌండ్ బార్‌ను రూ.5,999లకే ఇస్తామన్నారు. ఐఫోన్ల కొనుగోలుపై రూ.24వేల వరకు తగ్గింపు ఉందన్నారు. బ్రాండెడ్ యాక్సెసరీస్‌పై 70% వరకు రాయితీ అందిస్తామన్నారు. బజాజ్ ఫైనాన్స్ ద్వారా కొనుగోలుపై రూ. 11వేల వరకు, ఎస్‌బీఐ కార్డుతో రూ.6వేల వరకు, ఐసీఐసీఐ కార్డుతో రూ.5వేల వరకు క్యాష్‌బ్యాక్ లభిస్తుందన్నారు. సిబిల్ స్కోర్, పాన్ కార్డు లేకుండానే ఫైనాన్స్‌పై మొబైల్స్, స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లను కొనుగోలు చేయొచ్చని చెప్పారు.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.



భద్రతా ఏర్పాట్ల పరిశీలన

భవానీపురం: ఇందిరాగాంధీ స్టేడియంలో ఈ నెల 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరగనుంది. అక్కడి భద్రతా ఏర్పాట్లను సీపీ టి.కె.రాణా బుధవారం పరిశీలించారు.



పోలీస్ శాఖ పనితీరు సంతృప్తికరం

కేసుల పరిష్కారంలో కృష్ణాజిల్లా పోలీసు శాఖ మెరుగైన ఫలితాలు సాధించటం అభినందనీయమని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. –IIలో▸



సమస్యకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

ఉయ్యూరు: సమస్యకు శాశ్వత పరిష్కారమే 'జగనన్నకు చెబుదాం' లక్ష్యమని కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు అన్నారు. ఉయ్యూరులో జరిగిన కార్యక్ర మంలో ఆయన పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

క్రీడల్లో రాణించిన వైద్య విద్యార్థులు



లబ్బీపేట(విజయవాడతూర్పు): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వ విద్యాలయం 23వ అంతర్ కళాశాలల మహిళా క్రీడా పోటీలు ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకూ రాజమండ్రిలోని జి.ఎస్.ఎల్.మెడికల్ కళాశాలలో జరిగాయి. చెస్, బాస్కెట్ బాల్, బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజయవాడలోని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల విద్యార్థులు రజత పతకాలు సాధించారు. వారిని ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ బుధవారం కళాశాలలో అభినందించారు. చెస్‌లో హౌస్ సర్జన్లు వి.మధుప్రియ (కెప్టెన్), ఎం.కైవల్య, వి.సౌమిక, బాల్‌బ్యాడ్మింటన్ టీమ్‌లో ఎ.ప్రవల్లిక (కెప్టెన్), ఎం.కైవల్య జి.గౌరిశ్రీ, ఎం.శివ జ్యోత్స్న, జి.నీలోత్పల, పి.వి.స్నిగ్ధ, కె.సుగమ్య, బాస్కెట్‌బాల్ టీమ్‌లో సీహెచ్.మోహనశ్రీ, ఎం.కైవల్య, వై.నేహ, జి.కీర్తి, వై.విదార్థి, ఎం.గ్లాడీ, కె.తేజశ్వి, వై.నవ్య, రుష్మిత సురేష్ సత్తాచాటారు. వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఆర్.నాగేశ్వర రావు, డాక్టర్ కె.ఇందిరాదేవి, కళాశాల ఫ్రిజికల్ డైరెక్టర్ జె.రాములు తదితరులు పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

'బొండా'కు ఇన్‌ఫ్లుయెన్షియల్ ఇండియన్ అవార్డ్ ప్రదానం



భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ బొండా జగన్‌మోహన్ రావుకు తాజాగా ప్రతిష్ఠాత్మక ఇన్‌ఫ్లుయెన్షియల్ ఇండియన్ అవార్డ్ – 2023 (మ్యాన్ ఆఫ్ ఎక్స్‌లెన్స్) లభించింది. న్యూ ఢిల్లీకి చెందిన క్రేజీ టేల్స్ సంస్థ విజయవాడ భవానీపురం హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన గిరిజన గీత శిల్పి బొండా జగన్‌మోహన్‌రావుకు ఈ అవార్డ్ అందజేసింది. ఆ సంస్థ ప్రచురించిన ఇన్‌ఫ్లుయన్షియల్ ఇండియన్స్ పుస్తకంలో బొండా జీవిత చరిత్రకు చోటు కల్పించింది. పోస్ట్ ద్వారా అవార్డ్, పుస్తకాన్ని జగన్‌మోహన్‌రావు బుధవారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విభిన్న వర్గాల వారి సామాజిక జీవన విధానాలపై చిత్రాలను గీయడం ద్వారా వారి అభ్యున్నతికి కృషి చేశానని తెలిపారు. తనను ఎంతగానో కదిలించిన గిరిజనుల జీవితాలను అధ్యయనం చేసి వారిపై చిత్రాలను చిత్రించానని పేర్కొన్నారు. నాగరిక ప్రపంచానికి దూరంగా కొండ, కోనల్లో నివసిస్తున్న గిరిజనులకు కూడా విద్య, వైద్యం, సమాజంలో గౌరవం దక్కాలనే ఆశయంతో ట్రైబల్ లైఫ్‌ను ఎంచుకుని వారిపై చిత్రాలు రూపొందిస్తున్నానని వివరించారు.

ఇస్రో వర్క్‌షాప్‌లో కృష్ణా వర్సిటీ విద్యార్థులు



కోనేరుసెంటర్(మచిలీపట్నం): భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) నిర్వహించిన వర్క్‌షాప్‌లో కృష్ణా విశ్వవిద్యాలయం విద్యార్థులు పాల్గొన్నారు. స్పేస్ సిచ్యుయేషనల్ అవేర్నెస్, స్పేస్ ట్రాఫిక్ మేనేజ్ మెంట్ అంశంపై ఇస్రో ప్రధాన కార్యాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమంలో విశ్వవిద్యాలయ భౌతికశాస్త్ర విభాగం విద్యార్థులు నలుగురు పాల్గొన్నారు. ఇందు కోసం ఇస్రో సంస్థ ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షకు రెండు వేల మంది హాజరయ్యారు. వారిలో 200 మంది విద్యార్థులను ఇస్రో సంస్థ ఎంపిక చేయగా అందులో కృష్ణా విశ్వవిద్యాలయం నుంచి కె.ప్రజ్ఞ, ఎం.జ్యోత్స్న, ఎం.ఎల్.షర్మిల, ఎస్.ఎన్.సునిత చోటు దక్కించుకున్నారు. నలుగురు విద్యార్థును విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణి బుధవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో భౌతికశాస్త్ర విభాగం సహాయ ఆచార్యులు డాక్టర్ సల్మా బేగం తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు నాలుగో రోజు రూ.29.30 లక్షల ఆదాయం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మకు దసరా ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన బుధవారం వివిధ మార్గాల ద్వారా రూ.29,30,511 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎస్.రామారావు తెలిపారు. రూ.500 టికెట్ల విక్రయం ద్వారా రూ.11.75 లక్షలు, రూ.300 టికెట్ల ద్వారా రూ.3.75 లక్షలు, రూ.100 టికెట్ల ద్వారా రూ.3.67 లక్షల చొప్పున ఆదాయం వచ్చింది. కేశఖండన టికెట్లు, లడ్డూ ప్రసాదాలు, ఇతర మార్గాల్లో మిగిలిన ఆదాయం లభించింది.



భరతనాట్యం చేస్తున్న లక్ష్మీవసుంధర

విద్యుత్ దీపాల వెలుగులో ఇంద్రకీలాద్రి (ఇన్‌సెట్) మహాలక్ష్మి అలంకరణలో కనకదుర్గమ్మ

మహాలక్ష్మీ.. అమృత స్వరూపిణి

లోక స్థితికారిణిగా ధన, ధాన్య, ధైర్య, విజయ, విద్య, సౌభాగ్య, సంతాన, గజ లక్ష్ములుగా వరాలు ప్రసాదించే అష్టలక్ష్మి సమష్టిరూపమైన అమృత స్వరూపిణిగా కనకదుర్గమ్మ బుధవారం మహాలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఇంద్రకీలాద్రిపై అమ్మవారి ప్రధాన ఆలయం చుట్టూ అష్టలక్ష్ములు కొలువై ఉన్నారు. శ్రీ మహాలక్ష్మీదేవి అమ్మవారిని దర్శించడం వల్ల ఐశ్వర్యప్రాప్తి, విజయం లభిస్తాయని భక్తుల నమ్మకం. శ్రీ దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా మహాలక్ష్మి అలంకారంలో జగన్మాతను భక్తులు దర్శించుకుని తరించారు.

- మహాలక్ష్మిగా దుర్గమ్మ దర్శనం
- అమ్మవారి సేవలో పలువురు ప్రముఖులు
- మూలా నక్షత్రం ఏర్పాట్ల పరిశీలన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంపై జరుగుతున్న శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో నాలుగో రోజైన బుధవారం కనకదుర్గ అమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహాలక్ష్మీదేవి అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. సర్వ దర్శనంతో పాటు రూ.100, రూ.300, రూ.500 టికెట్‌ల క్యూలైన్‌లో భక్తులు బారులుతీరి కనిపించారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు అమ్మవారి దర్శనం ప్రారంభ మవగా రాత్రి 11 గంటల వరకు కొనసాగింది. తెల్లవారుజామున రద్దీ అధికంగా కనిపిం చింది. ఉదయం ఏడు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు రద్దీ ఓ మోస్తరుగా ఉంది. మరో వైపు వీఐపీలను సైతం టికెట్లు ఉంటేనే కొండపైకి అనుమతించారు. అమ్మ వారికి నిర్వహించిన ప్రత్యేక కుంకుమార్చన తొలి షిఫ్టులో 146 మంది, రెండో షిఫ్టులో 107 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రత్యేక ఖడ్గ మాలార్చన, ప్రత్యేక చండీ హోమం, ప్రత్యేక శ్రీచక్ర నవార్చనలోనూ ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. ప్రత్యేక ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయదాతలను అదనపు క్యూలైన్ ద్వారా అమ్మ వారి దర్శనానికి అనుమతించారు. సాయంత్రం అమ్మవారికి నిర్వహించిన పంచహారతుల సేవలోనూ పలువురు ప్రముఖులు, ఆలయ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మూలా నక్షత్రం ఏర్పాట్లపై సమీక్ష

అమ్మవారి ఆలయానికి చేరుకున్న దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఆనంతరం మూలా నక్షత్రం ఏర్పాట్లపై మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, సీపీ టి.కె. రాణా, ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ కె.ఎస్.రామారావు సమీక్ష నిర్వహించారు. అంతరాలయంతోపాటు ఆలయ పరిసరాల్లో తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు.

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

మహాలక్ష్మీదేవి అలంకారంలో దుర్గమ్మను బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. దేవదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.కరికాలవలవన్, దేవదాయ శాఖ కమిషనర్ శ్రీరాము సత్యనారాయణ, ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం ప్రముఖులకు ఫెస్టివల్ ఆఫీసర్ ఆజాద్, ఆలయ అధికారులు, అర్చకులు ప్రసాదాలను అందజేశారు.



అన్నప్రసాదం స్వీకరిస్తున్న మంత్రి సత్యనారాయణ, కలెక్టర్ ఢిల్లీరావు. చిత్రంలో ఈఓ రామారావు



లడ్డూ ప్రసాదాన్ని సిద్ధం చేస్తున్న కార్మికులు

కనులపండువగా నగరోత్సవం



దసరా ఉత్సవాల్లో భాగంగా శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల నగరోత్సవం బుధవారం సాయంత్రం కనుల పండువగా జరిగింది. మల్లికార్జున స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాల వద్ద శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఊరేగింపు ప్రారంభమైంది. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భక్త జనుల కోలాట నృత్యాల నడుమ నగరోత్సవం కొనసాగింది. కేరళ వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహా మండపం, కనకదుర్గనగర్, రథం సెంటర్, వినాయకుడి గుడి మీదగా ఘాట్ రోడ్డు నుంచి ఊరేగింపు తిరిగి అమ్మవారి ఆలయానికి చేరుకుంది. ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఊరేగింపులో పెద్ద ఎత్తున భక్తులు, ఉభయదాతలు పాల్గొన్నారు.

దుర్గగుడిపై నేడు

- తెల్లవారు జామున నాలుగు గంటలకు అమ్మవారి దర్శనం ప్రారంభం
- ఉదయం ఐదు గంటల నుంచి ప్రత్యేక ఖడ్గమాలార్చన
- ఉదయం ఏడు, పది గంటలకు ప్రత్యేక కుంకుమార్చన
- ఉదయం ఎనిమిది గంటలకు ప్రత్యేక శ్రీచక్ర నవార్చన
- ఉదయం ఎనిమిది గంటలకు ప్రత్యేక చండీహోమం
- సాయంత్రం ఆరు గంటలకు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల నగరోత్సవం
- సాయంత్రం 6.30 నుంచి 7.30 గంటల వరకు అమ్మవారికి మహానివేదన, పంచ హారతులు, వేద స్వస్తి
- రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనం



నేటి అలంకారం శ్రీమహా చండీదేవి

శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో అమ్మవారు గురువారం శ్రీమహా చండీ దేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. దేవతల కార్యసిద్ధి, దుష్టశిక్షణ, శిష్ట రక్షణ కోసం మహాలక్ష్మి, మహాకాళి, మహా సరస్వతి త్రిశక్తి స్వరూపిణిగా శ్రీమహా చండీ అమ్మవారు ఉద్భవించారు. శ్రీచండీ అమ్మవారిలో అనేక మంది దేవతలు కొలువై ఉన్నారు. శ్రీ మహా చండీ అమ్మవారిని ప్రార్థిస్తే సర్వదేవతలను ప్రార్థించినట్లే. అమ్మవారి అనుగ్రహం వల్ల విద్య, కీర్తి, సంపదలు లభించి శత్రువులు మిత్రులుగా మారటం, ఏ కోరికలతో ప్రార్థిస్తామో అవన్నీ సత్వరమే లభిస్తాయి.

మూలా నక్షత్రం రోజు వీఐపీ దర్శనాలు రద్దు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20వ తేదీన దుర్గమ్మ సన్నిధిలో మూలానక్షత్రం పర్వదినాన్ని పురస్కరించుకొని ఎటువంటి వీఐపీ దర్శనాలు ఉండవని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ప్రకటించారు. అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం రోజు రాష్ట్ర నలుమూలల నుంచి దాదాపు రెండున్నర లక్షల మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం తరలి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆ రోజు వీఐపీ అంతరాలయం దర్శనాలను రద్దు చేశామన్నారు. కొండ పైకి ఎటువంటి వాహనాలనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. కేవలం క్యూలైన్ల ద్వారా మాత్రమే భక్తులు అమ్మవారి దర్శనం చేసుకోవాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో ఇబ్బంది పడే వారు వేరే రోజు దర్శనానికి రావాలని కోరారు.

బోధనలో డిజిటల్ ఒరబడి

- రెండో ఏడాది ట్యాబ్‌ల పంపిణీకి చర్యలు
- 8వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు
- ఎన్టీఆర్ జిల్లాలో 14,202, కృష్ణాలో 12,132 మందికి ట్యాబ్‌లు సిద్ధం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): చదువుతోనే విద్యార్థుల బతుకులు మారతాయన్న పాలకుల ఆలోచనా విధానం ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విప్లవాన్ని తీసుకొచ్చింది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించుకుని ప్రపంచస్థాయిలో పోటీ పడేలా రాష్ట్రంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది. దీనికోసం బైజూస్ కంటెంట్‌తో ఇన్‌స్టాల్ చేసిన ట్యాబ్‌లను రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని ఎనిమిదో తరగతి విద్యార్థులకు, వారికి పాఠాలు బోధించే ఉపాధ్యాయులకు అందజేస్తోంది. వరుసగా రెండో ఏడాది ట్యాబ్‌ల పంపిణీకి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 2023–24 విద్యాసంవత్సరానికి సుమారు 26, 334 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఇవ్వనుంది.

వరుసగా రెండో ఏడాది

ఏపీ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్యాభ్యాసం జరగాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావిస్తున్నారు. దీనిలో భాగంగా గతేడాది తొలిసారిగా విద్యార్థులకు ట్యాబ్‌లను అందించారు. గత ఏడాది (2022–2023) కృష్ణా జిల్లాలో 12,620 మంది విద్యార్థులకు, సుమారు 2,269 మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను అందించారు. రెండో ఏడాది ఈ విద్యా సంవత్సరానికి (2023–2024) సంబంధించి కృష్ణా జిల్లాలో 25 మండలాలకు చెందిన 12,137 మంది విద్యార్థులకు, 2,270 మంది ఉపాధ్యాయులకు అందించడానికి నివేదికలను సిద్ధం చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో గత ఏడాది 17 మండలాల్లోని 14,048 మంది విద్యార్థులకు, 2,320 మంది ఉపాధ్యాయులకు అందించారు. ప్రస్తుత (2023–2024) విద్యా సంవత్సరానికి సంబంధించి 14,202 మంది విద్యార్థులకు, 2,321 మంది ఉపాధ్యాయులకు అందించాలని నివేదికలను పంపించారు.



ట్యాబ్‌లను వినియోగిస్తున్న విద్యార్థులు (ఫైల్)

ట్యాబ్‌ల్లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్

ప్రభుత్వం విద్యార్థులకు పంపిణీ చేసిన ట్యాబ్‌లలో యూట్యూబ్, కెమెరా, ఇతర యాప్‌లు ఓపెన్ కాకుండా ప్రభుత్వం టిక్టోరో అనే సాఫ్ట్‌వేర్ కంపెనీ సాయంతో ప్రత్యేక చర్యలు తీసుకుంది. మూడు యాప్‌ల (వైఫై, బైజూస్, డిక్షనరీ)ను అందుబాటులో ఉంచింది. అప్‌డేట్ చేయడానికి ఎంఆర్‌సీ సిబ్బంది, సీఆర్పీలకు, పాఠశాల హెచ్ఎంలు, యాక్టివ్ టీచర్లు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చి పాఠశాల స్థాయిలోనే అప్‌డేట్ చేస్తున్నారు.

విద్యాశాఖ పర్యవేక్షణ

విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌లు దుర్వినియోగం కాకుండా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. డీఈఓ, డెప్యూటీ డీఈఓ, ఎంఈఓ, హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయులకు పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు ప్రతినెలా కనీసం ఒక్కసారి ప్రతి పాఠశాలను సందర్శించి వాటి పనితీరును పరిశీలించాలి.

ట్యాబ్‌ల్లో సమస్యలు తలెత్తితే..

ట్యాబ్‌ల్లో సమస్యలు వచ్చినప్పుడు వాటిని సత్వరం పరిష్కరించడానికి పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్దిష్టమైన నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. పాఠశాల స్థాయిలో ప్రధానోపాధ్యాయులు, అడాప్టెడ్ టీచర్, యాక్టివ్ టీచర్, మండల స్థాయిలోనూ నిర్దిష్టంగా బాధ్యతలు అప్పగించారు. ట్యాబ్‌ల పర్యవేక్షణ, సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో నోడల్ ఆఫీసర్‌కు బాధ్యతలు అప్పగించారు.

ప్రతిష్ఠాత్మకంగా నిర్వహణ



రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ప్రభుత్వం దూరదృష్టితో ఆలోచించి ఖర్చుకు వెనుకాడకుండా విద్యార్థులకు ఉపయోగపడేలా బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను అందజేస్తోంది.

–సి.వి.రేణుక, డీఈఓ, ఎన్టీఆర్ జిల్లా


ట్యాబ్‌లను సిద్ధం చేస్తున్నాం



ఎన్టీఆర్ జిల్లాలో 17 మండలాలు ఉన్నాయి. వీటిలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులందరికీ ట్యాబ్‌లు పంపిణీ చేయడానికి చర్యలు చేపట్టాం. ప్రస్తుతం విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు సేకరించాం. త్వరలోనే ట్యాబ్‌లు అందజేస్తాం.

–షేక్ సైదా సాహెబ్, బైజూస్ నోడల్ అధికారి, ఎన్టీఆర్ జిల్లా

విద్యార్థుల వివరాలను పంపించాం



కృష్ణా జిల్లాలోని 25 మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులు, టీచర్ల వివరాలను ప్రభుత్వానికి పంపించాం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అతి త్వరలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తాం.

– ఎండీ దావూద్, బైజూస్ నోడల్ అధికారి, కృష్ణా జిల్లా

20, 21 తేదీల్లో కేఎల్‌యూలో జాతీయ సాంకేతిక సదస్సు



'సమ్యక్' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వర్సిటీ బాధ్యులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించే లక్ష్యంతో కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం సమ్యక్ ఈ నెల 20,21 తేదీలలో వడ్డేశ్వరంలోని గ్రీన్ ఫీల్డ్ క్యాంపస్‌లో జరుగుతుందని వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ తెలిపారు. విజయవాడ మ్యూజియం రోడ్డులోని కేఎల్ పరిపాలన కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సాంకేతిక సదస్సుకు దేశవ్యాప్తంగా ఆయా కళాశాలలు, యూనివర్సిటీలకు చెందిన 15 వేల మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకున్నారని పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సదస్సులు, విద్యార్థుల ప్రదర్శనలతో రెండు రోజుల పాటు ఈ సదస్సు పండుగలా సాగుతుందన్నారు. సమ్యక్‌కు చైర్మన్‌లుగా డాక్టర్ ఎ.శ్రీనాథ్, డాక్టర్ బి.జయకుమార్ సింగ్, కన్వీనర్‌లుగా డాక్టర్ ఎం.సుమన్, డాక్టర్ టి.పవన్‌కుమార్, డాక్టర్ అమరేంద్ర, డాక్టర్ పి.వెంకటేశ్వర్లు వ్యవహరిస్తారని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ మాట్లాడుతూ.. కేఎల్ విద్యార్థుల ప్రజ్ఞ, పాటవాలకు సమ్యక్ సదస్సు నిదర్శనమన్నారు. సమ్యక్ నిర్వహిస్తున్న కేఎల్‌యూ విద్యార్థుల కమిటీసభ్యుడు వినయ్ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ విద్యార్థులందరూ ఒకే వేదిక మీద జరుపుకొనే సాంకేతిక పండుగ సమ్యక్ అని వివరించారు. డాక్టర్ ఎ.వి.ఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, చరిష్మ, ఆశ్రిత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నవంబర్‌లో దుర్గగుడి అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవంబర్‌లో శంకుస్థాపన చేస్తారని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. సుమారు రూ. 225 కోట్లతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. అలాగే కృష్ణా పుష్కరాల సమయంలో గత ప్రభుత్వం కూల్చివేసిన ఆలయాలను ప్రస్తుత ప్రభుత్వం పునర్నిర్మించిందని, వాటిని సైతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు.

28, 29 తేదీలలో శ్రీశైలం ప్రాజెక్ట్ ఉన్నత పాఠశాల వజ్రోత్సవం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శ్రీశైలం ప్రాజెక్ట్ ఉన్నత పాఠశాల, ప్రాజెక్ట్ హాస్పిటల్ ప్రారంభించి 60ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 28, 29 తేదీలలో వజ్రోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘం జాయింట్ సెక్రటరీ పీవీ మల్లికార్జున రావు తెలిపారు. బుధవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టు హై స్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకలలో శ్రీశైలం ప్రాజెక్ట్ నందు గతంలో పనిచేసి పదవీ విరమణ పొందిన వారిని సత్కరిస్తామన్నారు. విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ప్రకటనను ఆహ్వానంగా భావించి వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం వజ్రోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుకు 'ఈ-క్రాప్' గొడుగు

- ఎన్టీఆర్ జిల్లాలో నూరు శాతం నమోదు
- కొనసాగుతున్న ఈ-కేవైసీ ధ్రువీకరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రైతులు ఏ పంట సాగుచేశారు? ఎంత విస్తీర్ణంలో సాగు చేశారు? జిల్లాలో ఏయే పంటలు సాగయ్యాయి? గత ప్రభుత్వాల్లో ఈ వివరాలు సక్రమంగా ఉండేవి కాదు. ఒకదానికి ఒకటి పొంతన లేకుండా ఉండేవి. ఏదైనా విపత్తు సంభవిస్తే పంట నష్టం అంచనా వేసే అధికారులు ఎంత విస్తీర్ణం నమోదు చేస్తే అంతే. వాస్తవ సాగుదారుల కంటే పైరవీ కారులకు పరిహారం అందేది. ఇక కౌలు రైతుల పరిస్థితి వేరే చెప్పనక్కర్లేదు. గత ప్రభుత్వాల్లో సాయాన్ని బట్టి ఆయా పంటల విస్తీర్ణం మారిన పరిస్థితులు గమనించాం. ఇదంతా గతం.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక ఈ లెక్కలన్నీ పక్కాగా ఉంటున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ-క్రాప్ బుకింగ్ విధానం తీసుకువచ్చారు. ఈ విధానంలో ప్రతి రైతు తను సాగు చేస్తున్న పంటలు ముందుగానే నమోదు చేసుకోవాలి. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా, చీడపీడలు ఆశించి పంటలు దెబ్బతిన్న రైతుకు పరిహారం అందించేందుకు ఈ విధానంలో లెక్క పక్కాగా తేలుతోంది. పంట నష్టపోతే పరిహారం చెల్లింపుల్లో అవకతవకలు లేకుండా ఉండేందుకు ఈ విధానం దోహదం చేస్తుంది.

నమోదు చేసుకుంటున్నారు..

పంటలకు అవసరమైన ఎరువులు, పంట అమ్మకానికి ఈ-క్రాప్ తప్పనిసరి కావడంతో రైతుల్లో చైతన్యం పెరిగింది. విధిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకుంటున్నారు. ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ ప్రారంభమైన వెంటనే రైతులే తాము సాగు చేస్తున్న పంటల వివరాలు నమోదు చేయించుకుంటున్నారు. వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలు క్షేత్ర స్థాయిలో ప్రతి సర్వే నంబర్‌ను పరిశీలించి రైతులు సాగు చేసిన పంటల వివరాలు నమోదు చేస్తున్నారు. పూర్తి పారదర్శకంగా జాబితాలు కూడా ప్రదర్శిస్తుండడంతో వాస్తవ పంటల అంచనాలు అందుబాటులో ఉంటున్నాయి. ఈ-క్రాప్ రైతులకు అండాదండగా ఉంటుంది. పంట నష్ట పరిహారం నేరుగా రైతులకు ఖాతాలో జమవుతోంది.



ఈ-క్రాప్ నమోదు చేస్తున్న సిబ్బంది

జిల్లాలో నూరు శాతం ఈ-క్రాప్ నమోదు

ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 16 మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1,09,442 మంది రైతులు 3,12,607 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు చేసుకున్నారు. నూరు శాతం ఈ-క్రాప్ నమోదైంది. వీరిలో 93 శాతం మంది రైతులకు ఈ-కేవైసీ ధ్రువీకరణ పూర్తయింది. గతేడాది ఖరీఫ్‌లో 1,30,635 మంది రైతులు 3,56,657 ఎకరాల్లో ఈ-క్రాప్ బుక్ చేసుకున్నారు. అయితే ఈ ఏడాది జగ్గయ్యపేట మండలంలో పంటల సాగు తగ్గింది.

క్షేత్రస్థాయిలో పరిశీలించాకే..



గ్రామ వ్యవసాయ సహాయకుడు, వీఆర్వో క్షేత్రస్థాయిలో పంటలు పరిశీలించారు. అలా పరిశీలించిన తర్వాతే ఈ-క్రాప్ బుక్ చేశారు. గతేడాది మూడెకరాలు పత్తి సాగు చేశా. వివిధ కారణాల చేత పంట దిగుబడి తగ్గింది. ఎకరాకు రూ.914 చొప్పున ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. ఈ-క్రాప్ నమోదు చేసుకోవడంతో నేరుగా నా బ్యాంక్ ఖాతాకే పరిహారం సొమ్ము జమైంది. ఈ-క్రాప్ నమోదు చేసుకోవడం వల్లనే ఇది సాధ్యమైంది.

– శ్రీనివాసరెడ్డి, రైతు, వీరులపాడు

నేటితో ఆఖరు..



జిల్లాలో ఈ-క్రాప్ నమోదు నూరు శాతం పూర్తయ్యింది. ఈ-కేవైసీ ధ్రువీకరణ 93 శాతమే పూర్తయింది. ఈ-క్రాప్ తోపాటు ఈ-కేవైసీ పూర్తయితేనే నష్టం జరిగినపుడు ప్రభుత్వ పరిహారం అందుతుంది. గ్రామాల్లో అందుబాటులో లేని రైతులు వీఏఏను సంప్రదిస్తే ఫోన్ నంబర్‌కు ఓటీపీ పంపుతారు. సొంత గ్రామాలకు రాకుండానే ఈ-కేవైసీ చేయించవచ్చు. ఈనెల 19వ తేదీ అర్ధరాత్రి వరకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

– నాగమణెమ్మ, వ్యవసాయాధికారి, ఎన్టీఆర్ జిల్లా

జిల్లా పోలీస్ శాఖ పనితీరు సంతృప్తికరం

ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్

కోనేరుసెంటర్(మచిలీపట్నం): కేసుల పరిష్కారంలో జిల్లా పోలీసుశాఖ మెరుగైన ఫలితాలు సాధించటం అభినందనీయమని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన జిల్లా ఎస్పీ పి. జాషువాతో కలిసి మచిలీపట్నంలోని దిశ, బందరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లను వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బంది రిజిస్టర్‌ను చూశారు. దిశ స్టేషన్‌లో ఎన్ని కేసులు నమోదు అయ్యాయి? ఇప్పటి వరకు ఎన్ని కేసులను పరిష్కరించారు? వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలువురు బాధితులతో స్వయంగా మాట్లాడి దిశ సిబ్బంది పనితీరు ఏ విధంగా ఉన్నదీ అడిగి తెలుసుకున్నారు. అలాగే స్టేషన్ సిబ్బంది సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సిబ్బంది పలువురు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకురాగా వాటిని సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం బందరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. బందరు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చేపడుతున్న చర్యలపై ఆరా తీశారు. సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

గంజాయి అమ్మకాలను సహించం..

జిల్లాలో గంజాయి అమ్మకాలపై జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నట్లు డీఐజీ చెప్పారు. గంజాయిని అరికట్టటంలో ఎస్పీ చూపుతున్న చొరవ పట్ల ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. జిల్లాలో సైబర్ నేరాలను అరికట్టేందుకు జిల్లా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రతి పోలీస్ స్టేషన్ నుంచి ముగ్గురు సిబ్బందిని ప్రత్యేకంగా నియమించి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.



దిశ సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ జాషువా

2000పైగా కేసులకు పరిష్కారం..

డీజీపీ ఆదేశాల మేరకు హైడ్ అండ్ స్పీడ్ కింద ఏలూరు రేంజ్ పరిధిలో ఇప్పటి వరకు దాదాపు 2000లకుపైగా కేసులను పరిష్కరించామని డీఐజీ అన్నారు. అలాగే శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసుశాఖ నిరంతరం పాటుపడుతున్నట్లు చెప్పారు. జిల్లా అడిషనల్ ఎస్పీ ఆర్. శ్రీహరిబాబు, బందరు డీఎస్పీ వై. మాధవరెడ్డి, దిశ సీఐ ఆర్ రవి కుమార్, ఆర్ఐ చంద్రశేఖర్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

నందిగామలో అగ్ని ప్రమాదం

- నాలుగు ప్లై వుడ్ ఫర్నిచర్ షాపులు అగ్నికి ఆహుతి
- రూ. 70 లక్షలకు పైగా నష్టం అంచనా

నందిగామ: పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో నాలుగు ప్లైవుడ్ ఫర్నిచర్ దుకాణాలు బుధవారం తెల్లవారుజామున అగ్నికి ఆహుతయ్యాయి. ఫైర్ అధికారులు తెలిపిన సమాచారం ప్రకారం పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో పలు ప్లై వుడ్ డోర్స్, డిజైనింగ్ దుకాణాలు ఉన్నాయి. వాటిలోని ఓ దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో మంటలు వ్యాపించాయి. దీంతో నాలుగు దుకాణాలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే నందిగామ, కంచికచర్ల, జగ్గయ్యపేట ఫైర్ ఇంజిన్‌లు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చాయి. ప్లై వుడ్ ఫర్నిచర్ కావడంతో మంటలు త్వరగా వ్యాపించాయని ఫైర్ అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఒకే యజమానికి చెందిన రెండు దుకాణాలు, మరో ఇద్దరు యజమానులకు చెందిన రెండు మొత్తం నాలుగు దుకాణాలు ఉన్నాయి. కాగా ప్రాథమిక అంచనా ప్రకారం నష్టం రూ. 71.90 లక్షలు ఉంటుందని ఫైర్ అధికారి మురళీకృష్ణ తెలిపారు.



మంటలను అదుపులోకి తీసుకువస్తున్న ఫైర్ సిబ్బంది



ఆర్టీసీ డ్రైవర్‌కు ఆరు నెలలు జైలు

గన్నవరం: నిర్లక్ష్యంగా బస్సును నడిపి ఓ ప్రయాణికురాలు తీవ్రంగా గాయపడడానికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్‌కు ఆరు నెలలు జైలుశిక్ష, రూ. 500 జరిమానా విధిస్తూ గన్నవరం 12వ ఏఎంఎం కోర్టు తీర్పు ఇచ్చింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమాచారం మేరకు.. కేసరపల్లికి చెందిన గడ్డం అనురాధ, ఆమె సోదరి అరుణకుమారి 2020 జనవరి 24న ఆర్టీసీ సీఎన్‌సీ బస్సులో గన్నవరం నుంచి గ్రామానికి బయలుదేరారు. కేసరపల్లిలో బస్సు దిగే సమయంలో డ్రైవర్ వాహనాన్ని ముందుకు నడపడంతో అనురాధ కిందపడిపోయింది. అదే సమయంలో బస్సు వెనుక చక్రం ఆమె కుడి కాలుపై ఎక్కడంతో తీవ్రంగా గాయపడింది. ఈ ఘటనపై గన్నవరం పోలీసులు కేసు నమోదు చేయగా విచారణ 12వ ఏఎంఎం కోర్టులో జరిగింది. నేరం రుజువు కావడంతో నిందితుడైన గవర్నర్‌పేట-2 ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ గురివింద ఆనంద్ బాబుకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి. ప్రసన్న తెలిపారు.



భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భర్త పెట్టే వేదింపులు తాళలేక వివాహిత ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి వైఎస్సార్‌కాలనీలోని బ్లాక్ నంబర్ 28కి చెందిన షేక్ నాగుర్‌బీ, మస్తాన్‌వలీలు భార్యాభర్తలు. వీరికి 15 ఏళ్ల కిందట వివాహం కాగా ఇద్దరు ఆడపిల్లలు సంతానం. గత కొంత కాలంగా మస్తాన్ వలీ చెడు వ్యసనాలకు బానిసై భార్యను వేదింపులకు గురి చేయసాగాడు. దీంతో నాగుర్‌బీ మంగళవారం రాత్రి 10.30 గంటల సమయంలో ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేసింది. అయితే నాగూర్‌బీకి వాంతులు కావడంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉంది. దీంతో బాధితురాలు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది.

రైలు పట్టాలపై గుర్తు తెలియని యువకుడి మృతదేహం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కొయ్యూరు రైల్వే గేటు సమీపంలో రైలు ఢీకొనటంతో గుర్తు తెలియని యువకుడు దుర్మరణం చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. రైలు పట్టాలపై యువకుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనాస్థలికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతుని వివరాలను గుర్తించేందుకు యత్నించారు. మృతుని వయస్సు 25 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడి నీలం రంగు పొడవు చేతుల చొక్కా, సిమెంటు రంగు చారలు కలిగిన నీలం రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లుగా రైల్వే పోలీసులు తెలిపారు. రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తూ జారి పడి మృతిచెందాడా? లేదా ఆత్మహత్యకు పాల్పడ్డాడా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ ఘటనపై ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ డి.నరసింహారావు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మృతదేహానికి ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు.

నేషనల్ వాటర్ స్పోర్ట్స్‌కు నాగాయలంక క్రీడాకారులు



నేషనల్ గేమ్స్‌కు ఎంపికైన గాయత్రి, భార్గవి

నాగాయలంక: నాగాయలంక: ఏపీ స్టేట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో కెనోయింగ్ కయాకింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తరఫున 11వ కెనోయ్ స్లాలమ్ నేషనల్స్ ఎంపిక పోటీల్లో పాల్గొన్న నాగాయలంక వాటర్ స్పోర్ట్స్ క్రీడాకారులు సత్తా చాటారు. నాగిడి గాయత్రి రజత పతకం, నాగిడి భార్గవి బ్రాంజ్ మెడల్ సాధించగా వేముల చినబాబు(గుంటూరు జిల్లా తాడేపల్లి) 4వ స్థానం పొందాడు. మధ్య ప్రదేశ్‌లోని భోపాల్ లోయర్ లేక్‌లో 17, 18 తేదీల్లో జరిగిన నేషనల్స్‌లో అసోసియేషన్ నేతృత్వంలో పాల్గొన్న క్రీడాకారుల పతకాలు సాధించి నేషనల్ గేమ్స్‌కు ఎంపికైనట్లు కోచ్ ఎం.శ్రీనివాస్ బుధవారం తెలిపారు. భోపాల్‌లో నిర్వహించిన నేషనల్స్ ఎంపిక పోటీల్లో 20రాష్ట్రాలకు చెందిన వాటర్ స్పోర్ట్స్ క్రీడాకారులు పాల్గొన్నారని, ఇక్కడ విజేతలుగా నిలిచిన వివిధ రాష్ట్రాల అథ్లెటిక్స్ అందరూ గోవాలో నవంబర్ 1 నుంచి 7 వరకు జరిగే 37వ కెనోయ్ స్లాలమ్ నేషనల్ గేమ్స్‌లో పోటీ పడతారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ తరఫున ఎంపికైన వారిని అసోసియేషన్ ప్రెసిడెంట్ బలరామ్ నాయుడు, అడ్వయిజర్ తిప్పిరెడ్డి శివారెడ్డి అభినందించారు.

విజయవాడ బస్టాండ్‌లో రద్దీ

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): దసరా సందర్భంగా కళాశాలలు, పాఠశాలలకు సెలవులు ప్రకటించటంతో విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ కిక్కిరిసింది. సొంతూర్లకు వెళ్లే విద్యార్థులు, దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో రద్దీగా మారింది. దీంతో నిత్యం నడిచే 494 సర్వీసులకు తోడు మరో 92 సర్వీసులు నడుపుతున్నట్లు బస్ స్టేషన్ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బషీర్ అహ్మద్ తెలిపారు.

క్లుప్తంగా

స్మృతి వనం పనుల పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): స్వరాజ్య మైదానంలో అంబేద్కర్ విగ్రహ నిర్మాణం, స్మృతివనం పనులను కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. కారిడార్ చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీ, ఏర్పాటు చేసిన గ్రీనరీని సందర్శించారు. ఖాళీగా ఉన్న ప్రదేశంలో పూర్తి స్థాయిలో గ్రీనరీ పెంపొందించాలని ఉద్యానవన విభాగం అధికారులను ఆదేశించారు. లైటింగ్, గ్రానైట్, పాత్ వే, వాటర్ ఫౌంటైన్, వెహికల్ పార్కింగ్, ల్యాండ్ స్కేపింగ్, గ్రీనరీ, సుందరీకరణ తదితర పనులతో పాటు మ్యూజియం, థియేటర్ సందర్శించి అక్కడ ఎలక్ట్రిసిటీ పనులను శరవేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనులలో ఎలాంటి జాప్యం లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు నిర్వహించాలని సూచించారు. క్వాలిటీ కంట్రోల్, ఏపీఐఐసీ అధికారులు, కేపీసీ ప్రాజెక్ట్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

అదనపు నైపుణ్యాలతో రాణింపు



లబ్బీపేట(విజయవాడతూర్పు): నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులకు సిలబస్‌తో పాటు అదనపు నైపుణ్యాలు, అధునాతన టెక్నాలజీలలో ప్రావీణ్యం అవసరమని ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ సీఈవో డాక్టర్ డీవీ రామకోటిరెడ్డి అన్నారు. నగరంలోని నలంద డిగ్రీ కళాశాలలో అదనపు కోర్సుల సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న వారికి బుధవారం సర్టిఫికెట్‌లు అందచేశారు. రామకోటిరెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఏపీఐటీఏ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు ఇండస్ట్రీలో అవసరాలకు అనుగుణంగా ఉపయోగపడే నైపుణ్యాలు కళాశాలల్లో విద్యార్థులకు నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. అనురాధ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ చంద్రగిరి తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా కూచిపూడి నృత్యాలు



విజయవాడ కల్చరల్: దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం, దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా సాంస్కృతిక మహోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. దేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు తమ ప్రదర్శనల ద్వారా ఆకట్టుకుంటున్నారు. గన్నవరానికి చెందిన వల్లభనేని లక్ష్మీ వసుంధర చేసిన భరతనాట్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జతిస్వరం, పుష్పాంజలి, థిల్లానా అంశాలను ప్రదర్శించింది. నాట్యాచార్యుడు భాగవతుల శ్రీనివాస శర్మ, అన్నమయ్య కీర్తన పలుకుతేనియ తల్లి, రామదాసు కీర్తన ఇదిగో భద్రాద్రి కీర్తనలకు నృత్యాలను అభినయించారు. మంగళగిరికి చెందిన డి.ప్రసన్న, తెనాలికి చెందిన ఎం. లక్ష్మీకార్తీక్, పి.రోహిత, డి.సరస్వతీ గౌరీ, ఆర్.శ్రీనివాసరావు అనుపమ బృందాలు కూచిపూడి సంప్రదాయంలో నృత్యాలు చేశారు. భక్తి సంగీత కార్యక్రమంలో వెంకరమణ, వి.సుకన్య, ఎస్ వైష్ణవి, వైదేహి భక్తి గీతాలను మిసక్‌రాజు అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. సాంస్కృతిక కార్యక్రమాల పర్యవేక్షకుడు సైదా, గంగాధర్, రామకృష్ణ నిర్వహించారు.

గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ స్థలం పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): జక్కంపూడిలో సూయేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ) స్థలంలో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై వెంటనే తనకు నివేదిక ఇవ్వాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. వీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులు, విజయవాడ రూరల్ మండల రెవెన్యూ అధికారుల బృందంతో కలిసి జక్కంపూడిలో పర్యటించి అక్కడ (చెత్త) గార్బేజ్ ట్రాన్స్ ఫర్ స్టేషన్ నిర్మించడానికి ఉన్న పలు సమస్యలను పరిశీలించారు. జక్కంపూడి సూయేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ వద్ద అందుబాటులో ఉన్న రెవెన్యూ స్థలాన్ని నగరపాలక సంస్థ (చెత్త) గార్బేజ్ ట్రాన్స్ ఫర్ స్టేషన్ నిర్మాణం చేపట్టేందుకు కలెక్టర్ నుంచి అనుమతి పొందేందుకు ప్రొసీజర్స్‌ను రూపొందించాలని ఆదేశించారు. టౌన్ సర్వేయర్ ద్వారా కొలతలు వేయించి చుట్టూ ప్రహరీ నిర్మాణం చేసేందుకు, అప్రోచ్ రోడ్డు వేసేందుకు అంచనాలు రూపొందించి తనకు సమర్పించాలని సూచించారు. చీఫ్ ఇంజినీర్ యం.ప్రభాకరరావు, ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఈఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బ్యానర్ల చించివేతపై కేసు

పటమట(విజయవాడతూర్పు): తమ ప్రాంతంలో జరిగిన అభివృద్ధికి కృషి చేసినందుకు సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్‌కు కృతజ్ఞతలుగా బ్యానర్లు ఏర్పాటు చేస్తే ఉద్దేశపూర్వకంగా టీడీపీ నాయకులు వాటిని తొలగించారని రామచంద్రనగర్, కరెన్సీనగర్ వాసులు పటమట సీఐ కాశీనాథ్‌కు ఫిర్యాదు చేశారు. టీడీపీ నాయకులు గద్దె రమేష్, బాబూరావు ఉద్దేశపూర్వకంగా తాము ఏర్పాటు చేసిన బ్యానర్లను చించేశారని పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహాలక్ష్మీ నమోస్తుతే

లబ్బీపేట(విజయవాడతూర్పు): దేవి శరన్నవరాత్రి మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం నాలుగో రోజు అమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమించారు. మహాలక్ష్మీదేవిని దర్శించుకునేందుకు నగరంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు గురు ప్రార్థన, గోపూజ, గణపతిపూజ, రక్షాబంధన, మహాలింగార్చన, సూర్యనమస్కారములు నిర్వహించారు. అదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హోమ గుండాల వద్ద శత చండీ హోమం, రుద్రహోమం, దీక్షాహోమంలో పెద్ద సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు. కుంకుమపూజలో మహిళలు పాల్గొనగా, కళ్యాణం, పల్లకీసేవలో పలువురు భాగస్వాములయ్యారు. సాయంత్రం లలిత సహస్ర పారాయణం, హారతులు, నీరాజన మంత్రపుష్పములు చతుర్వేద స్వస్తివంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలను నిర్వాహక కమిటీ చైర్మన్ మాజీ పార్లమెంటు సభ్యులు గోకరాజు గంగరాజు, కో చైర్మన్ సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీ వైట్ల కృష్ణ ప్రసన్న తదితరులు పర్యవేక్షించారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పలువురు ప్రముఖులకు వారికి అమ్మవారి చిత్రపటాలను బహుమకరించారు.

టిక్కిల్‌రోడ్డులో...

బృందావనకాలనీ టిక్కిల్‌రోడ్డులోని అనంత్ డైమండ్స్ షోరూమ్ వద్ద దసరా మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం శ్రీమహాలక్ష్మీదేవికి పూజలు జరిపి ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో రాకపోకలు సాగించే వెయ్యి మందికి ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో షోరూమ్ అధినేతలు జాస్తి వెంకట భానుప్రసాష్, విష్ణుప్రియలు పాల్గొన్నారు.

మహాలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు

కృష్ణలంక(విజయవాడతూర్పు): దసరా ఉత్సవాల్లో భాగంగా నాల్గో రోజు బుధవారం కృష్ణలంక, మెట్లబజార్‌లోని వాసవీ సేవా సంఘంలో అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయదాతలు అమ్మవారికి సామూహిక కుంకుమ అర్చనలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మానేపల్లి మాణిక్యాలరావు, గొంట్లా రామ్మోహనరావు, కోశాధికారి చందలూరి వెంకట సుబ్బారావు, గౌరవ సలహాదారుడు మట్టా సుబ్బారావు, అడ్డగాళ్ళ రామమూర్తి, చెన్నా లక్ష్మీ వెంకట సుబ్రహ్మణ్యం, గార్లపాటి వెంకట సత్యగురునాధరావు, పచ్చిపులుసు సాయిబాబు తదితరులు పాల్గొన్నారు. రాణిగారితోటలోని మహాశక్తి దేవస్థానంలో అమ్మవారు బుధవారం మహాలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు అధ్వర్యంలో అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు, అభిషేకాలు, హోమం నిర్వహించారు. బస్టాండ్ సమీపంలోని కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తిపీఠం)లో కాళీమాత అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో మహాకాళీ, మహాలక్ష్మీ, మహాసరస్వతీ, లక్ష్మీగణపతి, వీరాంజనేయస్వామి ఉత్సవమూర్తుల పరిక్రమణోత్సవం వైభవంగా జరిగింది. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అమ్మవారిని దర్శించుకున్నారు. విశేష సంఖ్యలో భక్తులో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సంగీత కచేరి, కూచిపూడి నృత్యాలు అలరించాయి. పూజా కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జగదీష్‌కుమార్, పుల్లయ్య, ఆధ్యాత్మిక సలహాదారుడు భారతుల విజయకిరణ్, సూపరింటెండెంట్ మధుసూదనరావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



సిద్ధార్థ ప్రాంగణంలో మహాలక్ష్మి దేవి అలంకారంలో అమ్మవారు



వాసవీ సేవా సంఘంలో మహాలక్ష్మీదేవి అలంకారం



మహాశక్తి దేవస్థానంలో మహాలక్ష్మీదేవి అలంకారం



చలసాని చౌక్‌లో కాత్యాయని దేవి అలంకారంలో అమ్మవారు



ధనకొండపై మహాలక్ష్మి దేవి అలంకారంలో దుర్గాదేవి



లబ్బీపేట వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మహాలక్ష్మిగా..



శివరామ కృష్ణ క్షేత్రంలో మయూరవాహిని కౌమారిగా..



దర్శిపేటలో మహాలక్ష్మి అలంకారంలో రాజరాజేశ్వరి మాత



రామలింగేశ్వరనగర్‌లో ప్రత్యేక పూజలు చేస్తున్న బెల్లం దుర్గ

వైభవంగా దసరా ఉత్సవాలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు):స్థానిక విశాలాంధ్ర రోడ్డులోని చలసాని చౌక్‌లో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని కాత్యాయని దేవిగా అలంకరించి బుధవారం పూజలు నిర్వహించారు. గురువారం దుర్గాదేవిని మహాలక్ష్మీ దేవిగా అలంకరించి పూజలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 7.30 గంటలకు అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహిస్తామని భక్తులు పాల్గొనాల్సిందిగా కోరారు. దుర్గా భవానీ అమ్మ వారి ఆలయం (ధనకొండ)పై దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ధనకొండపై అమ్మవారు మహాలక్ష్మి దేవి అలంకారంలో బుధవారం భక్తుల నుంచి పూజలు అందుకున్నారు. అమ్మవారిని మహాచండీ దేవిగా అలంకరించనున్నారు.

రాజరాజేశ్వరి పీఠంలో....

విజయవాడ కల్చరల్: దసరా మహోత్సవాల సందర్భంగా బుధవారం అమ్మవారిని వివిధ దేవాలయాల్లో మహాలక్ష్మిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వమాతా చారిటబుల్ సంస్థ, కుర్తాళం సిద్ధేశ్వరానంద పీఠం ఆధ్వర్యంలో హనుమాన్‌పేట రాజరాజేశ్వరీ పీఠంలో అమ్మవారిని పార్వతీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. నిడుమోలు రమా సత్యనారాయణ ఆధ్వర్యంలో చండీహోమం, రుద్రహోమం, మహారుద్రాభిషేకం నిర్వహించారు. మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి ఆదేశంలో శివరామకృష్ణ క్షేత్రంలో బాలాత్రిపుర సుందరిని మహాలక్ష్మిగానూ, శారదాంబను ముయూరవాహిని కౌమారిగానూ, మహాలక్ష్మిని గజలక్ష్మిగానూ అలంకరించారు. ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ పర్యవేక్షించారు. లబ్బీపేట శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో శారదామాతను మహాలక్ష్మిగా అలంకరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారికి తోమాల సేవను నిర్వహించారు.

మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు

పటమట(విజయవాడతూర్పు): దర్శిపేటలోని రాజరాజేశ్వరి లలితా పరమేశ్వరి అమ్మవార్ల దేవస్థానంలో బుధవారం అమ్మవారు మహాలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులు రావి అప్పారావు, విజయ దంపతుల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ అర్చన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆవుల నాసరయ్య, ప్రధాన కార్యదర్శి పొత్తంశెట్టి నాగేశ్వరరావు, కోశాధికారి యామా శివన్నారాయణ, తాండవ రంగలక్ష్మీ, ఆకుల వీరయ్య రాజరాజేశ్వరి మహిళ మండలి సభ్యులు పాల్గొన్నారు. 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ రఘు రోడ్డులో కనకదుర్గ సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దసరా ఉత్సవాల్లో బుధవారం విజయవాడ నగర డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈశ్వరరావు, సూర్యనారాయణ, తిరుమలగిరి వెంకన్న నాయుడు, రామకృష్ణ, మాదాసు భాను, కొల్లు కనకదుర్గ, శ్రీనివాస్, ఆంజనేయులు, భవానీలు తదితరులు పాల్గొన్నారు.



సిద్ధార్థ ప్రాంగణంలో మహాలక్ష్మి అమ్మవారి సేవలో మాజీ ఎంపీ గంగరాజు, నారాయణరావు



సిద్ధార్థ ప్రాంగణంలో శత చండీ హోమం నిర్వహిస్తున్న పలువురు ప్రముఖులు



టిక్కిల్‌రోడ్డులో అనంత్ డైమండ్స్ వద్ద ప్రసాదాలు వితరణ చేస్తున్న దృశ్యం



త్రిశక్తి పీఠంలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న దంపతులు



చండీ హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

శరవేగంగా అభివృద్ధి పనులు

22వ డివిజన్‌లో రూ.25 లక్షలతో పనులకు శంకుస్థాపన

కృష్ణలంక(విజయవాడతూర్పు): సంక్షేమం అమలుతో పాటు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజక వర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తెలిపారు. కృష్ణలంక, 22వ డివిజన్‌లో రూ.25 లక్షల ప్రభుత్వ నిధులతో పలు అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మీ మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. నాణ్యతా లోపం లేకుండా త్వరతగతిన పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని చెప్పారు. అవినాష్ మాట్లాడుతూ మాట తప్పని మడమ తిప్పని నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, చెప్పిన ప్రతి మాటను అక్షరాలా నెరవేస్తున్నారని పేర్కొన్నారు.

గతంలో కేవలం శిలాఫలకాలే....

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కేవలం పత్రిక ప్రకటనలకో, శిలాఫలకాల్లో మాత్రమే కనిపించేదని విమర్శించారు. చంద్రబాబు గ్రాఫిక్స్‌తో మభ్యపెట్టారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత శంకుస్థాపనలు చేయడమే కాకుండా త్వరితగతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తున్నామని వెల్లడించారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో తూర్పు నియోజకవర్గంలో ప్రతిరోజు ఎక్కడో ఒక చోట శంకుస్థాపన గానీ, పూర్తయిన పనుల ప్రారంభోత్సవాలు గానీ చేస్తున్నామన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ చరిత్రలో నిలిచిపోయే విధంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలన చేస్తుంటే గత ప్రభుత్వంలో చేసిన అవినీతికి టీడీపీ నాయకులు జైలులో, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 22వ డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి, ఈ చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు జోగారాజు, రమణారెడ్డి, నాగిరెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



భూమిపుజా కార్యక్రమంలో మేయర్ భాగ్యలక్ష్మీ, దేవినేని అవినాష్

జగనన్నకు అండగా నిలబడాలి

7వ డివిజన్‌లో జగనన్న సురక్ష కార్యక్రమంలో దేవినేని అవినాష్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు):రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ మంచి జరిగేలా చూస్తూ కుటుంబ సభ్యుడి మాదిరిగా అందరికీ అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్థానిక 7వ డివిజన్‌లో పరిధిలోని సీఎస్ఐ స్కూల్ గ్రౌండ్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని అవినాష్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో దేవినేని అవినాష్ మాట్లాడుతూ దేశంలో ఎవ్వరూ చేయని విధంగా మన రాష్ట్రంలోనే వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో సుహాసిని, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్ మాధురి, వైఎస్సార్‌సీపీ ఏడో డివిజన్ అధ్యక్షుడు వడ్లమూడి సంపత్, నాయకులు బుర్రి జగజ్జీవన్‌రామ్, కుటుంబరావు, క్లెవ్, సుభాషిణి, సొంగా రాజ్‌కమల్, కత్తుల సంపత్, సుజాత, శంకర్ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం లబ్బీపేట యూపీహెచ్‌సీ పరిధిలోని శ్రీరామనగర్‌లో నిర్వహించారు. ఈ శిబిరంలో గైనకాలజిస్టు డాక్టర్ షర్మిల, జనరల్ మెడిసిన్ నిపుణురాలు డాక్టర్ అనూష, మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ మెబీన్, డాక్టర్ ఉదయ్‌లు పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో 490 మందికి వైద్య పరీక్షలు చేశారు. కాగా జ్వరంతో వచ్చిన వారికి డెంగీ, మలేరియా ర్యాపిడ్ పరీక్షలు చేశారు. బీపీ, షుగర్ పరీక్షలతో పాటు కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. ఈ శిబిరాన్ని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరంలో సైతం ప్రతి సచివాలయానికి ఒక శిబిరం ఏర్పాటు చేస్తుండటంతో ప్రజల చెంతనే మెరుగైన వైద్యం అందుతున్నట్లు తెలిపారు. శిబిరాన్ని తూర్పు నియోజకవర్గ క్లస్టర్ 2 మండల అధ్యక్షులు ఎండీ రిజ్వాన్, 9వ డివిజన్ ఇన్‌చార్జి వల్లూరి ఈశ్వరప్రసాద్ తదితరులు పరిశీలించారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న వారితో మాట్లాడుతున్న దేవినేని అవినాష్



వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు అనూష, మోతీబాబు, మెబీనా తదితరులు







జగన్మాతా... కరుణించమ్మా..

జగన్మాతా..కరుణించమ్మా.. అంటూ భక్తులు మహాలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చిన దుర్గమ్మను బుధవారం దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివస్తున్న భక్తులు ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకొని ఆనందంతో తన్మయత్వం చెందుతున్నారు. పండగ సందడితో కోలాహలంగా మారిన కొండంతా భక్తజన సంద్రంతో నిండిపోయింది. మహిళలు ఆర్జిత సేవల్లో భాగంగా ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ











• ఒకనాటి దసరా
లేదయా మీ దయా మా మీద లేదు

దసరా అంటే సెలవులు.
దసరా అంటే అయ్యవార్లతో పిల్లలు కలిసి వెళ్లి పాడే పాటలు.
దసరా అంటే పగటి వేషాలు. దసరా అంటే బతుకమ్మలు.
దసరా అంటే బొమ్మల కొలువులు.
దసరా అంటే ఊళ్ల నుంచి విచ్చేసే బంధువులు.
జేబు నుంచి తీసి ఇవ్వాల్సిన ఆత్మీయ మామూళ్లు.
దసరా అంటే స్త్రీ, పురుషులకు ఉల్లాసం.
పిల్లలకు ఆటవిడుపు. కాలం చాలా మారింది. నాటి దసరా ఎలా ఉంటుందో
నేటి తరాలకు పదే పదే చెప్పాల్సిన అవసరం ఏర్పడింది.
పెద్దలకు గుర్తు చేయాల్సిన బాధ్యత కూడా.

'ఏ దయా మీ దయా మా మీద లేదు ఇంత నిర్లక్ష్యమా ఇది మీకు తగదు
పావలా అర్ధయితే పట్టేది లేదు ముప్పావలా అయితే ముట్టేది లేదు
హెచ్చు రూపాయయితే పుచ్చుకుంటాము
అయ్యవారికి చాలు ఐదు వరహాలు పిల్లవారికి చాలు పప్పు బెల్లాలు'...

ఒకప్పుడు దసరా వస్తే పిల్ల దండును వెంట బెట్టుకుని అయ్యవార్లు బయలుదేరేవారు. ఇంటింటికి తిరిగేవారు. మామూళ్లు స్వీకరించేవారు. ఆ రోజుల్లో ఊళ్లలో బడి కొత్త. చదువు కొత్త. అయ్యవార్లకు జీతాలు అంతంత మాత్రం. సంవత్సరంలో నేర్పిన విద్య దసరా సెలవుల్లో పెద్దల ముందు అయ్యవార్లు పిల్లల చేత ప్రదర్శింపచేసేవారు. పిల్లల తెలివితేటలు చూసి పెద్దలు ముచ్చట పడేవారు. బడికి చందాలు, అయ్యవార్లకు మామూళ్లు ఇచ్చేవారు. ఆ సమయంలో ఇలా పైన రాసిన పాట పాడేవారు. ఇంతకీ వరహా అంటే మూడున్నర రూపాయి.

దసరా కోసం పిల్లలు ఎదురు చూసేవారు. ఆ సమయంలో పిల్లల్ని బంధువుల వద్దకు పంపుతామనే హామీ ఉండేది. అవ్వా, తాతల దగ్గరికో, బాబాయి దగ్గరికో, మేనత్త ఊరికో నాలుగు జతలు పెట్టుకుని పిల్లలు ఉత్సాహంగా వెళ్లేవారు. దసరా సెలవులు హాయిగా గడిపేవారు.

దసరా వేషాలు

దసరాలో పిల్లలకు, పెద్దలకు ఆసక్తి దసరా వేషాలు. చాలా మంది కళాకారులు పురాణ వేషాలు కట్టి ఇళ్ల ముందుకు వచ్చి కానుకలు స్వీకరించేవారు. పిల్లలకు ఈ వేషాలు చూడటం మహా సరదా. సీతారాములు, హనుమంతుడు, నారదుడు, శివుడు, అర్ధ నారీశ్వరుడు... ఇక పులి వేషాలు తప్పనిసరి. ఆ రోజుల్లో పులిని చూడటం అరుదు కాబట్టి (సినిమాల్లో తప్ప) మనిషే పులి రూపు కట్టి ఎదురు పడితే అబ్బురపడేవారు. తప్పెట్ల మోతకు వేషగాళ్లు లయబద్ధంగా ఆడుతుంటే నోరు తెరిచి చూసేవారు. నేలన పడేసిన రూపాయి కాసునో నిమ్మకాయనో పులి వేషగాడు నోట కరవడం ఒక ఘట్టం. దసరా నవరాత్రులు వైభవంగా జరుగుతాయి కదా. అలా ఎవరైనా ఎప్పుడూ కళకళలాడుతూ ఉంటే 'దసరా బుల్లోడు' అనడం ఆనవాయితీ.

బొమ్మల కొలువులు

ఇక బొమ్మల కొలువు పెట్టి ఆనందించడం ఆడపిల్లల వంతు. బొమ్మల కొలువును ఎప్పుడూ బేసి సంఖ్య మెట్ల మీద ఏర్పాటు చేస్తారు. ఇంటి ఆచారాన్ని బట్టి ఇంటి ఆడపిల్ల చేత పార్వతీ పరమేశ్వరులను గాని, సీతారాములను గాని, రాధాకృష్ణులను గాని, లక్ష్మీ సరస్వతులను గాని పెట్టిస్తారు, అమ్మాయి మొదటి దేవతా మూర్తిని పెట్టాక, ఆ యేడు కొన్న కొత్త బొమ్మను తల్లి కూడా పట్టుకుని పెట్టిస్తుంది. ప్రతి ఏడు ఒక కొత్త బొమ్మ తప్పనిసరిగా కొనడం ఆచారం. ఈ క్రమం లోనే, కొండపల్లి బొమ్మలు, నక్కపల్లి బొమ్మలతో పాటు దేశదేశాల బొమ్మలు సేకరించి బొమ్మల కొలువులో పెట్టడం వ్యాప్తి లోకి వచ్చింది. అందంగా, కళాత్మకంగా అమర్చిన బొమ్మల కొలువు పేరంటానికి బంధు మిత్రులను పిలిచి తొమ్మిది రోజులూ పేరంటం చేస్తారు. పేరంటానికి పిల్లలూ పెద్దలూ కూడా వస్తారు. బొమ్మలకు హారతి ఇచ్చి ప్రసాదం పంచిపెడతారు.

బతుకమ్మ

తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమయిన పండగ బతుకమ్మ. బతుకమ్మ పండగ వస్తోందంటే తెలంగాణా పల్లెల్లో నూతన ఉత్సాహం వెల్లి విరుస్తుంది. అది ఒక పెద్ద సంబరంగా భావిస్తారు. ఇళ్ళు శుభ్రపరుస్తారు. చక్కగా అలంకరించు కుంటారు. ఆడపిల్లల్ని పుట్టింటికి తీసుకు వస్తారు. అత్తగారింట్లో వుండే ప్రతి ఆడపిల్లా పుట్టింటికి వెళ్లడం కోసం ఎదురు చూస్తుంటుంది. రంగు రంగుల పూలతో త్రికోణాకారంలో పేర్చి అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు చరుస్తూ వలయంగా తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడతారు. బొడ్డెమ్మతో మొదలు ఎంగిలిపువ్వు బతుకమ్మ, సద్దుల బతుకమ్మ.. ఇలా దేని ప్రత్యేకత దానిదే.. తొమ్మిది రోజుల పాటు సాగే ఈ బతుకమ్మలను నీటి ప్రవాహంలో నిమజ్జనం చేస్తారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అని సాగే ఈ పాటల్లో మహిళలు తమ కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు, భక్తి, భయం, చరిత్ర, పురాణాలు మేళవిస్తారు. ఈ పాటలు చాలా వినసొంపుగా ఉంటాయి.



పటాలు, విగ్రహాలు




సంతృప్తికరమైన సేవ

ఆలయంలో అయినా, ఇంట్లో అయినా పూజను ఎంతో భక్తి శ్రద్ధలతో నిష్ఠగా చేస్తాం. ఇంట్లో ఉండే దేవతా మూర్తుల విగ్రహాలు, పటాలు, ఫొటో ఫ్రేములు జారిపడినా, పక్కకు ఒరిగిపోయినా అపశకునంగా భావిస్తారు. అందుకే మరింత శ్రద్ధగా పూజ చేయడంతోపాటు, పూజాసామగ్రిని ఎంతో జాగ్రత్తగా భద్రపరుస్తుంటారు. అయినప్పటికీ కొన్నిసార్లు విగ్రహాలు పాతబడి విరిగి పోవడం, ఫొటో ఫ్రేములు చిరిగిపోవడం లేదా తుప్పు పట్టి పాడైపోవడం జరుగుతుంటుంది. అలాంటి వాటిని వెంటనే తీసేసి కొత్తవాటిని పూజలో పెట్టుకుంటారు. మనలో చాలామంది ఇలానే పడేస్తుంటాము. తృప్తి గైక్వాడ్ మాత్రం ఈ విగ్రహాలను పడేయకుండా.. రీ సైకిల్ చేసి రకరకాల వస్తువులను తయారు చేస్తోంది. చెత్తగా మారకుండా... సరికొత్త హంగులు అద్ది అందంగా మారుస్తోంది.



మహారాష్ట్రలోని యోవలాలో పుట్టి పెరిగిన తృప్తి గైక్వాడ్ వృత్తిపరంగా నాసిక్‌లో స్థిరపడింది. న్యాయవాదిగా క్షణం తీరికలేని పని తనది. అయితే తన చుట్టూ ఉన్న సమాజంలో జరిగే విషయాలను ఎంతో ఆసక్తిగా గమనించే మనస్తత్వం కావడం వల్ల 2019లో ఓసారామె గంగానదిని చూడడానికి వెళ్లింది. అప్పుడు గంగానదిని వరదలు ముంచెత్తుతున్నాయి. ఇదే సమయంలో ... విరిగిపోయిన దేవతా మూర్తుల విగ్రహాలు, ఫ్రేములు తీసుకుని నదిలో వేయడానికి వచ్చాడు ఒకతను. అతన్ని చూసిన తృప్తి..''వీటిని నదిలో వేయకు. వీటిలో ఉన్న పేపర్, కార్డ్‌బోర్డ్, మట్టిబొమ్మలు నదిని మరింత కలుషితం చేస్తాయి'' అని చెప్పి అతను వాటిని నదిలో వేయకుండా వారించింది. అందుకు ఆ వ్యక్తి ఇక్కడ వేయవద్దు.. మరి వీటిని ఏం చేయాలి?'' అంటూ చికాకు పడ్డాడు. అప్పటికేదో సమాధానం చెప్పి అతణ్ణి పంపింది కానీ తృప్తి మనసులో కూడా 'అవును వీటిని ఏం చేయాలి?' అన్న ఆలోచన మొదలైంది. కొద్దిరోజులు తర్వాత వీటిని రీ సైకిలింగ్ చేసి ఇతర వస్తువులు తయారు చేయవచ్చన్న ఆలోచన తట్టింది తనకు. తన ఐడియాను కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ఇరుగుపొరుగుతో పంచుకుంది. అంతా ప్రోత్సహించేసరికి .. పాత దేవతామూర్తుల విగ్రహాలు రీసైకిల్ చేయడం ప్రారంభించింది.

"దేవతల విగ్రహాల ఫొటోఫ్రేములను చక్కగా అలంకరించి నిష్ఠగా పూజిస్తారు. ఇటువంటి ఫ్రేములు పాడైతే పడేయాల్సిందే. ఇది నచ్చకే సంపూర్ణమ్‌ను తీసుకొచ్చాను. దేవుడి విగ్రహాలను శాస్త్రోక్తంగా నిమజ్జనం చేసిన తరువాతే రీసైక్లింగ్ చేస్తున్నాను. వాట్సాప్, ఫేస్‌బుక్‌ల చాలా మంది కస్టమర్లు నన్ను సంప్రదిస్తున్నారు. 2019 నుంచి ఇప్పటిదాకా వేల సంఖ్యలో రీసైక్లింగ్ చేసి పర్యావరణాన్ని కాపాడాను. అదేవిధంగా దేవుడి పటాలకు మంచి రూపాన్ని ఇవ్వడం ఎంతో తృప్తినిస్తోంది".
– తృప్తి గైక్వాడ్

సంపూర్తిగా...

విగ్రహాలను రీసైక్లింగ్ చేసేందుకు 'సంపూర్ణమ్' పేరిట స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసింది. సంపూర్ణమ్ టీమ్ దేవతామూర్తుల పాతవిగ్రహాలు, ఫొటోఫ్రేములను గుళ్లు, చెట్లకింద పడి ఉన్న వాటిని, ఇళ్లనుంచి సేకరిస్తుంది. ఈ విగ్రహాలను పూర్తిగా పొడిచేసి మొక్కలకు ఎరువులా మారుస్తారు. ఎరువుగా పనికిరాని ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కలిసిన మట్టిని కుండలు, పాత్రలు, ఇటుక రాళ్లుగా తయారు చేస్తారు. వీటితో పక్షులు, జంతువులకు గూళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇలా తయారైన పాత్రల్లో పక్షులు, జంతువులకు ఆహారం, తాగునీటిని అందిస్తున్నారు.



సంపూర్ణమ్ సేవలను మహారాష్ట్రలోని పూనే, నాసిక్, ముంబై, సోలాపూర్, సంగమ్నేర్‌లకు విస్తరించింది తృప్తి. ఇటీవల ఇతర రాష్ట్రాల్లో సైతం సేవలను ప్రారంభించింది. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ద్వారా ఈ రీసైక్లింగ్ గురించి అవగాహన కల్పిస్తోంది.

ఆకర్షణీయమైన టాయిస్..

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కలిసిన విగ్రహాలను పొడిగా మార్చి, ఈ పొడికి కొద్దిగా సిమెంట్‌ను కలిపి టాయిస్‌ను రూపొందిస్తున్నారు. మురికివాడల్లోని నిరుపేద పిల్లల ద్వారా పాతవిగ్రహాలు, ఫొటోఫ్రేమ్‌లనూ సేకరిస్తూ వారికి ఆర్థికంగా సాయపడుతోంది.

న్యూస్ మేకర్

కల్లోల ఇజ్రాయెల్‌లో ఇండియన్ సూపర్ ఉమెన్



బతికి ఉంటే బలుసాకు తిని బతకవచ్చు... అనుకునే భయానక పరిస్థితుల్లో ఉండి కూడా, తమకు ఏమైనా ఫరవాలేదు, నిస్సహాయులైన వృద్ధదంపతులకు ఏమీ కాకూడదని వారిని కంటికి రెప్పలా కాపాడారు ఇజ్రాయెల్‌లో హోమ్ నర్సులుగా పనిచేస్తున్న కేరళకు చెందిన సబిత, మీరా మోహన్‌లు...

దక్షిణ ఇజ్రాయెల్...

గాజా సరిహద్దుకు రెండో కిలోమీటర్‌ల దూరంలో ఉన్న నిర్ ఓజ్ కిబ్బట్జ్ పట్టణంలో ఒక ఇంట్లో...

85 సంవత్సరాల షొలిక్, 76 సంవత్సరాల రహెల్ దంపతులకు నలుగురు పిల్లలు. పిల్లలు వేరు వేరు ప్రాంతాలలో ఉంటున్నారు. రహెల్ అనారోగ్యంతో బాధ పడుతోంది. ఆమెను చూసుకోవడానికి ఆరోజు ఆ ఇంట్లో సబిత, మీరా మోహన్ అనే ఇద్దరు హోమ్‌నర్స్‌లు ఉన్నారు.

ఉదయం ఆరున్నర ప్రాంతంలో సైరన్ మోత వినిపించింది. ప్రజలు బాంబ్ షెల్టర్‌లలో తల దాచుకోవాలని చెప్పే సైరన్ అది.

'ఆ ఉదయం సైరన్ మోగేసరికి గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. సెకండ్ల వ్యవధిలో సేఫ్టీరూమ్‌లోకి వెళ్లాలి. ఇంతలో రహెల్ కుమార్తె నుంచి ఫోన్ వచ్చింది. బయట పరిస్థితి భయానకంగా ఉంది అని ఆమె చెప్పింది. మాకు ఏం చేయాలో తోచలేదు. ఇంటి ముందు, వెనుక తలుపులకు తాళాలు వేసి అమ్మానాన్నలను తీసుకొని, పాస్‌పోర్ట్, డైపర్‌లు, యూరిన్ పాట్, మందులతో సెక్యూర్ రూమ్‌లోకి వెళ్లాలని ఆమె చెప్పింది. షొలిక్, అనారోగ్యంతో ఉన్న రహెల్‌ను నడిపించుకుంటూ షెల్టర్ రూమ్‌లోకి వెళ్లాం. ఈలోపే మిలిటెంట్‌లు ఇంట్లోకి ప్రవేశించారు. అద్దాలు బద్దలు కొట్టారు. వస్తువులు ధ్వంసం చేశారు. షెల్టర్‌రూమ్‌పై కాల్పులు జరుపుతున్నారు. ఐరన్ డోర్ వెనకే మా శరీరాలను గట్టిగా ఆనించి ఎన్నో గంటలపాటు నిల్చున్నాం. అదృష్టవశాత్తు ఐరన్ డోర్ ధ్వంసం కాలేదు. ధ్వంసం అయి ఉంటే ఎవరి ప్రాణాలు మిగిలేవి కావు' అంటూ ఆ భయానక ఘటనను గుర్తు తెచ్చుకుంది 39 సంవత్సరాల సబిత.



• మీరా మోహన్, సబిత

కేరళకు చెందిన సబిత, మీరా మోహన్‌ల సాహసం, మానవత్వం గురించి ఢిల్లీలోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం 'ఇండియన్ సూపర్ ఉమెన్' అంటూ ప్రశంసించింది.

టిప్స్



• రెండు కర్పూరం బిళ్లలు, మూడు కప్పుల వేపాకుల్లో కొద్దిగా కొబ్బరి నూనె వేసి పేస్టుచేయాలి. ఈ మిశ్రమాన్ని చుండ్రు ఉన్న ప్రాంతంలో రాసి మర్దన చేయాలి. చుండ్రు బాధ క్రమంగా తగ్గిపోతుంది. కర్పూరం పొడిని ఆలివ్ నూనెలో వేసి కలిపి జుట్టుకు పట్టించినా చుండ్రు తగ్గుతుంది.

ఈ రెండింటిలో ఏదైనా ఒకటి వారానికి మూడుసార్లు చేస్తే ఉపశమనం త్వరగా వస్తుంది.

• కాలివేళ్ల సందుల్లో గాలి తగలక పాచిపడుతుంటుంది. ఇలా జరగకుండా ఉండాలంటే...కాళ్లను శుభ్రంగా కడిగి, తడిలేకుండా తుడవాలి. ఇప్పుడు టూత్‌పేస్టుని వేళ్ల సందులో రాయాలి. రోజూ పడుకునేముందు ఇలా చేస్తే కాళ్లు పాయవు.



హాబీతో వయసును ఓడించాను

సాధారణంగా 65 ఏళ్ల వయసులో మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పి అంటూ బాధ పడేవారిని చూస్తుంటాం. కానీ, రవి బాల శర్మ బాలీవుడ్ తారలకు దీటుగా డ్యాన్సులు చేస్తూ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తున్నారు. ఆమె అసలు పేరుకన్నా 'డాన్సింగ్ దాదీ'గా ఫేమస్ అయ్యింది. మహిళలే కాదు యువత కూడా ఆమె డ్యాన్స్ స్టెప్పులకు ఆశ్చర్యపోతూ ఫాలో అవుతున్నారు. ఈ వయసులో పూజలు చేసుకోకుండా డ్యాన్సులు ఏంటి అనేవారికి మీలో స్కిల్స్ లేకనే ఇలాంటి విమర్శలు చేస్తున్నారని ఘాటుగా సమాధానం చెబుతుంది. ఇంతకీ ఎవరీ రవి బాల శర్మ...

''నా పేరు ముందు రవి అని అబ్బాయిల పేరు ఉంటుంది. మా చెల్లి పేరు శశి ప్రభ శర్మ అంటే చంద్రుడు. నా పేరులో సూర్యుడు ఉండాలని రవి అని నాన్న అనుకున్నారట. అందుకే బాల అనే నా పేరు ముందు రవి చేర్చారు. చాలా మంది నా పూర్తి పేరు తెలుసుకోకుండా మిస్టర్ అని సంబోధిస్తుంటారు. నేను స్కూల్ టీచర్‌గా చేసే రోజుల్లో ప్రమోషన్ జాబితాలో నా పేరు కనిపించలేదు. విషయమేంటని ఆరా తీస్తే మగ టీచర్ల జాబితాల్లో నా పేరు ఉందని తెలిసింది.

సంగీత వారసత్వం

ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో పుట్టి పెరిగాను. మా ఇంట్లో ఎప్పుడూ సంగీత వాతావరణం ఉంటుంది. మా నాన్న సంగీత ఉపాధ్యాయుడు. అనేక వాద్యాలను వాయించేవాడు. ఆయన దగ్గరే శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నాను. మా అమ్మ కూడా చాలా బాగా పాడేది. కానీ, పిల్లల పెంకంలో ఆమె ఎప్పుడూ బిజీగా ఉండేది. మా నాన్న కొడుకు, కూతురు అనే తేడా చూడలేదు. నా కూతుళ్లు తమ కాళ్లపై తాము నిలబడగానే పెళ్లి చేస్తానని చెబుతుండేవాడు. దీంతో ఎవరిపైనా ఆధారపడాల్సిన అవసరం రాలేదు. పాడటమే కాకుండా కథక్ డ్యాన్స్‌లో శిక్షణ తీసుకున్నాను. సితార్, తబలా కూడా వాయిస్తాను. హిందీలో మాస్టర్స్ డిగ్రీ తీసుకున్నాను. 27 ఏళ్లుగా ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలలో మ్యూజిక్ టీచర్‌గా ఉన్నాను. పెళ్లయ్యాక ఇల్లు, పిల్లలు, స్కూలు బాధ్యతలతో బిజీ అయిపోయాను. నా ఆసక్తుల గురించి పట్టించుకోలేదు. స్కూల్లో పిల్లలకు సంగీతం నేర్పించడంలో ఎంతో సంతృప్తి ఉండేది. కానీ, సంగీతం టీచర్లకు మిగతా టీచర్లకు ఉన్నంత ప్రాధాన్యత ఉండేది కాదు.





కొడుకుతో కలిసి..

నా భర్తకు కేన్సర్ అని తెలియగానే కుప్పకూలిపోయాం. అతని మరణం నన్ను బాగా కుంగదీసింది. కూతురికి పెళ్లయ్యింది. మా అబ్బాయి ఏకాంష్ రచయిత, నటుడు. దీంతో అతనితో పాటు ముంబై వచ్చాను. లాక్డౌన్ సమయంలో మా అబ్బాయి సోషల్ మీడియా అకౌంట్‌ను క్రియేట్ చేశాడు. నన్ను విషాదం నుంచి తేరుకునేలా చేసేందుకు కొన్ని వీడియోలు షూట్ చేసేవాడు. ఆ తర్వాత వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ప్రారంభించాడు. వాటిని చూసి, వస్తున్న ప్రశంసలు చూసి నేనూ చాలా ఎంజాయ్ చేయడం మొదలుపెట్టాను. మొదట్లో పెద్దగా వ్యూస్ రాకపోయినా తర్వాత ఫేమస్ అయ్యాను.



రవి బాల శర్మ

వైరల్ అయిన విధం..

గాయకుడు, గేయ రచయిత దిల్జీత్ దోసాంజ్ పాటకు డ్యాన్స్ చేసి, ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తే, ఆ వీడియోను అతను షేర్ చేయడంతో తెగ వైరల్ అయ్యింది. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. నా డ్యాన్స్ టాలెంట్ నన్ను సోషల్ మీడియాకు 'డ్యాన్స్ దాది'ని చేసింది. లక్షలాది మంది అభిమానులను తెచ్చిపెట్టింది.

బాలీవుడ్ తారలు

ఏ నటి పాటతో డ్యాన్స్ చేసినా ఆమె నా వీడియోను షేర్ చేసేంతగా పేరు రావడం నిజంగా ఆశ్చర్యమనిపించింది. ఈ వయస్సులో డ్యాన్స్ చేయడం చూసి వాళ్లు ఆశ్చర్యపోతుంటారు. కానీ నా వయస్సును హాబీకి దూరంగా ఉంచుతున్నాను. నృత్యం నా హాబీ. అది నన్ను నా మనసులో ఎప్పుడూ యవ్వనంగా ఉంచుతుంది. నా డ్యాన్స్ వీడియోలు చూసిన తర్వాత చాలామంది మహిళలు 'మీ నుంచి చాలా స్ఫూర్తి పొందుతున్నామ'ని చెబుతుంటారు. చాలా మంది యువకులు కూడా నా డ్యాన్స్ ఫాలో అవుతున్నారు. కొందరు మాత్రం 'ఈ వయసులో పూజలు చేసుకోకుండా, డ్యాన్స్ ఎందుకు, నడుం పట్టేస్తుంది జాగ్రత్త' అని కామెంట్స్ చేస్తుంటారు. అలాంటి వారికి నేను భయపడను. వారికి డ్యాన్స్‌లో స్కిల్ లేదు. కాబట్టి, వారికి ఆ కళ తెలియదు. విమర్శించేవారు వారి వ్యక్తిగత చిరాకుల కారణంగానే అలాంటి కామెంట్స్ చేస్తారు అనిపిస్తుంది. కొందరికి ఇష్టం ఉన్నా తమలో ఉన్న బిడియం వల్ల డ్యాన్స్ చేయలేరు. ఇంకొందరు తమకు నచ్చినది ఇతరులు చేయడం చూస్తే 'నేనెందుకు చేయలేకపోయాను' అని బాధపడతారు. ఇది ఒకరకమైన మానసిక రుగ్మత తప్ప మరొకటి కాదు. అలాంటి వారిపై మన శక్తిని వృథా చేయకూడదు. ఎందుకంటే అది మనల్ని ముందుకెళ్లకుండా ఆపుతుంది.




వయసు ఓ సంఖ్య మాత్రమే!

హృదయంలో పిల్లల్లాగే ఉండి, హాబీస్‌తో జీవిస్తున్నట్లయితే మిమ్మల్ని ముందుకు వెళ్లకుండా ఎవ్వరూ ఆపలేరు. అదే, ఎన్నో విషాదాలను వెనక్కి నెట్టేస్తుంది. మీ హాబీ మిమ్మల్ని యంగ్‌గా ఉండటానికి సహాయపడుతుంది. ఇలాంటప్పుడు వయసు తన ప్రభావాన్ని చూపడంలో ఎప్పుడూ ఫెయిల్ అవుతుంది. నేను డాన్స్ చేయకపోతే వయసు నన్ను ఓడించేది. కానీ, నా హాబీని సజీవంగా ఉంచుకుని, దానిని పూర్తి స్థాయిలో జీవించడం ద్వారా వయసును ఓడించాను'' అని ఆనందంగా తెలియజేస్తారు ఈ డ్యాన్సర్.